www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

జూట్ బ్యాగులు తయారుచేస్తున్నా

బ్యాంకు రూ.రెండు లక్షల ముద్రారుణం ఇచ్చింది

సకాల రుణ చెల్లింపుతో మరో 9.5 లక్షలు ఇచ్చారు

వ్యాపారాన్ని విస్తరించా.. నా వద్ద 15మంది పనిచేస్తున్నారు

ప్రధానితో ఏపీకి చెందిన ముద్రా లబ్ధిదారు మాటామంతీ

14



బుధవారం | 9-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 354 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: ద్వాదశి రా.10:56 తదుపరి త్రయోదశి, నక్షత్రం: మఖ ఉ.9:57 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.6:46-రా.8:31, దుర్ముహూర్తం:ఉ.11:52-12:41, అమృతఘడియలు: ఉ.7:20-9:04, తె.5:20 మొదలు, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: ఉ.6:07, సూర్యాస్తమయం: 6:26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిల్లుల ఆమోదానికి గవర్నర్ కాలయాపన

చట్ట విరుద్ధం

గవర్నర్లకు రాజ్యాంగం వీటో అధికారాలివ్వలేదు

వారు మంత్రివర్గ సూచనలకు కట్టుబడాల్సిందే.. ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుకారాదు

తమిళనాడు అసెంబ్లీ గవర్నర్‌కు పంపిన 10 బిల్లులూ ఆమోదం పొందినట్టే

వాటిపై రాష్ట్రపతి తదుపరి చర్యలూ చెల్లవ్.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

బిల్లులపై నిర్ణయానికి గవర్నర్లకు నెల నుంచి మూణ్నెల్ల దాకా గడువు

ఈ తీర్పుతో ఇకపై తమిళనాడు వర్సిటీలకు ముఖ్యమంత్రి స్టాలినే చాన్స్‌లర్

వీసీల నియామకాలకు దారి సుగమం.. సుప్రీం తీర్పు చరిత్రాత్మకం: ఎంకే స్టాలిన్

రాజ్‌భవన్‌ను వీడి వెళ్లిపోవాలంటూ గవర్నర్‌కు డీఎంకే, మిత్రపక్షాల డిమాండ్

ఎన్నికైన ప్రజాప్రభుత్వాలు చట్టసభల్లో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపకుండా, అలాగని వెనక్కి పంపకుండా.. ఏళ్లతరబడి కాలయాపన చేసే కొందరు గవర్నర్ల తీరుకు ఫుల్‌స్టాప్ పెడుతూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది! తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను దాదాపు మూడేళ్లుగా ఎటూ తేల్చకుండా నానుస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవిపై స్టాలిన్ సర్కారు వేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. తమకున్న విశేషాధి కారాలను ఉపయోగించుకుని, ఆ బిల్లులు ఆమోదం పొందినట్టేనని ప్రకటించింది. అంతేనా.. ఇకపై, చట్టసభలు పంపే బిల్లులపై నిర్ణయాలు తీసుకోవడానికి గవర్నర్లకు గడువు విధిస్తూ సంచలన ఆదేశాలు జారీచేసింది!!



చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమిళనాడు ప్రభుత్వం పంపిన 10 బిల్లులపై ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా మూడేళ్ల పాటు తొక్కిపెట్టడం చట్టవిరుద్ధం, ఏకపక్ష చర్య అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ బిల్లుల విషయంలో గవర్నర్ సదుద్దేశంతో వ్యవహరించలేదని, తాము ఓ కేసులో తీర్పు ఇచ్చిన తర్వాత ఆ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపారని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. ప్రభుత్వం రెండోసారి పంపినప్పుడైనా గవర్నర్ ఆ బిల్లులను ఆమోదించి ఉండాల్సిందని అభిప్రాయపడింది. ఆర్టికల్ 142 ప్రకారం తనకున్న విశేషాధికారాలను వినియోగించుకుని.. స్టాలిన్ సర్కారు రెండోసారి గవర్నర్‌కు పంపినప్పుడే ఆ పది బిల్లులూ ఆమోదం పొందినట్టేనని పేర్కొంటూ

మిగతా 2వ పేజీలో...



పీ4 పటిష్ఠ అమలుకు ప్రత్యేక సొసైటీ

చైర్మన్‌గా సీఎం, వైస్ చైర్మన్‌గా డిప్యూటీ సీఎం

మార్గదర్శులను గుర్తించే బాధ్యత కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలకు

సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాన్ని విస్తృతపరిచేలా పటిష్ఠ వ్యవస్థను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. పీ4 అమలు కోసం రాష్ట్రస్థాయి సొసైటీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొసైటీకి ముఖ్యమంత్రి చైర్మన్‌గా, డిప్యూటీ సీఎం వైస్‌చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అలాగే, సీఈవో, డైరెక్టర్, వారికి అనుసంధానంగా కాల్‌సెంటర్, టెకీల బృందం, ప్రోగ్రాం బృందం, వింగ్ బృందం ఉంటాయి. జిల్లాస్థాయిలో

మిగతా 13వ పేజీలో...

పోలవరం-బనకచర్ల కోసం జలహారతి కార్పొరేషన్

సీఎం చైర్మన్, మంత్రి వైస్ చైర్మన్

ఎండీ-సీఈవోగా ప్రత్యేక సీఎస్

3

ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,112 కోట్లు

బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాల సేకరణ

ప్రభుత్వ బాండ్ల ద్వారానూ నిధులు

పరామర్శలో అరాచకం!

జగన్నాటకం..!



శ్రీసత్యసాయి జిల్లా కుంటిమద్ది సమీపంలో హెలికాప్టర్‌ను చుట్టుముట్టిన వైసీపీ శ్రేణులు, వలయంగా ఏర్పడి జగన్‌ను తీసుకువస్తున్న పోలీసులు

జగన్ పర్యటనలో హైడ్రామా

పరామర్శకు వెళ్లి.. బల ప్రదర్శన

హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణుల ఇష్టారాజ్యం

బారికేడ్లు విరిచి.. పోలీసులను పక్కకు తోసి..

హెలికాప్టర్ చుట్టూ మూగిన వైనం

పైలెట్ బ్యాగ్ తస్కరణ?

భద్రతా వైఫల్యంగా చిత్రీకరించే కుట్ర!?

విండ్‌షీల్డ్ దెబ్బతిన్నదని వెల్లడి

అదే నిజమైతే.. హెలికాప్టర్ ఎలా ఎగిరింది?

రోడ్డు మార్గంలో బెంగళూరుకు జగన్

(అనంతపురం/పుట్టపర్తి/అమరావతి - ఆంధ్రజ్యోతి)

పేరు.. పరామర్శ కోసం పర్యటన! చేసింది.. బల ప్రదర్శన!

స్వీయ నియంత్రణ లేదు. క్రమశిక్షణ అసలే లేదు. పోలీసులన్నా లెక్కలేదు. అంతా అడ్డగోలుతనం! వెరసి... మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ 'పరామర్శ యాత్ర' ఒక అరాచక పర్వాన్ని తలపించింది. చేయాల్సిందంతా చేసి... 'పోలీసులు తగిన భద్రత కల్పించలేదు. హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినడంతో జగన్ రోడ్డు మార్గాన వెళ్లాల్సి వచ్చింది' అంటూ హైడ్రామాకు తెరలేపారు. విండ్‌షీల్డ్ దెబ్బతినడం నిజమే అయితే... మరమ్మతులు చేయకుండా మళ్లీ గాలిలోకి ఎగిరే అవకాశమే లేదు. కానీ... జగన్‌ను అక్కడ వదిలేసి, పైలట్ ఎంచక్కా బెంగళూరుకు వెళ్లిపోయాడు. ఒకవేళ నిజంగానే దెబ్బతిని ఉంటే... దానికి కారణం, వైసీపీ నేతలు, కార్యకర్తల

మిగతా 13వ పేజీలో...



ఎస్పీ వి.రత్న

భద్రతా వైఫల్యం లేదు!

1100 మంది పోలీసులతో భద్రత

హెలిప్యాడ్ వద్ద 250 మంది పోలీసులు

రెచ్చగొట్టినా సంయమనం పాటించాం

నిబంధనలకు విరుద్ధంగా జన సమీకరణ

హెలికాప్టర్ డోర్ పట్టుకుని లాగారు: ఎస్పీ



పోలీసుల బట్టలూడదీస్తా!

వాళ్ల ఉద్యోగాలు పీకేస్తాం

జగన్ హెచ్చరిక

అమెరికా..

కలలు కల్లలు!

విద్యార్థులపై ట్రంప్ సర్కారు మరో పిడుగు



కారు వేగంగా నడిపారని, లైసెన్స్ లేదని..

స్టూడెంట్ వీసాలు ఎడాపెడా రద్దు

కాలేజీలకూ సమాచారం ఇవ్వని అధికారులు

వీసా రద్దుతో పాటు స్వీయ బహిష్కరణ కూడా

హార్వర్డ్ నుంచి స్టాన్‌ఫోర్డ్ వరకు ఇదే తీరు

వర్క్ వీసా రద్దుకు ట్రంప్ సర్కారు యోచన

ఓపీటీని ముగించాలని కాంగ్రెస్‌లో బిల్లు

వేలాది మంది భారతీయ విద్యార్థుల్లో గుబులు

హెచ్-1బీకి మారాలని నిపుణుల సూచనలు

దేశం విడిచి వెళ్తే రావడం కష్టమని హెచ్చరిక

చైనాపై ట్రంప్ బాదుడు 104 శాతానికి..

అమెరికా టారిఫ్‌లపై చర్చలే మార్గం: జైశంకర్

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 8: అమెరికా చదువులు ఉద్యోగ భరోసాకు, ఆ దేశంలో శాశ్వత నివాసానికి బాటలు వేస్తాయన్న ధీమా సడలిపోతోంది. ఒకవైపు వర్క్ వీసా రద్దు చేయాలని భావిస్తోన్న ట్రంప్ సర్కారు... మరోవైపు విదేశీ విద్యార్థి వీసాలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే రద్దు చేస్తోంది. హెచ్-1బీ వీసా జారీకి కీలకమైన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్ రద్దు యోచన విదేశీ విద్యార్థులపై ప్రత్యేకించి స్టెమ్ కోర్సులు అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది. ఓపీటీని ముగించాలని కోరుతూ అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన కొత్త బిల్లు వారిలో ఆందోళన రేపుతోంది. వృత్తిపరమైన అనుభవాన్ని పొందడానికి, దీర్ఘకాలిక ఉపాధి వీసాలకు మారడానికి ఓపీటీపై ఆధారపడుతున్న అమెరికాలోని వేలాది మంది భారతీయ విద్యార్థుల కెరీర్ అవకాశాలను ఈ చర్య దెబ్బతీసే ప్రమాదం ఉంది. 2023-24 విద్యా సంవత్సరంలో భారత్‌కు చెందిన 3,31,602 మంది విద్యార్థులు అమెరికాకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 23% ఎక్కువ. వీరిలో సుమారు 97,556 మంది ఓపీటీలో పాల్గొన్నారు. ఓపీటీ రద్దుకు గతంలో చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ ప్రస్తుతం ట్రంప్ హయాంలో వలస వ్యతిరేక విధానాలు విస్తృతంగా అమలవుతున్న తరుణంలో ఈ బిల్లు తెరపైకి రావడం ఎఫ్-1, ఎం-1 వీసాదారుల్లో గుబులు రేపుతోంది. వీరిలో చాలామంది ఇప్పుడు తమ వీసాను హెచ్-1బీకి మార్చుకోవడానికి దోహదం చేసే ఉద్యోగాల కోసం భారతీయ టెక్ సంస్థల సహకారంతో



మిగతా 2వ పేజీలో...

సింగపూర్ స్కూల్లో అగ్నిప్రమాదం

పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలు

చేతులు, కాళ్లపై కాలిన బొబ్బలు

ఊపిరితిత్తుల్లోకి పొగ.. ఆసుపత్రిలో చికిత్స

ఓ విద్యార్థిని మృతి.. గాయపడ్డ మరో 20 మంది

మన్యం పర్యటన ముగించుకుని సింగపూర్‌కు పవన్

డిప్యూటీ సీఎంకు ఫోన్ చేసి పరామర్శించిన ప్రధాని



అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న విద్యార్థులను రక్షిస్తున్న సహాయ సిబ్బంది

14



అల్లూరి జిల్లా సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్స్‌లో చెక్కల వంతెనను ప్రారంభించి, కాఫీ, మిరియాల మొక్కలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

'వలంటీర్' పేరిట వైసీపీ వంచన

12

నియామకాలు, గౌరవ వేతనాలకు ఉత్తర్వులు లేకుండా చేశారు.. ఏ పద్దు కింద వేతనం ఇచ్చారో తెలీదు

రాష్ట్ర యువతను నిండా ముంచారు.. వైసీపీ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల మేరకు భారీ అవినీతికి పాల్పడింది

అల్లూరి జిల్లా కురిడి పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్

వక్ఫ్ భూములకు ఎసరు

"వక్ఫ్ భూములను వాణిజ్య అవసరాలకు వాడొద్దు. వాటిని కమ్యూనిటీ అభివృద్ధి, సంక్షేమం కోసమే వాడాలి.."

- సీఎం చంద్రబాబు.

...ఆ తర్వాత నాలుగు నెలలకే వక్ఫ్‌బోర్డు సీఈవో పేరిట ఓ నోటిఫికేషన్ జారీ అయింది. వ్యాపార, వాణిజ్య అవసరాలు, అభివృద్ధికి వక్ఫ్ భూములను ఉపయోగిస్తామనేది ఆ నోటిఫికేషన్ సారాంశం. ఆసక్తి ఉన్నవారు సంప్రదించవచ్చునని కోరారు. సీఎం ఆదేశాల స్ఫూర్తికి భిన్నంగా, సర్కారు కళ్లు గప్పి ప్రకటన జారీ చేయడమే తప్పు. దీనికితోడు.. కనీస అర్హతలు సైతం నిర్ణయించకుండానే నోటిఫికేషన్ ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. దరఖాస్తుదారులే తమ స్తోమత, ఆదాయం, అనుభవం, నైపుణ్యత గురించి దరఖాస్తులో పొందుపరచాలట! 'అస్మదీయుల' కోసం నలుగురు పెద్దలు వక్ఫ్‌బోర్డును అడ్డుపెట్టుకుని ఈ డొల్ల వ్యవహారం నడిపించారన్న చర్చ రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ వర్గాల్లో మొదలైంది.



30 వేల ఎకరాలపై ఇంటి దొంగల కన్ను!

రాష్ట్ర ప్రభుత్వ కళ్లకు గంతలు

ముస్లింల సంక్షేమానికే వాడాలన్న చంద్రబాబు

నాలుగు నెలల క్రితమే అధికారులకు స్పష్టీకరణ

ఇప్పుడు ప్రభుత్వానికి తెలియకుండా మంత్రాంగం

ఇద్దరు అధికారులు సహా నలుగురు కీలకం

వ్యాపారం పేరిట అస్మదీయులకు ఇచ్చే ఎత్తు

వారి ద్వారా వాటిని అనుభవించాలనే కుయుక్తి

వక్ఫ్‌బోర్డును అడ్డుపెట్టుకుని నోటిఫికేషన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు పరిధిలో 90 వేల ఎకరాల భూమి ఉంది. అందులో 30వేల ఎకరాల భూమి కబ్జాకు గురయింది. మిగిలిన 60 వేల ఎకరాల్లో 30 వేల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. ఆ భూమిని కమ్యూనిటీ సంక్షేమం కోసమే వాడాలని సీఎం చంద్రబాబు నాలుగు నెలల క్రితమే సూటిగా, స్పష్టంగా చెప్పారు. అంటే, ఆ భూములను ముస్లిం వర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాలన్నది ఆయన ఉద్దేశం. కానీ, వేల కోట్ల విలువైన ఆ భూములపై ఇంటిదొంగలకు

మిగతా 12వ పేజీలో...



11

బ్రహ్మ కుమారీస్ అధినేత్రి

దాది రతన్ కన్నుమూత

గాయాలెలా ఉంటాయో

తెలియదు!

నేను గైనకాలజిస్టును

జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి వింత సమాధానం

14

రఘురామ కేసులో ముగిసిన విచారణ

అసలు సహకరించని డాక్టర్

సుప్రీంకు నివేదిక ఇవ్వనున్న ప్రకాశం ఎస్పీ

కాంగ్రెస్ దిద్దుబాట!

క్షేత్రస్థాయి నుంచీ పార్టీ ప్రక్షాళనపై దృష్టి

ఎదురుదెబ్బల నేపథ్యంలో భారీగా సంస్థాగత మార్పులు

ఈ ఏడాది పునర్నిర్మాణంపైనే ఫోకస్: సీడబ్ల్యూసీ

'మతవాదం, హింసతో దేశం విద్వేష అగాధంలోకి కూరుకుపోతోంది'.. అని పేర్కొంటూ తీర్మానం

సర్దార్ పటేల్ అసలైన వారసత్వం కాంగ్రెస్ పార్టీదే: ఖర్గే

అహ్మదాబాద్‌లోని వల్లభ్ భాయ్ మెమోరియల్‌లో భేటీ

నేడు 1,700 మంది ప్రతినిధులతో ప్రధాన సదస్సు



అహ్మదాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్, ఖర్గే, సోనియా

అహ్మదాబాద్, ఏప్రిల్ 8: నానాటికీ కొడిగట్టుకుపోతున్న వైభవాన్ని పునరుద్ధరించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ దిద్దుబాట పట్టింది. ఇటీవలి కాలంలో వరుస ఎదురుదెబ్బలతో బలహీనపడిన పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పార్టీలో భారీ స్థాయిలో సంస్థాగత మార్పులు చేపట్టనున్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. మంగళవారం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేషనల్ మెమోరియల్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో చర్చించిన

మిగతా 2వ పేజీలో...

20 ఏళ్లుగా గుండె ఆపరేషన్లు చేస్తున్న

దొంగ డాక్టర్

బ్రిటన్‌లోని ప్రఖ్యాత డాక్టర్ పేరుతో చెలామణి

మధ్యప్రదేశ్‌లోని ఓ ఆస్పత్రిలో 15 మందికి శస్త్రచికిత్సలు.. వారిలో ఏడుగురు మృతి

2

మొత్తం 15 వేల ఆపరేషన్లు చేసినట్టు ప్రచారం

నేరమేమిటో చెప్పకుండానే నిర్బంధం

» అమెరికాలో భారత మహిళ ఆవేదన

» లగేజీలో పవర్ బ్యాంకు ఉండడంతో అనుమానించిన అధికారులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: చేసిన నేరమేమిటో చెప్పకుండానే అమెరికాలోని అలస్కా విమానాశ్రయంలో 8 గంటల పాటు నిర్బంధించారని భారత మహిళ ఒకరు వాపోయారు. ఇన్‌ఫ్లుయెన్సర్, చాయ్‌పానీ వ్యవస్థాపకురాలు శ్రుతి చతుర్వేది ఈ ఆరోపణ చేశారు. ఆదివారం ఆమె తన స్నేహితురాలు శిల్పతో కలిసి విమానాశ్రయానికి వెళ్లారు. ఇద్దరు వేరువేరు విమానాల్లో బయలుదేరాల్సి ఉంది. తొలుత శిల్ప లగేజీని అక్కడి అధికారులు తనిఖీ చేశారు. ఆమె బ్యాగులో పవర్ బ్యాంకు ఉండడంతో దాన్ని అనుమానించారు. ఆమెను ఒక గదిలో నిర్బంధించారు. దీంతో ఆమె శ్రుతికి మెసేజ్ పెట్టింది. అనంతరం శిల్ప ఫోన్ స్విచ్చాఫ్ అయింది. ఆందోళన చెందిన శ్రుతి అక్కడి పోలీసులను కలిసి సంప్రదించింది. శిల్ప స్నేహితురాలినని చెప్పడంతో ఆమెను కూడా వేరే గదిలో నిర్బంధించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. పురుష అధికారులే ఆమెను తనిఖీ చేశారు. ఈ కారణంగా వెళ్లవలసిన విమానాలు తప్పిపోయాయి. అనంతరం భారత్ చేరుకున్న ఆమె దీనిపై ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

చైనాపై ట్రంప్ బాదుడు 104 శాతానికి!

వాషింగ్టన్, ఏప్రిల్ 8: చైనాపై ట్రంప్ సుంకాల బాదుడు 104 శాతానికి చేరుకుంది! డ్రాగన్ దేశంపై తొలుత 20 శాతం.. ఆ తర్వాత మరో 34 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆ దేశం తమపై 34% మేర ప్రతీకార సుంకం విధించడాన్ని తట్టుకోలేకపోయారు. ఒక్కరోజులోగా ఆ ప్రతీకార సుంకాన్ని ఉపసంహరించుకోవాలని.. లేకుంటే తాను చైనాపై అదనంగా 50% సుంకాన్ని విధిస్తానని సోమవారం హెచ్చరించారు. అయితే, ట్రంప్ బెదిరింపులకు చైనా తలొగ్గలేదు. పైగా.. ఇలాంటి బెదిరింపులకు తాము లొంగబోమని, అమెరికాతో తుదికంటా పోరాడుతామని, తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రతీకారచర్యలు తీసుకుంటామని తెగేసి చెప్పింది. దీంతో చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారని శ్వేతసౌధం వర్గాలు వెల్లడించాయి.

అమెరికా టారిఫ్‌లపై చర్చలే మార్గం: జైశంకర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లపై ప్రతీకార సుంకాలు విధించాలని పలు దేశాలు భావిస్తుండగా, భారత్ మాత్రం చర్చల మార్గాన్ని ఎంచుకొంది. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. ఆయన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో ఫోనులో చర్చలు జరిపారు. ఇరు దేశాలు త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించారు. దీనిపై మరిన్ని సంప్రదింపులు జరపాలని ప్రతిపాదించారు. ప్రధాని మోదీ జరిపిన అమెరికా పర్యటనలో రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు.

అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: వక్ఫ్ సవరణ చట్టం అమల్లోకి వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టం (యాక్ట్ 14 ఆఫ్ 2025)లోని నిబంధనలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. మరోవైపు వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకూడదని కోరుతూ మంగళవారం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్‌వి ముస్లింలను ప్రసన్నం చేసుకునే రాజకీయాలని, 2013లో యూపీఏ తీసుకువచ్చిన వక్ఫ్ చట్టంతో పేద ముస్లింలు వివక్షకు గురయ్యారని ప్రధాని మోదీ అన్నారు. పాత వక్ఫ్ చట్టంతో పేద పస్మండ ముస్లింలకు ఒరిగిందేమీ లేదన్నారు. "యూపీఏ వక్ఫ్‌తో ల్యాండ్ మాఫియా, ఛాందసవాదులకు భూములను ఆక్రమించుకునే వెసులుబాటు కలిగింది" అని విమర్శించారు.

బిల్లుల ఆమోదానికి గవర్నర్ కాలయాపన

చట్టవిరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సంచలన తీర్పు వెలువరించింది. ఇకపై ఆ బిల్లులకు సంబంధించి రాష్ట్రపతి ఏవైనా చర్యలు తీసుకున్నా, అవి చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. అలాగని, తాము గవర్నర్ల అధికారాలను తక్కువ చేయట్లేదని పేర్కొన్న కోర్టు.. గవర్నర్లు తీసుకునే చర్యలన్నీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఉండాలని, ఆ సంప్రదాయాలకు గౌరవమివ్వాలని హితవు పలికింది. మాజీ ఐపీఎస్ అధికారి, కేంద్ర దర్యాప్తు సంస్థలో సైతం పనిచేసిన ఆర్ఎన్ రవి తమిళనాడు గవర్నర్‌గా 2021లో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచీ ఆయనకు స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు సర్కారుకు మధ్య బిల్లుల ఆమోదం విషయంలో ఘర్షణ కొనసాగుతూనే ఉంది. దీంతో.. తాము పంపిన పలు బిల్లుల్లో 10 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా అనవసర కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు సర్కారు 2023 నవంబరులో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు గడువును నిర్దేశించాలని కూడా ప్రభుత్వం తన పిటిషన్‌లో కోరింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుల విషయంలో గవర్నర్ ముందు మూడే మార్గాలు ఉంటాయని ధర్మాసనం పేర్కొంది. ఒకటి.. ఆయా బిల్లులను ఆమోదించడం, రెండు.. వాటిని పెండింగ్‌లో ఉంచి ప్రభుత్వం నుంచి వివరణ కోరడం, మూడు.. ఏదైనా బిల్లు రాజ్యాంగానికి, ఆదేశసూత్రాలకు లేదా ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఉందని భావించినా, జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశంగా భావించినా దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపడం అని గుర్తుచేసింది. ఒకవేళ బిల్లుకు సమ్మతి తెలపకూడదని భావిస్తే గవర్నర్ దాన్ని తనవద్ద పెట్టుకోకూడదని.. పునఃపరిశీలించాలని కోరుతూ తప్పనిసరిగా అసెంబ్లీకి తిప్పి పంపాలని స్పష్టం చేసింది. శాసనసభ దాన్ని మరోసారి యథాతథంగా ఆమోదించి మళ్లీ గవర్నర్ వద్దకు పంపితే దానికి సమ్మతి తెలపడం మినహా గత్యంతరం లేదని, దాన్ని పెండింగ్‌లో పెట్టలేరని, రాష్ట్రపతి పరిశీలనకు పంపలేరని తేల్చిచెప్పింది. ఒకవేళ.. రెండోసారి పంపిన బిల్లు గనక మొదటిదానికన్నా భిన్నంగా ఉంటే మాత్రమే రాష్ట్రపతి పరిశీలనకు పంపగలరని వివరించింది. రాజ్యాంగంలో గవర్నర్‌కు వీటో అధికారం ఉన్నట్లు ఎక్కడా పేర్కొనలేదని గుర్తుచేసింది. బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి సంబంధించి ఆర్టికల్ 200లో నిర్దిష్ట కాలపరిమితి విధించకపోయినంతమాత్రాన.. గవర్నర్ వాటిపై ఏ నిర్ణయమూ తీసుకోకుండా కాలయాపన చేసి, పాలనా యంత్రాంగానికి అడ్డంకిగా నిలవరాదని స్పష్టం చేసింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఏ నిర్ణయమూ తీసుకోకపోతే అవి ఉత్తి కాగితాలుగా, మాంసం లేని అస్థిపంజరంగా మిగిలిపోతాయని ఆందోళన వెలిబుచ్చింది. రాజ్యాంగంలోని అధికరణ 200 ప్రకారం గవర్నర్ తీసుకునే ఏ నిర్ణయమైనా న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది.

గడువు పరిమితమే...

రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించడానికి నిర్ణీత గడువు గురించి ఎక్కడా ప్రస్తావించకపోయినా.. గవర్నర్ వాటిని నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడానికి వీలున్నట్లు భావించకూడదన్నారు. రాజ్యాంగంలో ఇలా నిర్ణీత గడువులు సూచించని విషయాలలో తగు నిర్ణయాన్ని అందరికీ ఆమోదయోగ్యమైన గడువులోగా తీసుకోవాలనే భావించాలన్నారు. ఈ నేపథ్యంలో.. గవర్నర్ ఏదైనా బిల్లును పెండింగ్‌లో ఉంచడానికి, ఆమోదించడానికి ఒకటి నుండి మూడు నెలలను గడువుగా నిర్ణయిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 200 కింద తన అధికారాలను వినియోగించే క్రమంలో గవర్నర్ మంత్రివర్గం సూచనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందేనని కోర్టు ఈ సందర్భంగా తేల్చిచెప్పింది.

అంబేడ్కర్ వ్యాఖ్యను ఉటంకించిన సుప్రీం

గవర్నర్ రవికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై వెలువరించడానికి ముందు ధర్మాసనం.. 'రాజ్యాంగం ఎంత ప్రయోజనకరమైనదైనా, దానిని అమలు చేసేవారు మంచివారు కాకపోతే, అది చెడ్డదే అవుతుంది' అన్న డాక్టర్ అంబేడ్కర్ సూక్తిని ఉటంకించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 10 బిల్లులపై గవర్నర్ రవి తీసుకున్న చర్యలు నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాక, ఘోరతదప్పిదమని చెప్పడం తప్ప తమకు మరో మార్గం లేదని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. పాలనా వ్యవహారాల్లో గవర్నర్ అప్రమత్తంగా వ్యవహరించాలి తప్ప అడ్డంకి కాకూడదని తేల్చిచెప్పింది.

ఇకపై సీఎం స్టాలినే వర్సిటీలకు చాన్స్‌లర్

"రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రే చాన్స్‌లర్‌గా వ్యవహరించే బిల్లుకు కూడా ధర్మాసనం ఆమోదం తెలిపిన నేపథ్యంలో.. గవర్నర్ రవి చాన్స్‌లర్ పదవిని కోల్పోయారు. ఇకపై సీఎం స్టాలినే చాన్స్‌లర్‌గా వ్యవహరించి.. పెండింగ్‌లో ఉన్న వివిధ వర్సిటీల వీసీల నియామకాలు చేస్తారు" అని డీఎంకే సీనియర్ రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ వివరించారు.

గవర్నర్లు ఇవి పాటించాల్సిందే: సుప్రీం

- శాసనసభ తీర్మానించి పంపిన బిల్లును గవర్నర్లు గరిష్ఠంగా నెలరోజులకు మించి పెండింగ్‌లో ఉంచకూడదు. ఒకవేళ మంత్రివర్గ సిఫారసు మేరకు రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే గనక.. నెలరోజుల్లోనే పంపాలి.
- మంత్రివర్గ సలహాలు, సూచనలకు విరుద్ధంగా.. సమ్మతిని నిలుపుదల చేయాలని గవర్నర్ భావిస్తే.. ఆ విషయాన్ని తెలుపుతూ గరిష్ఠంగా 3 నెలల్లోపు బిల్లును తిప్పి పంపాలి.
- మంత్రివర్గ సలహాలకు విరుద్ధంగా బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే.. గరిష్ఠంగా మూడు నెలలలోపు ఆ పని చేయాలి.
- గవర్నర్ తిప్పి పంపిన బిల్లును... అసెంబ్లీ గనక మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు పంపితే.. దాన్ని గరిష్ఠంగా నెలలోపు ఆమోదించాలి.

గవర్నర్ ఎలా ఉండాలంటే..

గవర్నర్ ప్రవర్తన ఎలా ఉండాలనే అంశంపై సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది.

- గవర్నర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి వ్యవహరించాలి.
- రాష్ట్ర ప్రభుత్వంతో రాజకీయంగా వ్యవహరించకుండా, ప్రభుత్వ సన్నిహితుడిగా వ్యవహరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ.. ఎన్నికైన ప్రభుత్వానికి అడ్డుగోడలా వ్యవహరించకూడదు.
- ఎల్లప్పుడూ రాజ్యాంగ విధులను సక్రమంగా నిర్వర్తించాలి. తాను చేసిన ప్రమాణస్వీకారానికి కట్టుబడి పనిచేయాలి.
- తాను తీసుకునే చర్యలు జనామోదానికి దగ్గరగా ఉన్నాయా, రాజ్యాంగం ప్రకారం ఉన్నాయా అనే స్వీయపరిశీలన చేసుకోవాలి.

తీర్పు చరిత్రాత్మకం: స్టాలిన్

రాష్ట్ర అసెంబ్లీ రూపొందించిన బిల్లుల్ని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చరిత్రాత్మక తీర్పుగా తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో ఉండగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. దీని గురించి ఆయన సంతోషంగా సభకు సమాచారం అందించారు. ఈ తీర్పు తమిళనాడుకు మాత్రమే కాక.. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకూ దక్కిన విజయమని వ్యాఖ్యానించారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా, సీనియర్ నేత ఆర్ఎస్ భారతి అందరికీ మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు.. తన వివాదాస్పద వ్యవహారశైలితో సుప్రీంకోర్టు చేత అక్షింతలు వేయించుకున్న గవర్నర్ రవి తక్షణమే ఆ పదవికి రాజీనామా చేసి, రాజ్‌భవన్‌ను వీడాలని డీఎంకేతో పాటు దాని మిత్రపక్షాలు డిమాండ్ చేశాయి. రవికి ఏమాత్రం ఆత్మగౌరవం వున్నా, తక్షణమే రాష్ట్రాన్ని వీడివెళ్లాలని డీఎంకే, సీపీఎం డిమాండ్ చేశాయి. సుప్రీం తీర్పు బీజేపీ పాలకులకు చెంపపెట్టులాంటిదని కాంగ్రెస్ అభివర్ణించగా, అన్ని రాష్ట్రాలకూ అనుకూలమైన తీర్పు అని సీపీఐ పేర్కొంది. గవర్నర్ల ద్వారా రాజ్యాన్ని నడపాలనుకుంటున్న బీజేపీ పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని డీపీఐ కటువుగా వ్యాఖ్యానించింది.

లోకం తీరు



అవాస్తవిక షరతులతో క్లెయింల నిరాకరణ వద్దు

» బీమా కంపెనీలకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: బీమా క్లెయింల చెల్లింపు విషయమై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. పాలసీల్లో ఆచరణ సాధ్యం కాని నిబంధనలు, షరతులు పెట్టి, వాటిని పాటించలేదన్న కారణంతో పరిహారం చెల్లింపును తిరస్కరించడం తగదని స్పష్టం చేసింది. పాలసీదారుని చేతిలో లేని కారణాలను సాకుగా చూపించి క్లెయింలను నిరాకరించలేవని పేర్కొంది. వినియోగదారులతో బీమా కంపెనీలు 'నిజాయతీ, పారదర్శకత'తో వ్యవహరించాలని సూచించింది. 'పాలసీలో ఆచరణకు సాధ్యం కాని, వాస్తవ రూపంలో సాధించలేని షరతులు, నిబంధనలను విధించి ఉంటే వాటిని అమలు చేయాల్సిన పనిలేదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రల ధర్మాసనం సోహం షిప్పింగ్ సంస్థకు సంబంధించిన కేసులో తీర్పునిచ్చింది.

పెట్రోల్ బంక్‌లో టాయిలెట్‌కు తాళం.. యజమానికి 1.65 లక్షల ఫైన్

కోజికోడ్, ఏప్రిల్ 8: పెట్రోల్ బంక్‌లో టాయిలెట్‌కు తాళం వేసినందుకు సదరు బంక్ యజమానికి రూ.1.65 లక్షల జరిమానా పడింది. ఈ ఘటన కేరళలో జరిగింది. 2024 మే 8న రాత్రి 11 గంటల సమయంలో పతనంతిట్ట జిల్లాకు చెందిన జయకుమారి అనే ఉపాధ్యాయురాలు కారులో వెళ్తూ కోజికోడ్ జిల్లా పయ్యోలిలోని పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకున్నారు. అతర్వాత ఆమె టాయిలెట్‌కోసం వెళ్లగా తాళంవేసి కనిపించింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మేనేజర్ టాయిలెట్ తాళం తీసుకుని ఇంటికి వెళ్లిపోయారని చెప్పారు. దాంతో ఆమె పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తాళం పగులగొట్టి టాయిలెట్‌ను తెరిపించారు. తర్వాత జయ వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేశారు. ఫోరం బంక్ యజమానికి రూ.1.65 లక్షల జరిమానా విధించింది.

అమెరికా కలలు

కల్లలు!

(మొదటి పేజీ తరువాయి)

అత్యవసరంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. తాజా బిల్లు ఆమోదం పొందితే వర్క్ వీసాకు మారే అవకాశం లేకుండానే ఓపీటీ అర్ధంతరంగా ముగుస్తుందని, దీంతో విదేశీ విద్యార్థులు తక్షణం అమెరికాను వీడాల్సి రావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఓపీటీ హోదాలో ఉన్న విద్యార్థులు వెంటనే హెచ్-1బీకి మారాలని, లేదా ఇతర దేశాల్లో అవకాశాలను పరిశీలించాలని సూచిస్తున్నారు. ఓపీటీ రద్దయితే అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని భావించేవారు కూడా యూకేలో అమలు చేస్తున్న విధంగా వారి చదువులు ముగిసిన తర్వాత స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులపై ఆర్థికంగానూ పెనుభారం పడుతుంది. అమెరికా స్థాయి సంస్థల నుంచి ఏళ్ల తరబడి వచ్చే జీతాలు కోల్పోవడంతో పెద్దమొత్తంలో తీసుకున్న విద్యా రుణాలను తిరిగి చెల్లించడంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకసారి అమెరికా విడిచి వెళ్తే తిరిగి ప్రవేశించడానికి అనుమతి లభించడం కష్టమేనని, వేసవి సెలవుల్లో స్వదేశాలకు వెళ్లొద్దని కార్నెల్, కొలంబియా, యేల్ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలు విదేశీ విద్యార్థులకు అనధికారికంగా సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది భారత విద్యార్థులు ఇప్పటికే తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు.

ఓపీటీ అంటే ఏమిటి?

ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12 నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ అనుమతిస్తుంది. స్టెమ్(ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని అదనంగా మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ పని అనుభవం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. నైపుణ్యం కలిగిన విదేశీయులు మరో ఆరేళ్ల పాటు అమెరికాలో పనిచేయడానికి ఈ వీసా అనుమతిస్తుంది.

9.85 లక్షల మంది వలసదారులకు ఝలక్

బైడెన్ హయాంలో సీబీపీ వన్ యాప్ ద్వారా అమెరికాలోకి ప్రవేశించిన లక్షలాది మందికి ట్రంప్ సర్కారు షాక్ ఇచ్చింది. అప్పట్లో తాత్కాలిక నివాస అనుమతులు పొందిన దాదాపు 9.85 లక్షల మందికి పెరోల్ రక్షణను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రకటించింది. వారంతా వెంటనే స్వచ్ఛందంగా దేశం విడిచి పోవాలని స్పష్టం చేసింది. లక్షలాది మంది దేశంలోకి అక్రమంగా ప్రవేశించడానికి వీలుగా నాటి బైడెన్ యంత్రాంగం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ఘోరమైన సరిహద్దు సంక్షోభానికి ఆజ్యం పోసిందని ఆరోపించింది. జాతీయ భద్రత కోసం తీసుకొనే చర్యల్లో భాగంగా వారికి ఇచ్చిన పెరోల్‌ను రద్దు చేస్తున్నామని తెలిపింది. ఈ మేరకు ఈమెయిల్ ద్వారా నోటీసులు అందుకున్న వారంతా వెంటనే సీబీపీ హోం యాప్‌లో స్వీయ బహిష్కరణకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

విద్యార్థి వీసాలకూ ట్రంప్ ఎసరు

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులు ప్రస్తుతం అక్కడ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గతంలో ఎప్పుడో కారును మితిమీరిన వేగంతో నడిపారనో, లైసెన్స్ లేదనో ఏదో ఒక సాకుతో ఇమిగ్రేషన్ అధికారులు వారి ఎఫ్-1 వీసాలు రద్దు చేసి, విమానం ఎక్కిస్తున్నారు. తాము ఎప్పుడో గతంలో చేసిన ఉల్లంఘనలను అప్పుడే చట్టపరంగా పరిష్కరించుకున్నామని, ఇప్పుడు వాటిని తిరగదోడి శిక్ష విధించడం అన్యాయమని వాపోతున్నారు. భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు చేస్తున్న ఘటనలు పెరుగుతుండటంపై ఆయా వర్సిటీల అధికారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్ పరిశీలించే వరకూ తమతో పాటు బాధిత విద్యార్థులకు కూడా దీనిపై ఎలాంటి సమాచారం ఉండటం లేదని, వీసా రద్దుకు గల కారణాలను అందులో అధికారులు పేర్కొనడం లేదని పేర్కొంటున్నారు. తమకు మాటైనా చెప్పకుండానే అంతర్జాతీయ విద్యార్థుల వీసాలు రద్దు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

విద్యార్థులు.. బహుపరాక్!: ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులు ఎక్కడి వెళ్లినా తమ వెంట పాస్‌పోర్టు, వీసాతో పాటు ఇమిగ్రేషన్‌కు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలు సూచిస్తున్నాయి. వీసాల రద్దుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతున్నాయి. కాగా, డ్రైవింగ్ ఉల్లంఘనలు వంటి చిన్నపాటి ఉల్లంఘనల కారణంగా తమ వీసాలను రద్దు చేశారని ఆరోపిస్తూ ఇద్దరు గుర్తుతెలియని విద్యార్థులు తాజాగా ఫెడరల్ కోర్టులో దావా వేశారు. ఈ అంశానికి సంబంధించి టెక్సాస్‌కు చెందిన ఒక న్యాయవాది దాదాపు 30 కేసులు వాదిస్తున్నారు. వీసా రద్దు అంశంలో న్యాయ సహాయం కోరుతూ భారతీయ విద్యార్థుల నుంచి పిటిషన్లు ఎక్కువగా వస్తున్నాయన్నారు. కాగా, విద్యార్థి వీసాల రద్దు కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) మార్చి చివరి నుంచి ప్రారంభించింది. ఇప్పటి వరకూ 150 మందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని తెలుస్తోంది.

రోజుకు రూ.86 వేలు జరిమానా!

బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కూడా దేశం విడిచి వెళ్లని అక్రమ వలసదారులకు భారీ జరిమానాలు విధించాలని ట్రంప్ సర్కారు యోచిస్తోంది. రోజుకు దాదాపు రూ.86 వేలు చొప్పున జరిమానా కట్టాలని లేకుంటే వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతోంది. స్వీయ బహిష్కరణల కోసం ఉద్దేశించిన సీబీపీ హోం యాప్‌లో నమోదు చేసుకుని, తుది ఆదేశాలు వెలువడిన తర్వాత కూడా దేశాన్ని విడిచిపెట్టకపోతే రోజువారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని డీహెచ్ఎస్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ జరిమానాలకు సంబంధించిన 1996 నాటి చట్టాన్ని ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో తొలిసారిగా అమలు చేశారు.

కాంగ్రెస్ దిద్దుబాటు!

(మొదటి పేజీ తరువాయి)

అంశాలు, తీసుకున్న నిర్ణయాలను కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. "పార్టీకి పునర్వైభవం తేవడంపై సీడబ్ల్యూసీ భేటీలో సుదీర్ఘంగా చర్చించాం. ఈ ఏడాది మొత్తం పార్టీ పునర్నిర్మాణానికి కేటాయించాలని నిర్ణయించాం. భారీ స్థాయిలో పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపడతాం. దీనికి సంబంధించిన ప్రణాళిక, మార్గదర్శకాల రూపకల్పనలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు నిమగ్నమయ్యారు.." అని తెలిపారు.



మంగళవారం సబర్మతీ ఆశ్రమంలో నిర్వహించిన ప్రార్థనలో కాంగ్రెస్ అగ్ర నేతలు ఖర్గే, సోనియా, రాహుల్

జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యత..

పార్టీలో జిల్లా (డీసీసీ) అధ్యక్షులకు ప్రాధాన్యత కల్పించనున్నట్టు కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. జిల్లా అధ్యక్షులకు పార్టీలో మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించే అంశంపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నామని, త్వరలోనే అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇక సర్దార్ పటేల్ చూపిన మార్గంలో కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని, ఈ మేరకు సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేశామని కేసీ వివరించారు. "పటేల్ బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలిచారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాడారు. గాంధీ హత్య అనంతరం మతవాద శక్తులను వ్యతిరేకించారు. ఇప్పుడు ప్రజలకు న్యాయం చేయడం కోసం పటేల్ చూపిన మార్గాన్ని కాంగ్రెస్ అనుసరిస్తుంది." అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బలంగా తలపడేలా పార్టీని బలోపేతం చేస్తామని, ఆ దిశగా పార్టీ జిల్లా విభాగాలు, అధ్యక్షులకు అధికారాలు, బాధ్యతలు అప్పగిస్తామని పార్టీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ చెప్పారు. పోలింగ్ బూత్ స్థాయి వరకు చేరేలా విస్తృతంగా పాదయాత్రలు, ఇతర కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సీడబ్ల్యూసీ సమావేశాల చివరి రోజు బుధవారం 'న్యాయ్ పథ్' పేరుతో తీర్మానం చేయనున్నామని, ఇది చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందని పేర్కొన్నారు.

'విద్వేష అగాధంలోకి దేశం'

మతవాదం, హింసతో దేశం విద్వేష అగాధంలోకి కూరుకుపోతోందంటూ సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. "మతపరమైన ఉన్మాదంపై పోరాడేందుకు సర్దార్ పటేల్ మార్గాన్ని అనుసరిస్తాం. మన స్వాతంత్ర్య ఉద్యమం మీద, గాంధీ-నెహ్రూ-పటేల్‌ల నాయకత్వం మీద దాడి జరుగుతోంది. విద్వేష శక్తులను ఓడించేందుకు, వారి అబద్ధాలను బయటపెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది" అని తీర్మానంలో పేర్కొంది. అహ్మదాబాద్‌లో 'న్యాయ్ పథ్: సంకల్ప్, సమర్పణ్, సంఘర్ష్' పేరిట నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ సమావేశాలు బుధవారం ముగియనున్నాయి. చివరి రోజు ప్రధాన సదస్సులో 1,700 మందికిపైగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఏఐసీసీ సభ్యులు పాల్గొననున్నారు.

పటేల్ అసలైన వారసత్వం కాంగ్రెస్‌దే: ఖర్గే

దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలకు పాల్పడుతున్నాయని.. వారి గురించి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏమాత్రం భాగస్వామ్యం లేని సంఘ్ పరివార్ నేతలు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడం కోసం మతపరమైన విభజనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంగళవారం అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో ఖర్గే మాట్లాడారు. పటేల్, నెహ్రూ ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల్లాంటి వారని, వారి మధ్య ఎంతో అనుబంధం ఉన్నా, విభేదాలు ఉండేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పటేల్ భావజాలానికి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు పూర్తి విరుద్ధమని, ఆర్ఎస్ఎస్‌ను ఆయన నిషేధించారని ఖర్గే గుర్తుచేశారు. అలాంటి సంఘ్ పరివార్ నేతలు తాము పటేల్ వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 31న పటేల్ 150వ జయంతిని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

20 ఏళ్లుగా గుండె ఆపరేషన్ చేస్తున్న దొంగ డాక్టర్

మధ్యప్రదేశ్‌లో ఓ ఆస్పత్రిలో 15 మందికి శస్త్రచికిత్సలు.. వారిలో ఏడుగురు మృతి



దమోహ్(మధ్యప్రదేశ్), ఏప్రిల్: దొంగ డిగ్రీలతో బ్రిటన్ జాతీయుడైన ప్రఖ్యాత కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఎన్ జాన్ కామ్‌గా చెలామణి అవుతున్న మోసగాడు మధ్యప్రదేశ్‌లోని ఒక మిషన్ ఆసుపత్రిలో ఏకంగా 15 గుండె ఆపరేషన్లు చేసి ఏడుగురి చావుకు కారణమయ్యాడు. అతని తీరుపై అనుమానం వచ్చిన ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరారయ్యాడు. చివరకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో తనను పట్టుకున్నారు. తెల్లకోటు మోజుకు డజన్ల కొద్దీ పేషంట్ల ప్రాణాలు తీసిన ఇతన్ని పోలీసులు డెత్ డాక్టర్‌గా పిలుస్తున్నారు. ఇతను 2006లో ఏకంగా ఛత్తీస్‌గఢ్ స్పీకర్‌కు బిలాస్‌పూర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి అతని చావుకు కారణమయ్యాడని ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తోంది. ఇతని అసలు పేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అని పోలీసులు చెబుతున్నారు. స్వస్థలం డెహ్రాడూన్. డజన్ల కొద్దీ ఫేక్ డిగ్రీలు సిద్ధం చేసి పెట్టుకున్నాడు. ఆసుపత్రి ప్రొఫైల్‌ను బట్టి సూట్ అయ్యే డిగ్రీలు బయటకు తీస్తాడు. అతని దగ్గర ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ కూడా ఉంది. కార్డియాలజీకి సంబంధించి అతని దగ్గర అనేక స్పెషల్ పట్టాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని దమోహ్‌లో ఉన్న మిషనరీ ఆసుపత్రి కార్డియాక్ సర్జన్‌ను నియమించుకోవాలని అనుకుంది. ప్లేస్‌మెంట్ ఏజెన్సీని సంప్రదించింది. తాను బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత కార్డియాక్ సర్జన్‌ను అని, మానవ సేవలో భాగంగా భారతదేశంలో పని చేయడానికి ఆసక్తి చూపుతున్నానని చెప్పడంతో ఆసుపత్రి యాజమాన్యం బుట్టలో పడిపోయింది. నెలకు రూ.8 లక్షల జీతంతో ఆయన్ను నియమించుకున్నారు. తన చేతుల మీదుగా 15 ఆపరేషన్లు చేస్తే అందులో ఏడుగురు మరణించారు. పేషంట్ల బంధువుల ఫిర్యాదుతో జిల్లా వైద్యాధికారి దర్యాప్తు చేశారు. డాక్టర్ కామ్ సరైన డిగ్రీలు లేకుండా యాంజియోగ్రఫీ, యాంజియోప్లాస్టీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దొంగ డాక్టర్‌ను ప్రయాగరాజ్‌లో పట్టుకున్నారు. అతను జీవిత కాలంలో 15 వేల ఆపరేషన్లు చేసినట్లుగా ప్రొఫైల్‌లో చెప్పుకున్నాడు. 2006లో అప్పటి అసెంబ్లీ స్పీకర్ రాజేంద్ర ప్రసాద్ శుక్లాకు గుండె నొప్పి వచ్చినపుడు బిలాస్‌పూర్‌లోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. లండన్ నుంచి వచ్చిన ప్రముఖ వైద్యుడు ఆపరేషన్ చేస్తాడని అప్పట్లో ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. ఆపరేషన్ తర్వాత స్పీకర్ చనిపోయారు.


సింహ వాహనంపై కోదండరాముడి విహారం

సింహ వాహనంపై కోదండరాముడు

» 11న పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం వటపత్రశాయిగా, రాత్రి సింహవాహనంపై కోదండరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కాగా.. కోదండరామస్వామి కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం టీటీడీ పరిపాలన భవనంలో కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణోత్సవానికి 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని తెలిపారు.

బలపడిన అల్పపీడనం
రెండ్రోజుల్లో బలహీనపడే అవకాశం

» విస్తరించిన ఉపరితల ద్రోణి.. వాయవ్య గాలులు

» వాతావరణ అనిశ్చితితో వర్షాలు.. వడగాడ్పులు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలపడి నైరుతి, దానికి ఆనుకుని దక్షిణ బంగాళాఖాతంలో ప్రవేశించి స్థిరంగా కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో ఉత్తర వాయవ్యంగా పయనించి మళ్లీ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 24 గంటల్లో ఉత్తర ఈశాన్యంగా దిశ మార్చుకుని బలహీనపడుతుందని పేర్కొంది. ప్రస్తుతం తమిళనాడు వరకూ ఉపరితల ద్రోణి ఒకటి విస్తరించింది. ఇదే సమయంలో వాయవ్య భారతం నుంచి రాష్ట్రం పైకి వేడి గాలులు వీస్తుండటంతో వాతావరణ అనిశ్చితి నెలకొని మంగళవారం రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురు వర్షాలు, గురువారం ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం అల్లూరి, ఏలూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 28 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కాగా మంగళవారం నంద్యాల జిల్లా దొర్నిపాడు, కడప జిల్లా మద్దూరులో 41.5, కర్నూలు జిల్లా కామవరంలో 40.7, పల్నాడు జిల్లా రావిపాడులో 40.6, ప్రకాశం జిల్లా దరిమడుగులో 40.5, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 40.3, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

21,850 మందితో సూర్యవందనం అభినందనీయం: సీఎం

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అరకు వేదికగా 21,850 మంది ఒక చోట చేరి మహా సూర్యవందనం కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి రికార్డు సృష్టించిన గిరిజన విద్యార్థులను, కార్యక్రమాన్ని స్ఫూర్తిమంతంగా నిర్వహించిన అధికారులను ఆయన ఎక్స్ వేదికగా అభినందించారు.

శ్రీచరణికి లోకేశ్ అభినందనలు

ట్రై నేషన్ మహిళా క్రికెట్ సిరీస్‌కు ఎంపికైన కడపకు చెందిన ఏపీ మహిళా క్రికెటర్ ఎన్.శ్రీచరణిని ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ట్రై సిరీస్ వన్‌డే ఇంటర్నేషనల్‌లో చోటు దక్కించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్ర క్రికెట్‌కు బిగ్ మూమెంట్ అని పేర్కొన్నారు.

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

» బఫర్ విరిగి పట్టాలపై నిలిచిన బోగీలు

» భువనేశ్వర్ వైపు రైళ్లు మూడు గంటలు ఆలస్యం


విరిగిన బఫర్‌ను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

పలాస, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా(12704) ఎక్స్‌ప్రెస్‌కు మంగళవారం పెను ప్రమాదం తప్పింది. శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వే స్టేషన్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో సున్నాదేవి ఎల్‌సీ గేటు వద్ద ఉదయం 7.15 గంటల సమయంలో రైలు ఎనిమిదో బోగి ఏసీ కంపార్ట్‌మెంట్ వద్ద ఉన్న బఫర్ విరిగి తెగిపోవడంతో 15 బోగీలు విడిపోయి పట్టాలపై నిలిచిపోయాయి. ఇంజన్‌తో ఉన్న 8 బోగీలు ముందుకెళ్లిపోయాయి. ఎవరో చైన్ లాగడంతో రైలు ఆగినట్టు గార్డ్ మధుకుమార్ భావించారు. దిగి పరిశీలించగా బోగీలు విడిపోయి ఉండటంతో పాటు, మిగిలిన బోగీలతో రైలు వెళ్లిపోవడాన్ని గుర్తించి డ్రైవర్‌కు సమాచారం ఇచ్చి మందస వద్ద రైలును నిలుపుదల చేశారు. అనంతరం పలాస రైల్వే అధికారులకు ఈ విషయాన్ని తెలియజేయడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బఫర్ విరిగిపోయినట్టు గుర్తించారు. అనంతరం ఇంజన్‌ను బోగీలు నిలిచిపోయిన ప్రాంతానికి తీసుకువచ్చి రైలును మందసకు తరలించారు. ప్రమాదానికి కారణమైన 8వ బోగీని అక్కడ వదిలేసి, అందులో ఉన్న 42 మంది ప్రయాణికులను వేరే బోగీల్లోకి సర్దుబాటు చేసి గమ్యస్థానాలకు తరలించారు. ఈ ఘటన కారణంగా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మందసలో 3 గంటల పాటు నిలిచిపోగా, దురంతో ఎక్స్‌ప్రెస్‌ను మూడు గంటల పాటు పలాసలో నిలిపివేశారు. దీంతోపాటు భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లన్నీ మూడు గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

వరదొస్తే పోలవరం వల్లేనా?

» ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయకుంటే బ్యాక్‌వాటర్‌కు ఆస్కారం ఎక్కడిది?

» పీపీఏ భేటీలో తెలంగాణపై ఏపీ ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద వస్తే పోలవరం ప్రాజెక్టు వల్లేనంటూ నిందలేస్తారా అని తెలంగాణను ఆంధ్రప్రదేశ్ నిలదీసింది. మంగళవారం హైదరాబాద్‌లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన పోలవరం ఎత్తుపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఏపీ తరఫున పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జల వివాదాల విభాగం సీఈ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు. పోలవరం నిర్మాణంతో బూర్గంపాడు గ్రామం 2020-22 వరదల సమయంలో ముంపునకు గురైందని తెలంగాణ ప్రస్తావించింది. అప్పటికి ప్రాజెక్టు పూర్తికాలేదని.. నీటిని నిల్వ కూడా చేయలేదని.. అలాంటప్పుడు బ్యాక్‌వాటర్ వరదకు ఆస్కారం ఎక్కడిదని ఆంధ్రప్రదేశ్ నిలదీసింది. నదీపరివాహక ప్రాంతంలో వరదలు రావడం సహజమని.. గోదావరికి వరద వస్తే అది పోలవరం వల్లేనంటూ నిందలు వేయడం అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. 45.72 మీటర్ల కాంటూరులో నీటిమట్టం మార్కులను 36 ప్రదేశాల్లో గుర్తించాలని తెలంగాణ చేసిన డిమాండ్‌ను ఆంధ్ర అధికారులు తోసిపుచ్చారు. గతంలో పేర్కొన్నట్లుగా రెండు చోట్ల మాత్రమే మార్కింగ్ చేస్తామని స్పష్టం చేశారు. కిన్నెరసాని, ముర్రేడు వాగు వద్ద సర్వే చేయాలని తెలంగాణ కోరగా.. ప్రాజెక్టు రెండో దశలో 45.72 మీటర్ల గరిష్ఠ కాంటూరులో నీటిని నిల్వ చేసే సమయంలో మార్కింగ్ చేస్తామని వారు తేల్చిచెప్పారు.

వేసవి పంటలూ ఈ-క్రాప్‌లో నమోదు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో సాగయ్యే పంటలను కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి నుంచి ఏప్రిల్ మొదటి వారంలోగా విత్తుకుని, వేసవిలోనే ముగించే పంటలను మాత్రమే వేసవి ఈ-క్రాప్‌గా నమోదు చేయనున్నారు. వేసవి సాగు విస్తీర్ణం, దిగుబడి, ఉత్పత్తి అంచనాతో పాటు వరుస పంటల సరళిపై అధ్యయనానికి, గణాంకాలకు ఈ-క్రాప్ దోహదపడుతుందని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఆధునికీకరించిన కొత్త వెర్షన్ ద్వారా వేసవి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. వేసవిలో ప్రధానంగా మినుము, పెసర సాగు వల్ల వాటి వ్యర్థాలతో భూమికి సేంద్రీయ పదార్థం అందుతుందని, అలాగే పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జనుము, పిల్లి పెసర, కాకిజొన్న, నువ్వులు, నేపియర్ గడ్డి వల్ల భూమిలోని తేమ ఆవిరి కాకుండా కాపాడతాయని వ్యవసాయశాఖ పేర్కొంటోంది.

ఒంగోలులో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

» మే మొదటి వారంలో నిర్వహణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) 36వ రాష్ట్ర మహాసభలను ఒంగోలులో నిర్వహించనున్నారు. మంగళవారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహించిన రాష్ట్రమహాసభ సన్నాహక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మహాసభలు వచ్చేనెల మొదటివారంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ఐజేయూ జాతీయ నాయకులతోపాటు ఆయా రాష్ట్రాల ప్రతినిధులు సుమారు 300 మంది మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు. మహాసభల ప్రారంభం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు, ముగింపు రోజున ప్రతిపక్ష నేతలను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, మరో జాతీయ కార్యదర్శి ఆలపాటి సురేష్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడారు.

పోలవరం-బనకచర్ల కోసం... జలహారతి కార్పొరేషన్

» సీఎం చైర్మన్, మంత్రి వైస్ చైర్మన్, ఎండీ-సీఈవోగా ప్రత్యేక సీఎస్


» ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,112 కోట్లు

» బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాల సేకరణ

» ప్రభుత్వ బాండ్ల ద్వారానూ నిధులు

» జలవనరుల శాఖ నుంచి డిప్యుటేషన్‌పై 15 మంది ఇంజనీర్లు

» ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు



అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు కరువును శాశ్వతంగా దూరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి మార్గం సుగమమైంది. 'జలహారతి కార్పొరేషన్' పేరిట స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. ఇది నూటికి నూరు శాతం ప్రభుత్వ కంపెనీ. పూర్తిగా జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ఉంటుంది. ఇందులో ముఖ్యమంత్రి (చైర్మన్), జలవనరుల మంత్రి (వైస్‌చైర్మన్), జలవనరుల శాఖ కార్యదర్శి/ముఖ్య కార్యదర్శి/ప్రత్యేక సీఎస్ (ఎండీ-సీఈవో), ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ ఈఎన్‌సీ లేదంటే రాష్ట్రప్రభుత్వం నియమించే వ్యక్తి డైరెక్టర్లుగా ఉంటారు.

» రూ.10 ముఖ విలువ కలిగిన 49,99,993 షేర్లు రాష్ట్ర ప్రభుత్వం (జలవనరుల శాఖ) పేరిట ఉంటాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్/ఈఎన్‌సీ, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్/ఈఎన్‌సీ, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్, ఒంగోలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్, కర్నూలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్‌కు తలో షేరు కేటాయించారు.

» జలహారతి కార్పొరేషన్‌లో జలవనరుల శాఖ నుంచి డిప్యుటేషన్‌పై ఓ చీఫ్ ఇంజనీర్‌ను, ఇద్దరు ఎస్ఈలు, ముగ్గురు ఈఈలు, 10 మంది డీఈఈ/ఏఈఈలు ఉంటారు. మార్కెట్ నుంచి ముగ్గురు సీఏలు/అకౌంట్స్ అధికారులను నియమిస్తారు. ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్‌వో)గా ఆర్థిక శాఖ అదనపు డైరెక్టర్ గానీ, మార్కెట్లో 15 ఏళ్ల చార్టర్డ్ అకౌంటెంట్‌గా అనుభవం ఉన్న వ్యక్తి గానీ ఉంటారు.

» ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,112 కోట్లు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణసమీకరణ చేస్తారు. ప్రభుత్వ బాండ్ల ద్వారా కూడా నిధులు సేకరిస్తారు.

» పబ్లిక్ మార్కెట్ల ద్వారానూ వనరులు సమీకరించవచ్చు.

» ఈ నిధులను ఇతర ప్రభుత్వ ప్రాజెక్టులకు మళ్లించే ఆస్కారం లేదు.

గోదావరి వరద నీటితో కరువు నివారణ..

పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంతో కొత్తగా 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని, 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరీకరించవచ్చని, 80 లక్షల మందికి తాగునీరు అందించవచ్చని జలవనరుల శాఖ చెబుతోంది. గోదావరి నదిలో 90 నుంచి 120 రోజుల పాటు వరద ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ వరదనీటిని పల్నాడు, రాయలసీమకు తరలిస్తే శాశ్వతంగా కరువును నివారించవచ్చని అంటోంది. ఇందుకోసమే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. తాడిపూడి నుంచి నుంచి జక్కంపూడి వరకు సమాంతర కాలువ నిర్మించి గ్రావిటీ ద్వారా ప్రకాశం బ్యారేజీకి తరలిస్తారు. ఆ నీటిని బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయరుకు పంపుతారు. అక్కడి నుంచి కాలువలు, ఎత్తిపోతలు, సొరంగాల ద్వారా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించాలన్నది ప్రణాళిక.

పంచాయతీ కార్యదర్శి ఆస్తులు రూ.85 కోట్లు!

» లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెండైన చంద్రగిరి పంచాయతీ సెక్రటరీ మహేశ్వరయ్య

» ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై ఆయన నివాసాల్లో ఏసీబీ దాడులు

» భారీగా నగలు, నగదు, చర, స్థిరాస్తి రికార్డులు సీజ్


మహేశ్వరయ్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెండైన పంచాయతీ కార్యదర్శి నివాసాలపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో నిర్వహించిన దాడుల్లో కళ్లు చెదిరే ఆస్తుల వివరాలు, నగలు, నగదు బయటపడ్డాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి పంచాయతీ పూర్వ కార్యదర్శి మహేశ్వరయ్య ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై తిరుపతి, కడప జిల్లాల ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. తిరుపతి సమీపం పేరూరులోని మహేశ్వరయ్య ఇల్లు, చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరులో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. పేరూరులోని ఇంటి నుంచి కిలో బంగారం, వెండి వస్తువులు, దాదాపు రూ.రెండు లక్షల నగదు, వివిధ బ్యాంకుల్లో ఉన్న రూ.35 లక్షల టర్మ్ డిపాజిట్ల బాండ్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, ద్విచక్ర వాహనాలనూ సీజ్ చేశారు. పలమనేరులో దాదాపు రూ.మూడు కోట్ల విలువ చేసే మూడు అంతస్థుల ఇల్లు, ఒక ఫాంహౌస్, బినామీ పేర్లతో కొన్ని ప్లాట్లు, భూములు ఉన్నట్టు గుర్తించారు. గంగవరంలో కోళ్లఫారం, వ్యవసాయ భూమి, చర, స్థిరాస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. బెంగళూరులో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే అపార్టుమెంటుకు సంబంధించిన రికార్డులను తిరుపతిలో సీజ్ చేశారు. కడప జిల్లా బద్వేలులోని మహేశ్వరయ్య అత్తగారి ఇంట్లో కొన్ని కీలక డాక్యుమెంట్లు సీజ్ చేశారు. అక్కడ బినామీ పేర్లతో కొంతమందిపై ప్లాట్లు, ఇళ్లు రిజిస్ట్రేషన్ చేసి ఉంచినట్టు అధికారులు చెప్పారు. తిరుపతి, బెంగళూరు, బద్వేలులోని వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు, లాకర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. త్వరలో లాకర్లు ఓపెన్ చేసేందుకు చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు. ఈ సోదాలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. తనిఖీల్లో ఇప్పటి వరకు సుమారు రూ.85 కోట్ల ఆస్తులు బయటపడినట్టు తెలిసింది. కాగా.. మహేశ్వరయ్య ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

ఆస్తులు కూడగట్టి.. అమ్మవారికి ఆలయం!

చిత్తూరు జిల్లా గంగవరంలో ప్రధాన రహదారిపైన సుమారు రూ.ఐదారు లక్షలతో మహేశ్వరమయ్య గతంలో అమ్మవారి ఆలయం నిర్మించారు. ఇటీవల ఈ ఆలయాన్ని ఆధునికీకరించారు. ఇదంతా పాప పరిహారం కోసమే చేసినట్టు ఉందంటూ అక్కడి ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.


ఏపీ సీఆర్పీఎఫ్ బలగాలు (ఫైల్‌ఫొటో)

ఒకే సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు సాగర్ రక్షణ..!

» ములుగు బయలుదేరి వెళ్లిన 39వ బెటాలియన్

» తెలంగాణ వైపు అదనంగా ఎస్పీఎఫ్ కాపలా

నాగార్జునసాగర్/ మాచర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న నాగార్జున సాగర్ డ్యామ్ రక్షణ బాధ్యతను ఇక నుంచి ఒక సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కే పరిమితం చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకూ తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ ములుగు బెటాలియన్, ఏపీ వైపు విశాఖ బెటాలియన్ బలగాలు కాపలా కాస్తున్నాయి. కానీ, కేంద్రం ఖర్చును తగ్గించుకోవడానికి సీఆర్‌పీఎఫ్ ములుగు బెటాలియన్‌ను పూర్తిగా ఉపసంహరించి.. నాగార్జున సాగర్ డ్యామ్ రక్షణ బాధ్యతను పూర్తిగా విశాఖ బెటాలియన్‌కు అప్పగించింది. ఎడమ వైపు రక్షణ బాధ్యత నిర్వర్తిస్తున్న 39వ (ములుగు) బెటాలియన్ సిబ్బందిని వెనక్కి వెళ్లిపోవాలని ఈ నెల ఆరో తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. ఎడమ వైపు డ్యాం రక్షణ బాధ్యతలు కూడా స్వీకరించాలని 234వ (విశాఖ) బెటాలియన్‌కు మంగళవారం కేఆర్ఎంబీ ఆదేశాలు జారీచేయడంతో విశాఖ బెటాలియన్ జవాన్లు మధ్యాహ్నం 12 గంటలకు ఎడమ వైపుకు చేరుకున్నారు. డ్యామ్ రక్షణ బాధ్యతను 234వ బెటాలియన్ అధికారి శ్రీనివాసరావుకు ములుగు బెటాలియన్ అధికారి వీర రాఘవయ్య అప్పగించారు. అటుపై మధ్యాహ్నం ఒంటిగంటకు ములుగు బెటాలియన్ బలగాలు నాగార్జున సాగర్ ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున రావుకు సమాచారమిచ్చి హిల్ కాలనీలోని తమ క్యాంపుకు చేరుకున్నాయి. సాయంత్రం వచ్చిన ఏడు వాహనాల్లో 39వ బెటాలియన్ జవాన్లు ములుగుకు బయలుదేరాయి. తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ విశాఖ బెటాలియన్‌తోపాటు ఎస్పీఎఫ్ బలగాలు కాపలా ఉంటాయి.

సాగర్ ఇన్‌చార్జి ఎస్ఈ ఏమన్నారంటే..!

సాగర్ ప్రాజెక్టు భద్రతను మాత్రమే సీఆర్పీఎఫ్ 234 (విశాఖ) బెటాలియన్‌కు అప్పగించారని ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున్‌రావు చెప్పారు. డ్యామ్ నిర్వహణ బాధ్యత తెలంగాణదేనన్నారు. కేఆర్ఎంబీ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ డ్యామ్‌కిరువైపులా విశాఖ సీఆర్పీఎఫ్ బలగాలే రక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తాయని తెలిపారు.

బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురు అరెస్టు

» అవమాన భారంతో ఓ నిందితుడి ఆత్మహత్య

వి.కోట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని నాయకనేరి అటవీ ప్రాంతంలో వారం రోజుల క్రితం జరిగిన బంగారం దోపిడీ కేసులో మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ డి.ప్రభాకర్, సీఐ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం వి.కోటలో మాట్లాడుతూ.. నాయకనేరి అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన తమిళనాడు రాష్ట్రం పేర్నాంబట్ సమీపంలోని కల్లిపేటకు చెందిన వేదాచలం, కుమరేశన్, రంజిత్, దీపన్ చక్రవర్తి, సూరవేల్‌ను విచారించి, బంగారం దోపిడీ కేసులో నిందితులుగా గుర్తించి ఆదివారం అరెస్టు చేశామన్నారు. మరో నలుగురి కోసం అన్వేషిస్తున్నామని తెలిపారు. నిందితులకు పలమనేరు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండు విధించగా, మదనపల్లె జైలుకు తరలించారు. మరోవైపు.. ఈ కేసులో నిందితుల్లో ఒకడైన అప్పు(28) పేర్నాంబట్ సమీపంలోని గుండ్లపల్లె వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితులు తనను తీసుకువెళ్లి దోపిడీ కేసులో ఇరికించారని, తన చావుకు వారే కారణమంటూ అతని సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన ఆడియో బయటపడింది.

అధునాతన విమానాశ్రయంగా 'భోగాపురం'

» 2026, జూన్ నాటికి ఎయిర్‌పోర్టు పూర్తి

» అప్పటికి అందుబాటులోకి తాజ్ హోటల్: రామ్మోహన్‌నాయుడు


ఎయిర్‌పోర్టు పనులు పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి

విజయనగరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టును అత్యంత అధునాతనంగా నిర్మిస్తాం. ఈ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారుతాయి' అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం పనులను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడారు. 'గత ప్రభుత్వం ఎయిర్ పోర్టు పనులను గాలికి వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం పనులు వేగవంతం చేయటంతో అనుకున్న సమయం కన్నా ముందే వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభిస్తాం. నవంబరులో సుమారు 49 శాతంగా ఉన్న పనులు నేడు 71% వరకు పూర్తయ్యాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 3.8 కిలోమీటర్ల రనేవే నిర్మిస్తున్నాం. ఎయిర్‌పోర్టు ప్రారంభించే నాటికి తాజ్ గ్రూప్ హోటల్ ప్రారంభమయ్యేలా చూస్తాం. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకు కనెక్టివిటీ కోసం కొత్త డీపీఆర్ తయారు చేశాం. అనకాపల్లి, ఆనందపురం బైపాస్ రహదారిని భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేస్తాం. విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులను ఆదుకుంటాం' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతో కొంతమేర వలసలు తగ్గుతాయి' అని అన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జిల్లా కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కడలి నుంచి కొండ దాకా

జీవితం సౌందర్యమయం కాగల సదుపాయాలను సామాన్యులు కోరుతారు. సమాజ సమష్టి సంపద సమృద్ధికి పాలకులు కృషి చేస్తారు. సమగ్ర రవాణా వసతులు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, విద్యుత్ సరఫరా వ్యవస్థలు మొదలైనవి ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు అత్యవసరమైనవి. అందుకే వాటి అభివృద్ధికి ప్రభుత్వాలు అగ్రప్రాధాన్యమిస్తున్నాయి. దేశ మౌలిక సదుపాయాలను ప్రపంచ ప్రమాణాలతో నిర్వహించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తొలినుంచీ విశేష శ్రద్ధ చూపుతూ వస్తోంది. ప్రపంచ అతి పొడవైన హైవే సొరంగ మార్గం అటల్ టన్నెల్, ముంబైలో అటల్ సేతు, బ్రహ్మపుత్రా నదిపై బొగిబీల్ వంతెన అందుకు ఉదాహరణలు. ఈ కోవలోనివే కాక వాటికంటే మరింత ప్రశస్తమైన నిర్మాణ ప్రజ్ఞా పాటవాలతో రూపుదిద్దుకున్న కట్టడాలు కొత్త పాంబన్ వారధి, కశ్మీర్ లోయను విశాల భారతదేశంతో అనుసంధానం చేసే రైలు మార్గంలో భాగమైన (ప్రపంచపు అతి ఎత్తైన) చీనాబ్ రైల్ బ్రిడ్జి. ఇంజనీరింగ్ అద్భుతాలుగా అందరూ అబ్బురపడుతున్న వీటిలో మొదటిదాన్ని ప్రధాని మోదీ శ్రీరామ నవమి రోజున ప్రారంభించారు. రెండోదాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నారు.

దక్షిణ తమిళనాడు ప్రాంతంలోని పుణ్యక్షేత్రమైన రామేశ్వరం దీవిని ప్రధాన భూభాగంతో అనుసంధానం చేసే కొత్త పాంబన్ వంతెన మన దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జి. 72.5 మీటర్ల వర్టికల్ లిఫ్ట్‌తో 2.08 కి.మీ. పొడవున ఉండే ఈ వంతెన భారతీయ ఇంజనీరింగ్ సామర్థ్యానికి ప్రతీక. నౌకాయానానికి వీలుగా 110 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలకుల హయాంలో నిర్మించిన పాత పాంబన్ వంతెన స్థానంలో ఈ కొత్త వంతెనను నిర్మించారు. దీని నిర్మాణంతో భౌగోళిక, పర్యావరణ సవాళ్లను అధిగమించి మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరచడంలో తన అద్వితీయతను భారత్ నిరూపించుకున్నది. అమెరికాలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జి, లండన్‌లోని టవర్ బ్రిడ్జి, డెన్మార్క్‌లోని ఆరెసండ్ వంతెనలు మాత్రమే దీనికి సమమైనవి. రామాయణ గాథతో సంబంధమున్న ప్రాంతంలోని ఈ సముద్ర వంతెన ఆధునిక చరిత్రా విశిష్టమైనది. ముఖ్యంగా రామేశ్వరం బిడ్డ అయిన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబుల్ కలామ్ బాల్యం పాత పాంబన్ వంతెనతో ముడివడి ఉన్నది. జీవనోపాధికి వార్తా పత్రికలు పంపిణీ చేసిన కలాం ఆ వంతెనపై నడిచే రైళ్లలోనే ప్రధాన భూభాగానికి వెళ్లి వార్తా పత్రికలను తీసుకువచ్చి రామేశ్వరంలో చందాదారులకు సరఫరా చేస్తుండేవారు. ఆ రైలు మార్గం ద్వారానే ఆయన దేశంలోని వివిధ ఉన్నత విద్యా సంస్థలకు వెళ్లి ‘మిసైల్ మ్యాన్’గా ప్రసిద్ధి పొంది, అంతిమంగా రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. మరో ప్రముఖుడు, మెట్రో మ్యాన్‌గా ప్రసిద్ధి పొందిన ఇంజనీర్ ఇ. శ్రీధరన్ 1964లో పెనుతుపాన్‌లో కొట్టుకుపోయిన పాత పాంబన్ వంతెన పునర్నిర్మాణాన్ని కేవలం 46 రోజులలోనే పూర్తి చేసి తన ఇంజనీరింగ్ ప్రతిభాపాటవాలు, నిర్మాణ దక్షతను తొలిసారి నిరూపించుకున్నారు. ప్రపంచ అగ్రగామిగా ప్రభవిస్తున్న భారత్ ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ఈ కొత్త పాంబన్ వంతెన ఒక తిరుగులేని నిదర్శనమని దాన్ని నిర్మించిన రైల్వేవికాస్ నిగమ్ లిమిటెడ్ ఛైర్మన్ ప్రదీప్ గౌర్ అన్న మాట ఎంత మాత్రం సత్యదూరమైనది కాదు.


సరిగ్గా పది రోజులకు (ఏప్రిల్ 19), చీనాబ్ రైల్ బ్రిడ్జి భాగంగా ఉన్న ఉదాంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైలు మార్గంలో కాత్రా–శ్రీనగర్‌ల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. చీనాబ్ నదిపై ప్రపంచపు అతి ఎత్తైన రైలు వంతెన ఉన్న 272 కిలోమీటర్ల ఈ మార్గంలో 38 సొరంగాలు, 927 వంతెనలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక వ్యయ ప్రయాసలతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ రైలు మార్గం కశ్మీర్ లోయలో పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధిపరుస్తుందనే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్థానిక వ్యాపారాలకు, హస్తకళలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. కశ్మీరీలు, ఇతర భారతీయులకు మధ్య ఉన్న భౌగోళిక, భావోద్వేగ దూరాలు తగ్గిపోయేందుకు ఈ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ దోహదం చేయగలదు.

దక్షిణాగ్రాన సముద్రంలో నిర్మించిన కొత్త పాంబన్ వంతెన, ఉత్తర కొసన హిమాలయ పర్వత ప్రాంతాలలో నిర్మించిన కొత్త రైలు మార్గం రెండూ ఈ దేశ సమైక్యత, సమగ్రతను పరిపుష్టం చేసేవే. అద్భుతాలు అయిన ఈ మౌలిక వసతులు దేశ ఐశ్వర్యాభివృద్ధికి విశేషంగా దోహదం చేస్తాయి. మరి ఈ సమష్టి సమృద్ధిలో సామాన్యుడికీ సముచిత వాటా లభిస్తుందా? అనేదే అసలు ప్రశ్న. అతడికి అన్యాయం జరగకుండా చూడడమనేది సదరు ఇంజనీరింగ్ అద్భుతాలను మించిన మహాద్భుతం అవుతుంది. ఈ మహాద్భుతమే సామాన్యుని కామన అని పాలకులు విస్మరించకూడదు.

ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు

ఇస్లాంలోని మతపరమైన, దాతృత్వ కార్యక్రమాల కోసం వక్ఫ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉపయోగిస్తారు. వక్ఫ్ దానం చేసిన వారిని వాకీఫ్ (దానకర్తలు) అని, ఈ సంపదను పర్యవేక్షించడానికి నియమించబడిన వ్యక్తిని ముతావల్లీ అని అంటారు. వక్ఫ్ బ్రిటిష్ కాలం నుండి అనేక రూపాంతరాలు చెందింది. ముసల్మాన్ వక్ఫ్ వాలిడేటింగ్ యాక్ట్– 1913; ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్–1923; వక్ఫ్ ఆక్ట్–1954... వీటికి సవరణలు 1959, 1964, 1969, 1984 సంవత్సరాల్లో చేశారు. వక్ఫ్–1954 యాక్టును మార్చి 1995లో కొత్త యాక్ట్ చేశారు. అలానే 2013లో సవరణలు ద్వారా వక్ఫ్‌కు భారతదేశంలోని ఏ సంస్థకూ లేని అధికారం ఇచ్చి అవినీతికి రాచమార్గం వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం.

ప్రపంచంలో వక్ఫ్‌కు అత్యంత ఎక్కువ ఆస్తులు ఉన్నది భారతదేశంలోనే. 2024 నాటికి మొత్తం వక్ఫ్ ఆస్తులు 9.4 లక్షల ఎకరాలు. వాటి విలువ దాదాపు రూ.1.2 లక్షల కోట్లు. అందులో 5,32,819 ఎకరాలకు లెక్కలు లేవు, లేదా కబ్జాలో ఉన్నవి. ఇక సచార్ కమిటీ రిపోర్ట్ ప్రకారం వక్ఫ్ ఆస్తుల నుంచి ఏడాదికి కనీసం రూ.12,000కోట్ల ఆదాయం రావాలి. కానీ 2019లో రూ.163 కోట్లు వస్తే, 2024 మొత్తం దేశంలో కేవలం రూ.1.6 కోట్ల ఆదాయం వచ్చింది! భారతదేశంలో రక్షణ రంగం, రైల్వేల తర్వాత అత్యధిక ఆస్తులు ఇస్లాం మతపరమైన వక్ఫ్ సంపదే. పేద ముస్లింలకు ఒక వరం కావలిసిన వక్ఫ్ శాపంగా మారింది.



ఇప్పటి వరకు వక్ఫ్ చట్టం కేవలం నాయకులకు, ధనిక వర్గాలకు, ఆక్రమణదారులకు ఒక అడ్డాగా మారింది. పేదవర్గాలకు చేరవలసిన ఫలాలను ధనిక ముస్లిం వర్గాలు కొల్లగొట్టాయి. అల్లాహ్ ఆస్తులు ముస్లిం వర్గాలలోని పేద వర్గాలకు, మహిళలకు అందించాలన్నదే మోదీ ప్రయత్నం. ఇందువల్ల హిందూ సమాజానికి కానీ, ఇతర మతస్థులకు కానీ వచ్చే లాభం ఏమీ లేదు.

వక్ఫ్ బోర్డులో కొన్ని ముఖ్యమైన సమస్యలు ఉన్నాయి. 1. అక్కడ అధికారం కొండంత, జవాబుదారీతనం శూన్యం. 2. కబ్జాలు, కోర్ట్ కేసులు, బంధువులకు అప్పగింత వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయి. 3. కోట్ల ఆస్తులు, పైసల్లో లీజు లేదా రెంటు! ఏకంగా 30 ఏండ్లకు లీజులు; 4. వక్ఫ్ బోర్డు సభ్యులలో అందరూ ఒక సిండికేటే. మొత్తం ఆస్తులు ముస్లింలోని లీడర్లు, నవాబులు, ఉన్నత వర్గాల హస్తగతం అయ్యింది. అత్యధిక ఆస్తులు వారి హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలు, కమర్షియల్ బిల్డింగ్స్, అపార్టుమెంట్స్.. ఇలా దుర్వినియోగం అవుతున్నది; 5. 2013లో కాంగ్రెస్ పార్టీ గద్దె దిగేటప్పుడు సెక్షన్ 40 తెచ్చింది. ఇది ఒక రాజ్యాంగ ఉల్లంఘన. సెక్షన్ 40 ప్రకారం ఎలాంటి ప్రామాణికత లేకుండా ముతావల్లీ ఎక్కడైనా సరే భూమిని వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే అవకాశం కల్పించారు. భారతదేశంలోని ఏ కోర్టుకూ వక్ఫ్ ట్రిబ్యునల్ లేదా ముతావల్లీ చర్యలను సమీక్షించే అవకాశం లేకుండా చేసారు. 6. వక్ఫ్ బోర్డులో ముస్లిం వెనుకపడిన వర్గాలకు, స్త్రీలకు రిజర్వేషన్ లేనందున కేవలం ముస్లింలోని ఉన్నత వర్గాలకే లబ్ధి చేకూరుతున్నది. 7. వక్ఫ్‌పై దేశంలో 40 వేల కేసులు ఉంటే అందులో 10 వేలు ముస్లింలు వక్ఫ్‌పై వేసిన కేసులే!

ముఖ్యంగా సెక్షన్ 40 సృష్టిస్తున్న అరాచకాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. భారత దేశం మొత్తంలో కోర్టుల పర్యవేక్షణకు అవకాశం లేని ఏకైక చట్టం అది. కొన్ని ఉదంతాలను గమనిస్తే– తమిళనాడులోని ఒక గ్రామం (తిరుచునాతీరు) మొత్తం వక్ఫ్ ఆస్తి అని ప్రకటించారు. సూరత్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆవరణ మొత్తం మాదేనని వక్ఫ్ ప్రకటించింది. సూరత్‌లోని శివశక్తి సొసైటీలో రెండు ప్లాట్లు వక్ఫ్ అని ప్రకటించి అక్కడ మసీదు నిర్మాణం చేసారు. తిరుచెందూరు దేవాలయం 600 ఎకరాలు, బెంగళూరులో 600 ఎకరాలు, విజయపురి జిల్లా కర్ణాటకలో 1500 ఎకరాలు, కర్ణాటక దత్తపీట్ మందిర్, కర్నటక పాళీపుర టెంపుల్ 600 ఎకరాలు... ఇలా సెక్షన్ 40ను అడ్డం పెట్టుకొని వివిధ రాష్ట్రాలలో 36 లక్షల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించారు!

తెలంగాణ విషయానికి వస్తే– ఈ రాష్ట్రంలో మొత్తం వక్ఫ్ ఆస్తులు 77,538 ఎకరాలు. అందులో 75శాతం కబ్జా, 3500 కేసులు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం రూ.4లక్షల కోట్లు ఉన్న ఈ ఆస్తుల వల్ల వచ్చే ఆదాయం సున్నా. ఉదారణకు చార్మినార్ దగ్గర మదీనా కాంప్లెక్స్ అనే కమర్షియల్ కాంప్లెక్స్ వక్ఫ్ ఆస్తి. ఇక్కడ కోట్ల ఆదాయం వస్తున్నా వక్ఫ్ సంస్థకు ఇచ్చే రెంట్ ఏడాదికి రూ.10వేలు కూడా లేదు. తెలంగాణలో కబ్జా అయిన భూముల్లో అత్యధికంగా బడా నేతల, బడా వ్యాపారుల ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రైవేట్ విద్యా సంస్థలు, ఫంక్షన్ హాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కంపెనీలు ఉండటం విశేషం. కొన్ని నామమాత్రం లీజు, అత్యధికంగా కబ్జా.

2005 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన ఎదుగుదల కోసం జస్టిస్ సచార్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొన్ని సిఫారసులు చేసింది. 1. ముతావల్లీ పనితీరు పారదర్శకంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి, 2. రికార్డులు మొత్తం పారదర్శకంగా ఉండాలి, 3. వక్ఫ్ బోర్డులో ఏ మతంవారైనా టెక్నికల్ నిపుణులను నియమించాలి, 4. బోర్డులో మహిళలు, వెనకపడ్డ వర్గాలు, ముస్లింలలో ఉన్న ఇతర తెగలకు స్థానం కల్పించాలి 5. జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులకు కౌన్సిల్, బోర్డులలో స్థానం కల్పించాలి. 6. వక్ఫ్ బోర్డును ఫైనాన్సియల్ ఆడిట్ పరిధిలోకి తేవాలి.

యూనిఫైడ్ వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సమర్థత & అభివృద్ధి చట్టం (2025) - ద్వారా ముస్లిం సమాజానికి పలు లాభాలు ఉన్నాయి. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుంది. డిజిటల్ రికార్డింగ్ జరుగుతుంది. వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని సామాజిక, విద్యా అభివృద్ధికి వాడవచ్చు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవచ్చు. చట్టపరమైన రక్షణ లభిస్తుంది. వక్ఫ్ బోర్డుల పనితీరులో సమర్థత, సమన్వయం పెరుగుతాయి. వక్ఫ్ నిర్వహణలో మహిళా ప్రాతినిధ్యం పెరుగుతుంది.. ముస్లింలలో వెనకబడ్డ, అల్పసంఖ్యాక వర్గాలు షియా, అఘకాని, బోరా, ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుంది. పేద ముస్లింలకు విద్యా ఆరోగ్య పరిరక్షణకు వక్ఫ్ ఆదాయం వినియోగం అవుతుంది. వక్ఫ్ బోర్డుల నిర్ణయాలకు వ్యతిరేకంగా ఫిర్యాదుకు అవకాశం ఉంటుంది. ఆడిట్ నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

ఇప్పటి వరకు వక్ఫ్ చట్టం కేవలం నాయకులకు, ధనిక వర్గాలకు, ఆక్రమణదారులకు ఒక అడ్డాగా మారింది. పేదవర్గాలకు చేరవలసిన ఫలాలను ధనిక ముస్లిం వర్గాలు కొల్లగొట్టాయి. అల్లాహ్ ఆస్తులు ముస్లిం వర్గాలలోని పేద వర్గాలకు, మహిళలకు అందించాలన్నదే మోదీ ప్రయత్నం. ఆ దిశగానే వక్ఫ్ చట్ట సవరణలు. ఇందువల్ల హిందూ సమాజానికి కానీ, ఇతర మతస్థులకు కానీ వచ్చే లాభం ఏమీ లేదు.

● డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

కాంగ్రెస్ పునరుజ్జీవన పథమేమిటి?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

‘ప్రజాస్వామ్యం రెండు చక్రాలపై నడుస్తుంది. ఒక చక్రం అధికార పార్టీ అయితే మరో చక్రం ప్రతిపక్షం. ప్రజాస్వామ్యం సరిగా సాగాలంటే బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలపడాలి. అది బలహీనపడితే దాని స్థానంలో ప్రాంతీయ పార్టీలు ప్రవేశిస్తాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.’ అని రెండేళ్ల క్రితం బీజేపీ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. ఒక బీజేపీ నేత నుంచి ఇలాంటి మాటలు వచ్చాయంటే ప్రతిపక్షం బలహీనంగా ఉన్నందువల్ల జరిగే పర్యవసానాల గురించి ఆయన అర్థం చేసుకునే ఉంటారు. దేశంలో కాంగ్రెస్ ఇప్పుడు కేవలం మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉన్నది. బీజేపీతో ముఖాముఖి పోటీ జరిగే రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ ఆ పార్టీని ఎదుర్కోలేకపోతున్నదనే విషయం స్పష్టంగా నిరూపితమవుతూనే ఉన్నది. గుజరాత్‌లో మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోతోంది. ఈ పరిస్థితుల్లో గుజరాత్‌లో ఏఐసీసీ సమావేశాలను ఏర్పాటు చేసినంత మాత్రాన ఫలితాలు భిన్నంగా ఉంటాయా? గత నెలలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గుజరాత్‌కు వెళ్లి దాదాపు రెండు రోజుల పాటు 500 మంది కాంగ్రెస్ నేతలతో విస్తృత సమాలోచనలు జరిపారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఎందుకు దూరమయ్యారు అన్న విషయమై వాస్తవాలు తెలుసుకోవడంపై ఆయన తన దృష్టి కేంద్రీకరించారు. ప్రజా సమస్యలపై పోరాడడంతో పాటు జిల్లా, గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేస్తే కాని ఫలితాలు సాధించలేమనే అభిప్రాయానికి వచ్చారు.

కాంగ్రెస్ శిథిలావస్థలో ఉన్నదని, బలపడేందుకు ఏమీ చేయడం లేదని, రాష్ట్రాల్లో అంతర్గత కలహాలతో సతమతమవుతోందని విమర్శించడం సులభం. బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిషా, తమిళనాడు, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ అధికారంలో లేదని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని ఎవరైనా ఎత్తిపొడవచ్చు. అయితే కొంతకాలంగా కాంగ్రెస్ ఏదో రకంగా పోరాడుతూనే ఉన్నది. ఏదో ఒక అంశంపై ఆ పార్టీ నేతలు ప్రజల్లోకి వెళుతూనే ఉన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ నేతలు, కాంగ్రెస్ నేతల మధ్య సైద్ధాంతిక అంశాలపై బలమైన వాగ్యుద్ధాలు జరిగాయి. పార్టీలో సంస్థాగత మార్పులు తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ నేతలు తీవ్ర యత్నాలు చేస్తూనే ఉన్నారు. రెండు నెలల క్రితం జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయినప్పటికీ, మొత్తం 70 స్థానాల్లో తన ఉనికిని నిలబెట్టుకోగలిగింది. దాదాపు పది స్థానాల్లో బీజేపీకి లభించిన ఆధిక్యత కంటే కాంగ్రెస్ ఎక్కువ ఓట్లు సాధించింది. మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ మూలంగా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ 4 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ తన వ్యూహరచనను మార్చుకున్నదనడానికి ఇది నిదర్శనం. మిత్రపక్షాలు అవసరమైన చోట స్నేహంగా ఉంటూనే స్వతంత్రంగా బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ చర్యలు తీసుకుంటోంది. కొత్త ముఖాలకు అవకాశం కల్పిస్తోంది. బీజేపీని ఢీకొనాలంటే దీర్ఘకాలిక వ్యూహంతో పనిచేయాలనే విషయం కూడా కాంగ్రెస్‌కు అర్థమయినట్లు కనిపిస్తోంది. అందుకే 2027లో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అక్కడే తన ఏఐసీసీ సమావేశాలను నిర్వహిస్తోంది. ఆరు దశాబ్దాల తర్వాత మోదీ స్వంత రాష్ట్రంలోనే ఈ సమావేశాలను నిర్వహించడం ఒకరకంగా బీజేపీకి సవాలు విసిరినట్లే.

ప్రత్యర్థి ఎంత బలాఢ్యుడైనా ఆయన చేతుల్లో బలికావడం కంటే శాయశక్తులా పోరాడి కనీసం జీవించేందుకు కాంగ్రెస్ బలంగా యత్నాలు చేయడం హర్షణీయమే. ఎప్పటికైనా మోదీ రాజకీయాల్లోంచి నిష్క్రమిస్తారని, బీజేపీపై ప్రజా వ్యతిరేకత రాకమానదని కాళ్లు చాపుకుని విశ్రమించడం వల్ల కాంగ్రెస్ పూర్తిగా తెరమరుగవుతుందనే విషయం ఆ పార్టీ నేతలకు తెలుసు. కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి కూడా ముఖ్యమని ఆ పార్టీ నేతలు గ్రహిస్తున్నారు. కాని మోదీ నాయకత్వంలో అత్యంత బలోపేతమైన భారతీయ జనతా పార్టీ, దానికి అండగా నిలిచిన సంఘ్ పరివార్ సంస్థలను, ప్రజల్లో విస్తరిస్తున్న హిందుత్వ భావోద్వేగ వెల్లువలను గమనించిన తర్వాత కాంగ్రెస్ పూర్వవైభవాన్ని సంతరించుకోగలదా అన్న అపనమ్మకాలు మాత్రం ఇప్పట్లో దూరమయ్యే అవకాశాలు లేవు. కాంగ్రెస్ పుంజుకుంటుందా లేదా అన్న చర్చ కంటే కాంగ్రెస్ ఎక్కడ దారితప్పిందనే చర్చ చేయడం అవసరం. బలహీన వర్గాలు, మైనారిటీలు, దళితుల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడడం ద్వారా కాంగ్రెస్ బీజేపీ కంటే భిన్నమైనదని, బీజేపీ సంపన్నవర్గాల పార్టీ అని తీర్మానించడం వినడానికి బాగానే ఉంటుంది. కాని ఇవే వర్గాలు కాంగ్రెస్‌కు ఎందుకు దూరమయ్యాయి, ఇప్పుడు కాంగ్రెస్‌ను అవి ఎందుకు విశ్వసించాలి అన్న విషయంపై కూడా ఆ పార్టీ నేతలు స్పష్టంగా ఆలోచించాల్సి ఉంటుంది.

రెండవది, కాంగ్రెస్ వారసత్వానికి సంబంధించిన విషయం. కాంగ్రెస్‌లో ఒకప్పుడు మహామహులైన, దేశ భక్తులైన నాయకులు ఉండేవారు. ఇదే గుజరాత్‌లో 1938లో జరిగిన ఏఐసీసీ సదస్సుకు సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించి, బ్రిటిష్ వలస పాలకులపై రాజీలేని సంపూర్ణ పోరాటానికి పిలుపునిచ్చారు. ఇదే గుజరాత్‌లో సర్దార్ పటేల్ దాదాపు పాతికేళ్లు కాంగ్రెస్ శ్రేణులకు శక్తిమంతమైన నాయకత్వాన్ని అందించారు. సహాయ నిరాకరణ, పౌర ఉల్లంఘన, విదేశీ వస్త్ర దహనం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలతో పాటు కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన ప్రతి పిలుపు విజయవంతమయ్యేలా చూశారు. జాతీయ పతాకాన్ని నిషేధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి వేలాది కార్యకర్తలు నిషేధాజ్ఞలు ధిక్కరించి పతాకాన్ని ఆవిష్కరించేలా చేశారు. వీరే కాదు, రాజద్రోహ నేరంపై మాండలే జైలులో ఆరు సంవత్సరాలు గడిపిన బాలగంగాధర్ తిలక్, స్వయంపాలనకోసం పోరాడిన గోపాలకృష్ణ గోఖలే, సామాజిక సంస్కరణలను అభిలషించిన గోవింద్ రనడే లాంటి వారెందరో కాంగ్రెస్‌కు చెందినవారే. నాలుగుసార్లు కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న మదన్‌మోహన్ మాలవీయ చౌరీచోరా కేసులో ఉరిశిక్షపడిన వారిని నిర్దోషులుగా విడుదల చేయించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కాంగ్రెస్‌లో అతివాద, మితవాద శక్తులు సైద్ధాంతికంగా ఘర్షించేవి. కాని వారందరూ మెజారిటీ హిందువులను ఆకర్షించేవారు. మహాత్మాగాంధీ కూడా ప్రజాసమీకరణ చేస్తూనే హిందూ ప్రతీకల్ని ఉపయోగించుకునేవారు.



కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్యానికి చాలా ముఖ్యమని ఆ పార్టీ నేతలు గ్రహిస్తున్నారు. అయితే మోదీ నాయకత్వంలో అజేయ శక్తిగా బలోపేతమైన భారతీయ జనతా పార్టీ, దానికి అండగా నిలిచిన సంఘ్ పరివార్ సంస్థలను, ప్రజల్లో విస్తరిస్తున్న హిందుత్వ భావోద్వేగ వెల్లువలను గమనించిన తర్వాత కాంగ్రెస్ పూర్వవైభవాన్ని సంతరించుకోగలదా అన్న సందేహాలు, అపనమ్మకాలు మాత్రం ఇప్పట్లో దూరమయ్యే అవకాశాలు లేవు.

అయితే స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్య పోరాట యోధుల విలువల్ని, వారసత్వాన్ని విస్మరించింది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు మహోన్నత చరిత్ర ఉన్నదా అని ప్రజలు అనుమానపడే పరిస్థితిని కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్ని దశాబ్దాల వరకూ స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించేవారు. పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభాత భేరీలను నిర్వహించేవారు. దేశభక్తి గీతాలతో వీధులు మారుమోగిపోయేవి. కాని తర్వాతి కాలంలో ఈ వాతావరణం పూర్తిగా మారిపోయింది. బిహార్‌లో బాబూరాజేంద్ర ప్రసాద్ నివసించిన సదాకత్ ఆశ్రమ్ ఇప్పుడు ఒక పాడుబడ్డ భవనంగా మారడమే అందుకొక ఉదాహరణ. కాంగ్రెస్ ఈ వ్యవహారశైలి భారతీయ జనతా పార్టీకి ఎంతో ఉపయోగపడింది. బీజేపీని, నరేంద్రమోదీని ఇప్పుడు ఏ విషయంపై విమర్శించినా గతంలో కాంగ్రెస్ చేసిన తప్పిదాలు గుర్తుకు వచ్చేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరించారు. మదన్ మోహన్ మాలవీయ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్ భాయి పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి నుంచి మహాత్మాగాంధీ వరకూ నరేంద్రమోదీ దేశభక్తులందర్నీ తన స్వంతం చేసుకోవడం ప్రారంభించారు. హిందువుల ఓటు బ్యాంకు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓటు శాతం పడిపోయే విధంగా బీజేపీ తన విధానాలను రూపొందించుకుంది.

దీనివల్ల కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిపోయింది. ఇప్పుడు గుజరాత్‌లో సర్దార్ వల్లభ్ పటేల్ స్మారక చిహ్నం వద్ద కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని, గాంధీజీ ఆశ్రమం ఉన్న సబర్మతీ నది వద్ద ఏఐసీసీ సమావేశాలను నిర్వహిస్తున్నారంటే కాంగ్రెస్ మళ్లీ తన పూర్వవైభవాన్ని గుర్తుచేసుకుంటున్నదన్నమాట. గుర్తుచేసుకోవడం మాత్రమే సరిపోదు, తాను ఎప్పుడు, ఎక్కడ దారి తప్పిందన్న విషయమై అంతర్మథనం చేసుకోవాలి. ఒకప్పటి స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్థలాల మధ్య సమావేశాలు నిర్వహించడం, వారి చిత్రపటాలకు పూలమాలలు వేయడంతోనే సరిపోదు. వారి నాయకత్వ మహోన్నత స్ఫూర్తిని ప్రజల్లో వ్యాప్తి చేసేందుకు తామేమి చేయగలమో కాంగ్రెస్ నేతలు ఆలోచించాలి. దేశభక్తి, జాతీయవాదం, హిందూత్వ ఈ మూడింటినీ కలగలిపి బీజేపీ తన స్వంతమే అన్నట్లుగా ప్రచారం చేసుకుంటుంటే తామెందుకు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయామో ఆలోచించాలి. అంతేకాదు, సైద్ధాంతికంగా భిన్న స్వరాలకు కాంగ్రెస్ మళ్లీ వేదికగా మారాలి. అతివాద, మితవాద స్వరాలకు ఆస్కారం కల్పించాలి. 1955లో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు జేబీ కృపలానీ కేవలం హిందూ మతం కోసమే చట్టం చేయడం సరికాదని విమర్శించారు. షాబానో కేసు, అయోధ్య నుంచి రాజీవ్ ఎన్నికల ప్రచారం ప్రారంభించడం నుంచి ఇప్పటి వరకూ మతం విషయమై కాంగ్రెస్ సైద్ధాంతికంగా డోలాయమాన పరిస్థితిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ ఇటీవల ‘మెమోయిర్స్ ఆఫ్ మావెరిక్’ అనే పుస్తకంలో ఈ డైలమాల గురించి అభివర్ణించారు. విఎన్ గాడ్గిల్ లాంటి వారు కాంగ్రెస్‌లో విపరీత ఆలోచనా ధోరణిని విమర్శించారు. ఇది బీజేపీ ఎదుగుదలకు ఆస్కారం కల్పించిందనడంలో సందేహం లేదు. వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ సంస్థాగతంగా పటిష్ఠం కావడమే కాదు, సైద్ధాంతిక స్పష్టత ఏర్పర్చుకోవడంపై దృష్టి పెట్టాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పేదల ఇంట కొత్త వెలుగు ‘పీ4’

పేదల సాధికారత లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ఉగాది నుంచి అమలు చేస్తున్న విశిష్ట పథకం–పీ4. స్వర్ణాంధ్ర–2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలోని అత్యంత నిరుపేదలను ఆదుకోవడానికి ప్రవేశపెట్టిన పథకం ప్రభుత్వ–ప్రైవేటు–ప్రజల భాగస్వామ్యం (పీ–4). మరింత వివరంగా చెప్పాలంటే అత్యంత పేదరికం (జీరో పావర్టీ)తో మగ్గిపోతున్న 20 శాతం కుటుంబాలను అత్యున్నత స్థాయిలో ఆర్థికంగా నిలదొక్కుకున్న 10 శాతం మంది, ఇంకా ఎన్ఆర్ఐల సహకారంతో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో పేదరికాన్ని గణనీయంగా తగ్గించడానికి కృషి చేయడం కోసం చంద్రబాబు తెచ్చిన విధానమే పీ4. దీని అవసరం ఇప్పుడే ఎందుకు అనే అంశాన్ని చర్చించే ముందు దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న పేదరికం నేపథ్యాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత కేంద్రం, రాష్ట్రాలు ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో అభివృద్ధి కోసం, పేదరిక నిర్మూలన కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి. ప్రభుత్వాలు తాము చేసిన వ్యయాన్ని ప్రణాళికాబద్ధంగానే చేస్తున్నామని చెబుతాయి. కానీ, ఇన్ని నిధులు ఖర్చు పెట్టినా పేదరికం ఎందుకు తగ్గడం లేదు? ప్రముఖ రాజ్యాంగ కోవిదుడు నానీ ఫాల్కీవాలా గతంలో చెప్పినట్లు.. మనం అమలు చేసిన అస్తవ్యస్త ఆర్థిక విధానాల కారణంగా పేదరికం అనే విశాల సముద్రంలో సంపదతో తులతూగే కొన్ని ద్వీపాలను మాత్రం అభివృద్ధి పరుచుకోగలిగాం. ఫాల్కీవాలాతో పాటు పలువురు ప్రసిద్ధ ఆర్థిక, సామాజికవేత్తల అభిప్రాయం కూడా అదే.

మనం అమలు చేసిన ప్రణాళికల వల్ల దేశంలో సంపద పెరిగిన మాట నిజమే గానీ, అదే సమయంలో దేశంలో ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య అగాధాలు పెరిగిపోయాయి. ఒకవైపు జాతీయోత్పత్తి, సగటు తలసరి ఆదాయంలో పెరుగుదల కన్పించినా.. ఆర్థిక అసమానతలు అంతకంతకూ పెరిగిపోయాయి. దేశంలో సంపన్నులు మరింత సంపన్నులు కావడంలో ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చునేమో గానీ పేదలు మరింత పేదలు కావడాన్ని ఎవరు మాత్రం ఆమోదిస్తారు? 1991 తర్వాత దేశంలో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా జాతీయ సంపద గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. 90వ దశకం ముందువరకు జాతీయ ఆర్థికాభివృద్ధి రేటు 3–4శాతం మించలేదు. కానీ సరళీకృత ఆర్థిక విధానాలు అమలయ్యాక ఆరికాభివృద్ధి రేటు 8–9శాతం చేరుకొంది. జాతి సంపద ప్రతియేటా 8–9శాతం పెరుగుతుంటే, పేదరికం ఆ దామాషాలో తగ్గాలి కదా? కానీ పేదరికం ప్రతియేటా సగటున 0.5శాతం కూడా తగ్గడం లేదు. మరి లోపం ఎక్కడున్నట్లు?

ప్రస్తుతం 200 దేశాల ఆకలి సూచీ జాబితాలో భారత్‌ది 180వ స్థానం. మనకంటే మెరుగైన స్థానాల్లో పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లు ఉన్నాయి. ఇది భారత్‌కు అవమానం కాదా? త్వరలోనే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని గొప్పలు చెప్పుకుంటున్న భారత్‌లో 20శాతం మంది నిరుపేద ప్రజలు ప్రతిరోజూ అర్ధాకలితో ఉంటున్నారన్నది ఓ చేదు వాస్తవం. ‘పేదరికంతో సహజీవనం చేయడం కంటే అనాగరికత మరొకటి లేదు’– అన్నారు మహాత్మాగాంధీ. అభివృద్ధి, పేదరికం సమాంతరంగా కొనసాగడం ఏ సమాజానికి శ్రేయస్కరం కాదు. పేదరికాన్ని తగ్గించకపోతే శాంతిభద్రతలతో సహా అనేక సమస్యలొస్తాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందంజ వేయడం తదితర మార్పులు ఆహ్వానించదగినవేగానీ.. అంతిమంగా అవన్నీ అన్ని వర్గాల ప్రజలకూ ఉపయోగపడాలి, పెరిగే సంపద హేతుబద్ధంగా ప్రజల మధ్య పంపిణీ జరగాల్సిన అవసరం ఉంది. ఈ వాదనను చంద్రబాబు 1995 సెప్టెంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ పలు వేదికల ద్వారా వినిపిస్తూనే ఉన్నారు.

చంద్రబాబునాయుడు అమలు చేసిన సంస్కరణలు, రూపొందించిన విధానాలతో కోట్లాది మంది ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయి. ఆ క్రమంలోనే ‘పీ4’ పథకం రాబోయే ఐదేళ్లలో పేదల ఇంట కొత్త వెలుగులు పూయిస్తుందని భావించడం అత్యాశ కాబోదు.



చంద్రబాబు తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా, ప్రభుత్వోద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉంది. అటువంటి క్లిష్ట సమయంలో చంద్రబాబు అప్పటి వరకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజల సహకారంతో, ప్రజల భాగస్వామ్యంతో సమాజాన్ని స్వశక్తితో నిర్మించడానికి ‘జన్మభూమి’ కార్యక్రమం చేపట్టారు. ప్రారంభంలో ఆయన రాజకీయ ప్రత్యర్థులు. ఆ ప్రయత్నాన్ని అవహేళన చేశారు. ప్రభుత్వ ఖజానాలో చిల్లిగవ్వ లేదు గనుక ప్రజల శక్తి సామర్థ్యాలను పైసా ఖర్చు లేకుండా చంద్రబాబు వాడుకొంటున్నాడు.. అని ఎద్దేవా చేశారు.

సంప్రదాయ ఆలోచనాపరులు ‘ప్రభుత్వం వేరు.. ప్రజలు వేరు’ అనే భావన కలిగి ఉండటం సహజమే. ప్రజల్లో కూడా– ‘మనకెందుకు.. అన్నీ ప్రభుత్వం చూసుకొంటుంది’ అనే మైండ్‌సెట్ ఏర్పడి పోయింది. అయితే, చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని పట్టుదలతో చాలెంజ్‌గా తీసుకొన్నారు. తెలుగు ప్రజలలో జన్మభూమి స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిలించడంలో చంద్రబాబు గొప్ప విజయం సాధించారు. దాంతో, వయస్సు తారతమ్యాలు, సాంఘిక హోదాలు లేకుండా ప్రజలు తమ ప్రాంతాలను బాగు చేసుకోవడానికి ముందుకు కదిలారు. శ్రమదానం కార్యక్రమాలు ఊరువాడా జరిగాయి. అధికార యంత్రాంగం ఆఫీసు గదుల నుంచి ప్రజాక్షేత్రానికి కదిలారు. ఫలితంగా ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో అన్నిచోట్లా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులుగా ఉండడానికి అలవాటు పడిన ప్రజలు జన్మభూమి స్ఫూర్తితో అభివృద్ధిలో భాగస్వాములు కావడం రాష్ట్ర చరిత్రలో ఓ ఉజ్వల ఘట్టం. అంతేకాదు.. గ్రామాలలో పుట్టి పెరిగి, పల్లె బడి నుంచి పైకెదిగి దేశ, విదేశాలలో స్థిరపడిన పారిశ్రామికవేత్తలు, ఉన్నత విద్యావంతులు, వివిధ రంగాల ప్రముఖులు తాము పుట్టి పెరిగిన నేల తల్లి రుణం తీర్చుకోవడానికి అవకాశం లభించడం అదృష్టంగా భావించి.. కన్న తల్లి కంటే మిన్న అయిన జన్మభూమి రుణాన్ని కొంతైనా తీర్చుకొన్నారు.


ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ–4 ఒక విధంగా చెప్పాలంటే జన్మభూమికి కొనసాగింపే! అయితే జన్మభూమిలో వేల కోట్ల రూపాయల విలువైన సామాజిక పనులు జరిగాయి. సామాజిక ఆస్తులు రూపుదిద్దుకొన్నాయి. వేలాది గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. అయితే, ‘పీ4’ మాత్రం నేరుగా పేదరిక నిర్మూలనకు సంబంధించి అత్యంత నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొని.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం లక్ష్యంగా అమలు జరుగుతుంది.

పీ–4లో నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి సంపన్న వర్గాలు ముందుకు వస్తాయా? అనే ప్రశ్న తలెత్తడం కూడా సహజమే. నిజానికి, సమాజంలో ఏ ఆపద వచ్చినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా.. ప్రభుత్వంతో పాటు ఆదుకోవడానికి ఎంతోమంది దాతలు, సంస్థలు ముందుకొచ్చి ఇతోధికంగా సాయం చేయడం ఎప్పట్నుంచో జరుగుతూనే ఉంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) క్రింద ఎన్నో సంస్థలు పలు సామాజిక కార్యక్రమాలపై నిధులు ఖర్చు పెడుతున్నాయి. అందువల్ల ‘పీ4’ పథకంలో భాగస్వాములు కావడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చే ‘దాత’లకు కొరత ఉండకపోవచ్చు. అంతేకాదు.. చంద్రబాబునాయుడు ప్రోత్సహించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), బయోటెక్నాలజీ తదితర రంగాలలో అవకాశాలను అందిపుచ్చుకొని దాదాపు రెండున్నర దశాబ్దాలుగా దేశ, విదేశాలలో ఉన్నత స్థాయిల్లో ఉన్నవారు తమ కృతజ్ఞతను చాటుకోవడానికి సిద్ధంగా ఉన్నారనడం అతిశయోక్తి కాదు. 2024 ఎన్నికల ముందు చంద్రబాబును నాటి రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసినపుడు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైవంటి భారతీయ నగరాలతోపాటు దాదాపు 80 దేశాలలో ఉన్న తెలుగు ప్రొఫెషనల్స్ ఆయనకు సంఘీభావం తెలుపుతూ వీధుల్లోకి రావడం యావత్ ప్రపంచం వీక్షించింది. చంద్రబాబు ఒక పిలుపునిస్తే.. వారందరూ పీ4లో భాగస్వాములు కాగలరు.

‘సాయం చేయడానికి డబ్బు కంటే మనస్సు ఉండటం ముఖ్యం’ అనేది ఓ నానుడి. అందువల్ల మనస్సున్న ప్రతి ఒక్కరూ పీ–4లో భాగస్వాములై తమవంతు సాయం అందించగలరని భావించవచ్చు. చంద్రబాబునాయుడు అమలు చేసిన సంస్కరణలు, రూపొందించిన విధానాలతో కోట్లాది మంది ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయి. ఆ క్రమంలోనే ‘పీ4’ పథకం రాబోయే ఐదేళ్లలో పేదల ఇంట కొత్త వెలుగులు పూయిస్తుందని భావించడం అత్యాశ కాబోదు.

■ సి. రామచంద్రయ్య

నేనొస్తున్నా..!




కార్పొరేషన్‌లో కీలక పోస్టుకు అవినీతి మేడం ప్రయత్నాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా వ్యవహారాలు



- రూ.కోట్లలో అవినీతి కార్యకలాపాలు.. ఏసీబీకి ఫిర్యాదులు
- ఏసీబీ హిట్‌లిస్ట్‌లో పేరు.. ఆగమేఘాలపై మాతృ సంస్థకు బదిలీ
- తృటిలో రైడ్ నుంచి తప్పించుకున్న వైనం
- మళ్లీ వచ్చేందుకు కూటమి పెద్ద నాయకుడితో మంతనాలు
- మేడం రావాలనుకుంటున్న పోస్టు అధికారాలకు కమిషనర్ కత్తెర

ఆమె కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో కీలక అధికారి. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలతో కోట్లకు పడగలెత్తారు. ఆమెపై అవినీతి నిరోధకశాఖ అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదుల వెల్లాయి. దీంతో వారు తమ హిట్‌లిస్ట్‌లో ఆమె పేరు చేర్చారు. ఇక రైడ్ చేయడమే ఆలస్యం అనుకుంటున్న సమయంలో విషయం గ్రహించిన సదరు మేడం ఆగమేఘాలపై మాతృసంస్థకు బదిలీ చేయించుకున్నారు. ఈ సారి కూటమిలోని ఓ పెద్ద నాయకుడి అండదండలతో మళ్లీ కార్పొరేషన్‌లోని కీలక పోస్టుకు వచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. మేడం అవినీతి గురించి తెలిసిన కమిషనర్ వెంటనే ఆమె రావాలనుకుంటున్న పోస్టుకు ఉన్న కీలక అధికారాలను మరో పోస్టుకు బదిలీ చేశారు. ఈ విషయం ఇప్పుడు కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.



File No.VMC-ADE/0090/2024-SA-S2(WS SPL CELL)-VMC

PROCEEDINGS OF THE COMMISSIONER
MUNICIPAL CORPORATION, VIJAYAWADA
PRESENT: SRI DHYANACHANDRA H M, I.A.S.,

Rc.C1-(WS.S1)-101414/2024 ENo.66412 Dt. 23/09/2024

Sub: Establishment – Ministerial – Vijayawada Municipal Corporation – Functioning of Ward Secretariat Staff under the control of Additional Commissioner (Projects) – Orders – Issued.

Ref: This office proceedings Rc.C1-(WS.S1)-101414/2024 ENo.66412, dated 23-09-2024.

ORDER:

On administrative grounds, the Establishment of Ward Secretariat Staff will be taken care by Additional Commissioner (Projects). Accordingly the Ward Secretariat Special Cell Shall report to Addl. Commissioner (Projects) and hereafter all the correspondence pertaining to establishment of Ward Secretariat Staff shall be look after by Ward Secretariat Special Cell, which will be under the direct control of Addl. Commissioner (Projects).

Hence, the Superintendent, Ward Secretariat Special Cell and Ministerial staff working in Ward Secretariat Special Cell are directed to submit all the correspondence files through Addl. Commissioner (Projects).

These orders shall come into force with immediate effect.

Dhyanachandra H M
COMMISSIONER

Copy to the Superintendent, Ward Secretariat Special Cell
Copy to the Addl. Commissioner (Projects).

కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లోని ఇంజనీరింగ్ విభాగంలో ఒక కీలక పోస్టు నిర్వహించిన అధికారిణి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతికి ఆకాశమే హద్దు అన్నట్టుగా చెలరేగిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేషన్‌లో ఒక అవినీతి టీమ్ నడుపుతూ నగరాన్ని శాసించే స్థాయికి మిగతా 6లో..

మేడం కన్నేసిన పోస్టు అధికారాలకు కమిషనర్ కత్తెర

సదరు అవినీతి అధికారిణి గురించి పూర్తి సమాచారం ఉన్న కమిషనర్ ధ్యానచంద్ర దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆమె ఒకవేళ తనను అడిగితే తిరస్కరించాలని ఆయన నిర్ణయించినట్టు తెలిసింది. తనను అడగకుండా పోస్టింగ్ తెచ్చుకుంటే.. ఆమె అధికారాలు కత్తిరించాలన్న ఉద్దేశ్యంతో ముందస్తుగా ఆమె ఏ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తుందో ఆ పోస్టుకు సంబంధించిన కీలక అధికారాలన్నింటినీ మరో పోస్టుకు బదిలీ చేస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఏకంగా సర్క్యులర్‌ను జారీ చేశారు. దీంతో మేడం వచ్చినా.. అధికారాలు లేకుండా ఆ పోస్టులో పనిచేయాల్సి ఉంటుంది. ఈ విషయం కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

మళ్లీ కార్పొరేషన్‌కు వచ్చేందుకు కూటమి నేతలతో ప్రయత్నాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతలతో అంటకాగిన మేడం ప్రభుత్వం మారగానే.. ఏసీబీకి భయపడి మాతృశాఖకు వెళ్లిపోయారు. అక్కడ అవినీతి చేయటానికి అవకాశాలు లేకపోవటంతో మళ్లీ కార్పొరేషన్‌లో తిరిగి తన పాత పోస్టుకే వచ్చేం దుకు తొలుత ప్రయత్నాలు చేశారు. ఆ పోస్టులో ఇటీవలే మరొకరిని ప్రభుత్వం నియమిం చటంతో.. మరో కీలక పోస్టు కోసం ప్రయత్నాలు ఆరంభించారు. కూటమికి చెందిన ఓ పెద్ద నేత ద్వారా విజయవాడ కార్పొరేషన్‌లో కాలు పెట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం.

బిల్లు గుభేల్

దడ పుట్టిస్తున్న విద్యుత్ చార్జీలు

- 154 యూనిట్లు వాడితే రూ.5,436 బిల్లు
- మార్చి నెలలో వినియోగదారులకు 'షాక్'
- కొత్తగా అదనపు లోడ్ చార్జీలు
- గగ్గోలు పెడుతున్న ప్రజలు



● రామ్‌ప్రసాద్ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఆయనకు ఇంట్లో ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఏసీ, స్మార్ట్ టీవీ, ఫ్యాన్ ఉన్నాయి. ఇవి కాకుండా రెండు ట్యూబ్‌లైట్లు ఉన్నాయి. ఆయన మార్చి నెలలో మొత్తం 154 యూనిట్ల విద్యుత్‌ను ఉపయోగించారు. దీనికి సంబంధించి వచ్చిన బిల్లు మొత్తం రూ.5,436. ఇందులో రూ.4,550లను పాత బకాయిలుగా చూపించారు. ట్రూ అప్ చార్జీలుగా (33/36) రూ.48.96, ఎఫ్‌పీపీసీఏ చార్జీలుగా(23/05) రూ.93.13, ఎఫ్‌పీపీసీఏ (25/02) చార్జీలుగా రూ.41.60 విధించారు. వినియోగించిన విద్యుత్ యూనిట్లకు రూ.591, ఫిక్స్‌డ్ చార్జీలుగా రూ.10లు, కస్టమర్ చార్జీలుగా రూ.50, విద్యుత్ సుంకం రూ.9.24లుగా చూపించారు.

● గుణదలకు చెందిన మరో వినియోగదారుడు 284 యూనిట్లను వినియోగించారు. ఆయనకు వచ్చిన మొత్తం బిల్లు రూ.1,533.25. ఈ విద్యుత్ బిల్లులను చూసి వినియోగదారులు గొల్లుమంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంట్లో స్విచ్ వేసినా, వేయకపోయినా కరెంట్ షాక్ తగులుతోంది. వినియోగించిన విద్యుత్ మూరెడు ఉంటే, వచ్చే బిల్లులు మాత్రం బారెడు ఉంటున్నాయి. కిందటి నెల వందల్లో వచ్చిన విద్యుత్ బిల్లులు ఇప్పుడు ఒక్కసారిగా వేలల్లోకి వెళ్లాయి. ట్రూప్ అప్ చార్జీలు, ఇంధనపు చార్జీలు, సర్దుబాటు చార్జీలతోపాటు అదనపు లోడ్ చార్జీలను విధిస్తున్నారు. దీనితో వినియోగదారులకు ఈ నెలలో చెల్లించాల్సిన బిల్లులు డబుల్ షాక్‌ను ఇస్తున్నాయి. ఇప్పటికే వివిధ రూపాల్లో విధిస్తున్న చార్జీలతో విద్యుత్ వినియోగదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికి అదనపు లోడ్ చార్జీలను జోడించడంతో తలలు పట్టుకుంటున్నారు. ఏం చేయాలో తెలియక అల్లాడిపోతున్నారు. ఇళ్లలో ఫ్యాన్‌లు వేయాలన్నా, ఏసీ ఆన్ చేయాలన్నా వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. గత నెలకు, ఈ నెలకు బిల్లులు తడిసి మిగతా 6లో..

ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో నేలవాలిన బొప్పాయి తోట



అకాల వర్షం.. అపార నష్టం

15 వేల హెక్టార్లలో నేలరాలిన మామిడి

- 14.20 హెక్టార్లలో పడిపోయిన అరటి తోటలు
- 46 హెక్టార్లలో బొప్పాయి చెట్లు ధ్వంసం
- ఉద్యాన రైతులను కోలుకోలేని దెబ్బతీసిన గాలివాన

అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని కలుగుజేశాయి. వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు వచ్చిన ఈదురు గాలులతో కూడిన వర్షం ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో మామిడి కాయలు నేలరాలాయి. 14.20 హెక్టార్లలో అరటి తోటలు, 3.5 హెక్టార్లలో మునగ, 46 హెక్టార్లలో బొప్పాయి తోటలు నేలమట్టం అయ్యాయి. 8.4హెక్టార్లతో కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. 6లో



ఇక దేదీప్యం!

భవానీ ద్వీపం అభివృద్ధికి ముందుకొచ్చిన సీఆర్‌డీఏ



- ప్రభుత్వ ఆదేశాలతో లేఖ రాసిన బీఐటీసీ
- అమరావతి రాజధాని పరిధిలో ఉండటంతో మరింత అభివృద్ధికి అవకాశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి రాజధాని నగరానికి అభిముఖంగా ఉన్న భవానీ ద్వీపాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి సీఆర్‌డీఏ ముందుకు ముందుకు వచ్చింది. కృష్ణానదిలో అతి పెద్ద ఏకైక ద్వీపంగా భవానీ ఐల్యాండ్ ఉంది. తరచూ వస్తున్న వరదలు భవానీ ఐల్యాండ్‌ను కోలుకోలేకుండా చేస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భవానీ ద్వీపాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. అనూహ్యంగా ఆ తర్వాత వచ్చిన వరదలు నాశనం చేశాయి. దీంతో వరదలను తట్టుకునేలా తీర్చిదిద్దటంతో పాటు, దీని అభివృద్ధి బాధ్యతలను ఇక మీదట సీఆర్‌డీఏ తీసుకోబోతోంది. భవానీ ద్వీపం చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయటంతో పాటు లోపల పర్యాటకంగా అభివృద్ధి చేయనుంది. భవానీ ద్వీపం అభివృద్ధి కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)ని ఏర్పాటు చేసింది. ఈ బీఐటీసీ ద్వారా ద్వీపంలో గతంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. ప్రస్తుతం బీఐటీసీ కూడా నిధుల కొరతను ఎదుర్కొంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం భవానీ ద్వీపం అభివృద్ధిలో సీఆర్‌డీఏ కూడా భాగస్వామ్యం కావాలని మిగతా 6లో..

మునేటిపై వంతెన!

వంతెనలు, రహదారుల నిర్మాణం ఎక్కడ జరిగితే అక్కడ అభివృద్ధి జరుగుతుంది. వ్యవసాయ, వాణిజ్య, రవాణా రంగాలలో పెను మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయి. మౌలిక వసతులలో ప్రధానమైన రోడ్లు, వంతెనల నిర్మాణం వల్ల నేడు అనేక నగరాలు అభివృద్ధిని సాధించాయి. అదే తీరున రహదారి సౌకర్యాలు పెరిగితే గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తాయి. అమరావతి నిర్మాణంతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం తొలుత రోడ్లు, వంతెనలపైనే దృష్టి సారించింది. కృష్ణానదిపై వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. దీంతో సుదీర్ఘ కాలంగా ఉన్న మునేటిపై ఏటూరు-మోగులూరు వంతెన నిర్మాణం డిమాండ్ తెరపైకి వచ్చింది.

ఏటూరు, మోగులూరు మధ్య నిర్మాణానికి అనుకూలం

మునేటిలో నీటి ప్రవాహం



- కాజ్‌వే నిర్మాణానికి స్థానిక నాయకుల వినతి
- రూ.2.20 కోట్లు ఇస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ.145 కోట్ల అంచనాలతో వంతెన నిర్మాణానికి డీపీఆర్ ఇచ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- నిధుల మంజూరుకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి
- కాజ్‌వే కావాలో.. వంతెన కావాలో తేల్చుకోవాల్సింది స్థానిక నాయకులే..

మునేటిపై వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం



చందర్లపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చందర్లపాడు-కంచికచర్ల మండలాలను కలుపుతూ మునేటిపై కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. చందర్లపాడు మండలం ఏటూరు నుంచి కంచికచర్ల మండలం మోగులూరు మధ్య ఈ నిర్మాణం చేపట్టాలన్నది ప్రజల కోరిక. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కాజ్‌వే నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు సర్వే కూడా నిర్వహించారు. ఈ నిర్మాణం జరిగితే రెండు మండలాల మధ్య సుమారు 30 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ప్రజలకు ఎంతో సౌకర్యం ఏర్పడుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఖర్చులు తగ్గుతాయి. దీంతో పాటు చందర్లపాడు మండల ప్రజలు రాజధాని అమరావతికి వెళ్లాలంటే అత్యంత సులువైన మార్గం ఏర్పడుతుంది. ఈ వంతెన దాటితే ఓఆర్‌ఆర్‌ను త్వరగా చేరుకోగలుగుతారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాజ్‌వేనా.. వంతెనా!

మునేటిపై కాజ్‌వే నిర్మిస్తారా లేక వంతెన నిర్మాణం చేపడతారా అన్న అంశంపై ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. వర్షాకాలంలో మునేటి ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. ఏటూరు- మోగులూరు వద్ద మునేటి ప్రవాహం కృష్ణానదిలో కలుస్తుంది. ఏటా ఏదో ఒక సమయంలో రెండు నదులకు ఒకే మారు ప్రవాహం పెరుగుతుంది. ఆ దశలో మునేరు ఎగతాపు వేసి మిగతా 6లో..

దుర్గగుడిలో చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం 6లో

రామలింగా.. దాహం దాహం..!

రామలింగేశ్వరనగర్ 1500 కేఎల్ రిజర్వాయర్ పనుల్లో జాప్యం

- శాఖల మధ్య సమన్వయం లోపం వల్లే సమస్య
- మనసుపెడితే 10 రోజుల్లో మంచినీటి సరఫరా

8లో

కోర్టు ఫీజు స్టాంపుల కొరతను తీర్చండి

- ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు

సమైక్యతా శంఖారావం సదస్సులో పాల్గొనండి 8లో

- సాహిత్యవేత్తలు, కళాకారులు, సంఘాలకు పిలుపు



విరిగి పడిన పనస చెట్లు, నేలరాలిన పండ్లు చూపుతున్న రైతు



కొత్తూరు తాడేపల్లిలో నేలరాలిన మామిడి



కొర్లమండలో విరిగి పడిన మామిడి చెట్టు



జి.కొండూరులో కల్లాల్లో మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు

అకాల వర్షం.. అపార నష్టం!

- రెండ్రోజులు వర్షం, ఈదురు గాలుల విధ్వంసం
- ఉద్యాన రైతుకు కోలుకోలేని దెబ్బ
- ఎన్టీఆర్ జిల్లాలో 15 వేల ఎకరాల్లో రాలిన మామిడి కాయలు.. కల్లాల్లో తడిసిన మిర్చి.. మధ్యకు విరిగి పడిన బొప్పాయి చెట్లు

అకాల వర్షాలు అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం ఉద్యాన రైతుల నడ్డి విరిచింది. ఒకవైపు తెగుళ్ల బెడదతో అల్లాడుతున్న రైతులు అధిక పెట్టుబడులు పెట్టి ఎలాగోలా పంటను దక్కించుకున్నా గిట్టుబాటు ధరలేక దిగాలు పడుతున్న దశలో అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ముఖ్యంగా ఉద్యాన పంటల రైతులు భారీగా నష్టపోయారు.

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

అకాల వర్షాలు.. ఈదురు గాలులు మిర్చి, మామిడి, బొప్పాయి, పనస తదితర ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఏప్రిల్ 7న ఈదురుగాలులకు కల్లాల్లో మిర్చిని కాపాడుకునేందుకు కప్పిన పట్టాలు గాల్లో ఎగిరి కిలోమీటర్ దూరంలో పడ్డాయి. దీంతో మిర్చి తడిచి ముద్దయింది. మిర్చి తడిచి పోవడంతో కాయలు రంగు మారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మామిడికి అపారనష్టం

అకాల వర్షాలు పంట చేతికి రాకుండానే మామిడి రైతుకు తీవ్ర నష్టం మిగిల్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లోని తోటల్లో కాయలు నేలరాలగా.. చెట్లు నిలువునా చీలిపోయాయి. చాలాచోట్ల పెద్ద పెద్ద చెట్లు నేలకూలాయి. జిల్లాలోని 55 వేల ఎకరాలకు 20 వేల ఎకరాల్లోని తోటల్లో మామిడికాయలు నేలరాలాయి. రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. రెండుసార్లు ఈదురుగాలులకు కాయలు పూర్తిగా నేలరాలి కోతలు కోసిన తోటల్లా మారడంతో కొత్తూరుతాడేపల్లి, జి.కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, మైలవరం రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎంతో ఖర్చుచేసి పండించిన పంట ఈదురుగాలులకు పూర్తిగా నాశనమైందని, తాము నష్టపోయామని, ఉద్యానశాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. కొత్తూరు తాడేపల్లిలో నేలవాలిన మామిడితోటలను టీడీపీ మైలవరం నియోజకవర్గ ఎస్సీసెల్ సెక్రటరీ మెండెం జమలయ్య, రైతు నాయకులు చింతా సుధాకర్, వార్డు సభ్యుడు సింహాద్రి రామోజీ పరిశీలించి రైతులను పరామర్శించారు.

● ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు తుల్లూరు గోపాలరావు సుమారు ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగుచేయగా.. ఈదురు గాలులకు సుమారు మూడు ఎకరాల్లో తోట పూర్తిగా నేలవాలిపోయింది. కాయలు కోసేందుకు పనికి రావని రైతు వాపోయాడు. ఎ.కొండూరు మండలంలో 40 హెక్టార్లలో బొప్పాయి సాగుచేయగా 18 హెక్టార్లలో పంట నేలవాలినట్టు హెచ్‌వో నరేంద్రకుమార్ తెలిపారు.

ఆందోళనలో మామిడి, మొక్కజొన్న రైతులు

మైలవరంరూరల్/జి.కొండూరు : ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వందల టన్నుల మామిడి కాయలు నేలరాలాయి. కాయ కోతకు వచ్చిన సమయంలో అకాల వర్షంతో లక్షలాది రూపాయలు నష్టపోయామని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. మంగళవారం ఉదయం వ్యాపారులు కూలీలతో నేలరాలిన కాయలను కుప్పలుగా పోయించారు. పొందుగల తండా సమీపంలోని కాకర తోట ఈదురుగాలులకు నేలమట్టం అయ్యింది. చంద్రగూడెం లక్ష్మీనరసింహస్వామి ధ్వజస్తంభం విరిగిపడింది. తోటల్లో కొమ్మలు విరిగిపోయాయి. పొందుగల, అనంతవరం, చంద్రగూడెం, తదితర గ్రామాల్లో మొక్కజొన్న నేలవాలింది. కంకి విరుపుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్నకు ఈదురు గాలులు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కంకిబరువుతో ఉన్న తోటలు నేలవాలిపోయాయి. ఇప్పటికే కండెలు విరిసి ఆరబోసిన మొక్కజొన్నలు అకాల వర్షానికి చాలా వరకు తడిచి ముద్దయ్యాయి. ఇప్పటికే నష్టాలలో ఉన్న తమను అకాల వర్షం మరింత దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు.



నేలవాలిన మొక్కజొన్న, తలలు విరిగిన బొప్పాయి తోటలు



కూలిన చెట్లు.. పడిపోయిన విద్యుత్ స్తంభాలు

జి.కొండూరు : ఈదురు గాలులకు విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. జి.కొండూరు నుంచి వెలగలేరు పేదల కాలనీకి వెళుతున్న విద్యుత్‌లైన్లపై ఆత్కూరు రోడ్డు వెంట ఉన్న చెట్లు పలు చోట్ల విరిగి పడ్డాయి. దీంతో సుమారు 10పైగా విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సుమారు 2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.



ప్రభుత్వం ఆదుకోవాలి



- పలగాని చెన్నకేశవరావు

ఇప్పటికి రెండు సార్లు కురిసిన వర్షానికి పంటలు పూర్తిగా తడిచిపోయాయి. గిట్టుబాటు ధర లేదు. పంట నష్టంపై అధికారులు స్పందించాలి. ప్రభుత్వం ఆదుకోవాలి.

ఆరుగాలం కష్టం నీటిపాలు

- కందుల ప్రభాకర్ (జి.కొండూరు)





వర్షం నుంచి కల్లాల్లో మిర్చి పంటను కాపాడుకునేందుకు పట్టాలు కప్పినా ప్రయోజనం లేదు. ఈదురుగాలులకు పట్టాలు ఎగిరిపోయాయి. వర్షానికి మిరపకాయలు తడిచి రంగు మారిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి లేకుంటే ఆత్మహత్యలే శరణ్యం.

కన్నీరే మిగిలింది..



- పగడాల సత్యనారాయణ (నాగులూరు)

ఈదురు గాలులకు మావిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. తోటలోకి వెళితే కళ్ల వెంట నీళ్లు వస్తున్నాయి. కిందపడిన కాయలు వేరించినా ఫలితం శూన్యం. అసలే తెగుళ్లకు మందులు వాడి పంట పండించాం. ఇప్పుడు అంతా వర్షార్పణం అయ్యింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

పంట నష్టం అంచనాలు వేశాం

- బాలాజీ, ఏడీహెచ్

ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం ఈదురుగాలులు, వర్షాలకు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 14.20 హెక్టార్లలో అరటి తోటలు, 3.5 హెక్టార్లలో మునగ, 46 హెక్టార్లలో బొప్పాయి తోటలు, 8.4 హెక్టార్లతో కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. 15 వేల హెక్టార్లలో మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి.



చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల పూజలు, వెండి పల్లకీ సేవ

దుర్గగుడిలో చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో మంగళవారం చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన మంగళవారం దుర్గా మల్లేశ్వరులకు మంగళస్నానాల అనంతరం వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం 4 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీప స్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు వేదోక్తంగా జరిగాయి.



సాయంత్రం 5 గంటలకు తప్పెట్లు, కోలాట నృత్యాలు, తాళం, భజన కళాకారుల ప్రదర్శనలు, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గా మల్లేశ్వరుల వెండి పల్లకీ వాహన సేవ కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, మెయిన్ బజారులలో భక్తకోటిని అనుగ్రహిస్తూ ఊరేగింపు సాగింది. పల్లకి ముందు భక్తులు రహదారులను పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి జయజయ ధ్వానాలుచేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేనొస్తున్నా..!

(5వ పేజీ తరువాయి)

వచ్చారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఒక ఈఈ, ఒక డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ), ఒక టీపీబీవో, కమిషనర్ పేషీలోని ఒక ఉద్యోగి, శానిటరీ వింగ్‌లో ఒక శానిటరీ సూపర్‌వైజర్ (ఎస్ఎస్) వీళ్లంతా మేడమ్ టీమ్‌లో అవినీతి మేట్స్. వీరంతా తమ తమ విభాగాల పరిధిలో ఫైల్స్‌ను మేడం దగ్గరకు తీసుకు వచ్చి క్లియర్ చేయిస్తారు. ఇందుకు గాను భారీ మొత్తంలో చేతులు మారాయన్న తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. నగరంలో మేడం అండ్ టీమ్ సాగించిన అవినీతి వ్యవహారాలపై ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు కూడా ఫిర్యాదులు అందడం గమనార్హం.

నామినేషన్ పద్ధతి పనుల్లో భారీగా అవినీతి

నగరంలో పార్కుల అభివృద్ధి, కాలువ గట్ల సుందరీకరణ, డివైడర్స్ - వాల్ పెయింట్స్, మొక్కల కొనుగోలు వంటి పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించటంలో భారీగా అవినీతి జరిగిందని నేరుగా ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. వార్డు సచివాలయ బదిలీలు, శాలరీ సర్టిఫికెట్ల మంజూరు, మెటర్నిటీ లీవులు, లాంగ్ లీవులు, గైర్హాజరైన వారిని విధుల్లోకి తీసుకోవటం, సస్పెన్షన్లు ఎత్తివేయటం, షోకాజ్ నోటీసులకు చర్యలు తీసుకోకుండా ఉండటానికి కూడా భారీ ఎత్తున మేడమ్ టీమ్ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. ఏసీబీకి అందిన ఫిర్యాదు మేరకు చూస్తే పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి రైల్వే ట్రాక్ వరకు కాలువ ఒడ్డున గ్రీనరీ ఏర్పాటును బినామీ కాంట్రాక్టర్‌తో చేయించారని, ఈ పనికి అయిన ఖర్చు రూ. 20 లక్షలు అయితే రూ. కోటి అయినట్టుగా బిల్లు ఆమోదించారని ఫిర్యాదులో పేర్కొనటం జరిగింది. ఇదే పద్ధతిలో రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ రాఘవయ్య పార్కు, ఐకానిక్ పార్క్, ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపణలు ఉన్నాయి. రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టిన గ్రానైట్ ఫుట్‌పాత్‌ల పనుల్లో కూడా భారీ అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులలో కూడా భారీగా అవినీతికి పాల్పడినట్టు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీ టాప్-50 హిట్‌లిస్టులో మేడం పేరు కూడా ఉందంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

కలెక్షన్ ఏజెంట్లను పెట్టుకుని మరీ వసూళ్లు!

ఇంజనీరింగ్ విభాగం పరిధిలో పనులు చేసిన ఏ కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లుల ఫైల్స్ అయినా సరే మేడం దగ్గరకే రావాలి. మేడం దగ్గర ఉండే డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు.. మేడంకు కలెక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక లావాదేవీలన్నీ కూడా ఈ ఏజెంట్ కుమారుడు, అన్నయ్య ఫోన్ నంబర్లతోనే జరుగుతాయని సమాచారం. కాంట్రాక్టర్లు ఫోన్‌పేలు చేసిన తర్వాత.. కలెక్షన్ ఏజెంట్ ఆ ఫైల్స్ మేడం దగ్గరకు తీసుకు వెళ్లి క్లియర్ చేయిస్తారు. మేడమ్‌కు వచ్చిన కలెక్షన్‌లో కొంత మొత్తాన్ని కమీషన్‌గా ఏజెంట్‌కు ఇచ్చినట్లు సమాచారం.

కమిషనర్ పేషీ ఉద్యోగికి నెలకు 3 కేజీల డ్రై ఫ్రూట్స్

మేడమ్ అవినీతి మేట్స్‌లో ఒకరైన కమిషనర్ పేషీ ఉద్యోగికి డ్రై ఫ్రూట్స్ అంటే చాలా ఇష్టం. దీనికోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రతి నెలా ఆ ఉద్యోగికి మూడు కేజీల డ్రై ఫ్రూట్స్‌ను అందించాలి. డ్రై ఫ్రూట్స్ అందించకపోతే శానిటరీ విభాగంలో అల్లకల్లోలం జరిగిపోతుంది. తన అక్రమ ఆర్థిక వ్యవహారాలలో ప్రధాన భూమిక పోషిస్తున్న కమిషనర్ పేషీ ఉద్యోగి డ్రై ఫ్రూట్స్ కోరికను మేడం తీర్చుతున్నారు. అచ్చంగా డ్రై ఫ్రూట్స్ అందించటానికి కొందరు శానిటరీ సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించటం గమనార్హం.

చాకచక్యంగా మాతృశాఖకు..

గతంలో కార్పొరేషన్‌లో పనిచేసిన ఒక ఉన్నతాధికారి బదిలీ అయ్యారు. ఆయన రిలీవ్ అయ్యే సమయంలో పెద్ద సంఖ్యలో ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఫైల్స్‌ను క్లియరెన్స్ చేసినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫైల్స్ క్లియరెన్స్‌లో సాగించిన అవినీతి విలువ రూ.కోట్లలోనే ఉంటుందన్న ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపైనా ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. తరచూ ఏసీబీకి చెందిన అధికారులు, పోలీసులు కార్పొరేషన్ గడపతొక్కటం, వివిధ ఫైల్స్‌కు సంబంధించిన సమాచారం తీసుకోవటం కొత్తగా వచ్చిన కమిషనర్ ధ్యానచంద్రకు తలనొప్పిగా మారింది. ఏసీబీ ఉన్నతాధికారులు మేడం మీద రైడ్ చేసే క్రమంలో ఆమె చాకచక్యంగా ఇక్కడి నుంచి మాతృశాఖకు వెళ్లి పోయారు. దీంతో రైడ్ తాత్కాలికంగా ఆగిపోయింది.

సిట్ విచారణలో అన్నీ తేలతాయి

- అవినీతి ఊబిలో కూరుకుపోయిన పేర్ని నానికి మతి భ్రమించింది
- నాణ్యత పరీక్షించాకే మద్యం విక్రయాలు
- మంత్రి రవీంద్ర కౌంటర్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మద్యం అక్రమాలపై సిట్ విచారణ జరుపుతుంటే.. పేదల బియ్యం దొంగ పేర్నినాని మతి భ్రమించి మాట్లాడుతున్నాడని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. పేర్నినాని విమర్శలపై మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడారు. మాజీమంత్రి పేర్ని నాని విమర్శలను తిప్పికొట్టారు. వైసీపీ నేతల్లా కల్తీ మద్యాన్ని ఎన్నడూ విక్రయించలేదన్నారు. మద్యం దుకాణాల నుంచి కూటమి ఎమ్మెల్యేలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న పేర్ని నాని ఆరోపణలను మంత్రి ఖండించారు. మద్యం విధానంలో అవినీతికి పాల్పడింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. వైసీపీ అక్రమాలపై సీఐడీ, సిట్ విచారణ జరుగుతోందన్నారు. ఏ తప్పు చేయక పోతే ఫైళ్లను ఎందుకు తగుల పెడతారన్నారు. గీత కార్మికులకు 340 షాపులు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మద్యం నిల్వల శాంపిళ్లను పరీక్ష చేయిస్తున్నామన్నారు. పేదల బియ్యం బొక్కి మీడియా ఎదుట పేర్ని నాని నీతులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

రైల్వే స్టేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు విజయవాడ డివిజన్ మీదుగా 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07325 హుబ్లీ-కతిహార్ ఈనెల 9 నుంచి 30వ తేదీవరకు ప్రతి బుధవారం, 07326 కతిహార్-హుబ్లీ ఈనెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి శనివారం, 06559 ఎస్ఎంబిటి బెంగుళూరు-నారంగి ఈనెల 8 నుంచి 29వ తేదీ వరకు ప్రతి మంగళవారం, 06560 నారంగి-ఎస్ఎంబిటి బెంగుళూరు ఈనెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి శనివారం నడుస్తాయన్నారు. ఈ ప్రత్యేక రైళ్లలో టూఏసీ, త్రీఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ కోచ్‌ల సౌకర్యం ఉంటుందని చెప్పారు.

ఇక దేదీప్యం!

(5వ పేజీ తరువాయి)

ఆదేశించటంతో.. సీఆర్‌డీఏ భవానీ ద్వీపం బాధ్యతలను తీసుకోవాలని నిర్ణయించింది. భవానీ ద్వీపం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీఐటీసీ ఉన్నతాధికారులు కూడా సీఆర్‌డీఏకు ఆ మేరకు లేఖ రాయటం జరిగింది. వెంటనే సీఆర్‌డీఏ కూడా సానుకూలంగా స్పందించింది. బీఐటీసీ నేతృత్వంలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ ఆర్థికంగా తన వంతు సహకారాన్ని ఇక మీదట అందించనుంది. రాజధాని ప్రాంత పరిధిలో భవానీ ద్వీపం ఉండటం వల్ల సీఆర్‌డీఏ రంగంలోకి దిగటం వల్ల రానున్న రోజుల్లో భవానీ ద్వీపం అత్యద్భుతంగా అభివృద్ధి చెందటానికి అవకాశం కలగనుంది.

అధిష్టానం ఆదేశాలు పాటిస్తాం!

● ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరవ్వం ● టీడీపీ సమన్వయ కమిటీ నిర్ణయం..!



సమావేశంలో పాల్గొన్న సమన్వయ కమిటీ నేతలు

తిరువూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తిరుగుబాటు జెండా ఎగరేసిన పార్టీ నేతలు, కార్యకర్తలు, సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే తీరుపై మరోసారి ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాల్లో తాము పాల్గొనబోమని నియోజకవర్గం టీడీపీ సమన్వయ కమిటీ నిర్ణయించుకున్నట్టు సమాచారం. పార్టీ అధిష్టానం ఆదేశాల ప్రకారం పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేస్తామని వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే వ్యవహార శైలి పార్టీకి నష్టం చేకూర్చేలా ఉందని, ఆందోళన వ్యక్తం చేస్తున్న పార్టీ నేతలు, సోమవారం సాయంత్రం టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో కార్యకర్తలు మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. నియోజకవర్గ కేంద్రమైన తిరువూరులో ఈనెల 14న తలపెట్టిన పీ-4 కార్యక్రమంపై నిర్వహించనున్న సదస్సులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొనే అవకాశం ఉండటంతో ఆ సదస్సుకు తాము హాజరుకాబోమని, టీడీపీ జెండాపై గెలిచి వైసీపీ నేతలతో అంటకాగుతూ, పార్టీ నేతలు, కార్యకర్తల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, నియోజకవర్గంలో ఆయన ఏ కార్యక్రమంలో పాల్గొన్నా తామెవ్వరూ వెళ్లేది లేదన్నారు. సమావేశంలో పార్టీ నేతలు, ఎస్సీ, బీసీ కమిటీల నేతలు అల్టిమేటమ ఇవ్వడంతో, స్థానిక పార్టీకి చెందిన కొందరు నేతలు, జిల్లా నాయకత్వంతో చర్చించి, పీ-4 సదస్సును వాయిదా వేసినట్టు తెలుస్తుంది. ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని సైతం ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా అన్ని మండలాల్లో పార్టీ ఆధ్వర్యంలోనే ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్టు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పీ-4పై నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడంతోపాటు అర్హులకు పథకాలు అందేలా కృషి చేస్తామని, కమిటీలో నేతలతో పాటు, ఎస్సీ, బీసీ, కమిటీల సభ్యులు ముక్తకంఠంతో పేర్కొన్నట్టు సమాచారం. 4 మండలాలకు చెందిన పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

బిల్.. గుభేల్!

(5వ పేజీ తరువాయి)

మోపిడయ్యాయి. ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీల పేరుతో బిల్లులు పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. గత నెలకంటే చార్జీలు రెట్టింపు కావడంతో వినియోగదారులు విద్యుత్ శాఖఅధికారులపై మండిపడుతున్నారు. కరెంటు చార్జీలు పెంచబోమని ప్రభుత్వం చెబుతుంటే బిల్లులు మోత మోగించడం ఏమిటని వినియోగదారులు నిలదీస్తున్నారు. రెట్టింపు బిల్లులు వచ్చాయని వారు ఆందోళన చెందుతున్నారు.

పాత బకాయిలుగా అదనపు లోడ్ చార్జీలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎల్‌టీ-1(గృహ) కనెక్షన్లు 14,98,644, ఎల్‌టీ-2(వాణిజ్యం) కనెక్షన్లు 1,19,874 ఉన్నాయి. ఇవి కాకుండా ఎల్‌టీ-3(పరిశ్రమలు) కనెక్షన్లు 7,198, ఎల్‌టీ-4(కుటీర పరిశ్రమలు) కనెక్షన్లు 27,786, ఎల్‌టీ-5 (ఆక్వా) 3 వేలు, హెచ్‌టీ కనెక్షన్లు 1,522 ఉన్నాయి. ఈ మొత్తం కనెక్షన్లకు ఏడు రకాలుగా చార్జీలను విధిస్తున్నారు. వీటితోపాటు అదనపు లోడ్ చార్జీలను బిల్లులో విధిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు ఎంత వరకు లోడ్ వినియోగిస్తారో దరఖాస్తులో తెలియజేయాల్సి ఉంటుంది. కొద్దినెలల క్రితం విద్యుత్‌శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లోడ్‌ను తనిఖీ చేశారు. దరఖాస్తులో పేర్కొన్న లోడ్‌కు మించి విద్యుత్‌ను వినియోగిస్తున్నారని నోటీసులు జారీ చేశారు. ఎంత లోడ్ అదనంగా వినియోగిస్తున్నారో దానికి చెల్లించాల్సిన మొత్తాలను రాసి ఇచ్చారు. ఈ నోటీసులకు వినియోగదారులు పెద్దగా స్పందించలేదు. దీనితో బిల్లులో వాటిని చూపిస్తున్నారు. వాటిని పాత బకాయిలుగా బిల్లులో పేర్కొన్నారు. ఆ బకాయిలను పదో తేదీ లోగా చెల్లించాలని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. వినియోగదారులు విద్యుత్ కార్యాలయాలకు వెళ్లి సందేహాలను వ్యక్తం చేసిన తర్వాత ఈ విషయాన్ని చెబుతుండడం గమనార్హం.

నోటీసులు ఎప్పుడిచ్చారో తెలియదు

నేను అద్దె ఇంట్లో ఉంటున్నా. ప్రతినెలా బిల్లు చెల్లిస్తున్నా. నాకు ఈ నెల బిల్లు రూ.591 వచ్చింది. ఎరియర్స్ (పాతబకాయిలు)గా రూ.4,550 చూపించారు. బిల్లు ఇవ్వగానే సంబంధిత విద్యుత్ కార్యాలయానికి వెళ్లా. ఇదేమిటని అడిగితే అదనపు లోడ్‌చార్జీలని చెప్పారు. వాటిని పదో తేదీ లోగా చెల్లించాలని చెబుతున్నారు. లేకపోతే ఈ చార్జీలు ఇంకా పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఇదెక్కడి దారుణమో అర్థం కావడం లేదు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలతో మాపై భారం పడుతుంది.

మునేటిపై వంతెన!

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లోకి సైతం నీరు చేరుతుంది. ఆ సమయంలో కాజ్‌వే ఉన్నా ఉపయోగం ఉండదు. వర్షాకాలంలో తరచూ ఈ పరిస్థితి కొనసాగుతుంది. దీంతో కాజ్‌వే నిర్మాణం కాకుండా వంతెన నిర్మాణం చేపట్టాలన్న అభ్యర్థన తెరపైకి వచ్చింది. ఈ మేరకు మరోమారు సర్వే నిర్వహించిన ఆర్అండ్‌బీ అధికారులు మొత్తం 810 మీటర్ల వంతెన నిర్మాణంతో పాటు రెండు వైపులా అర కిలోమీటరు చొప్పున అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.145 కోట్లతో అంచనాలు రూపొందించారు.ఈ మేరకు ముప్పాళ్ల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు డీపీఆర్‌ను అందించారు. ఈ వంతెన నిర్మాణం వల్ల ప్రజలకు జరిగే మేలును ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తక్షణమే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

స్థానిక నాయకుల్లో స్పష్టత అవసరం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసిన వినతిలో రూ.145 కోట్లతో వంతెన నిర్మాణం డీపీఆర్ నివేదిక ఉన్నట్టు సమాచారం. కానీ నాయకుల ప్రసంగాలు, వినతుల్లో కాజ్‌వే కావాలని మాత్రమే కోరారు. ముఖ్యమంత్రి కూడా రూ.2.20 కోట్లతో కాజ్‌వే నిర్మాణానికి నిధులు ఇస్తానని ప్రకటించారు. వాస్తవానికి కాజ్‌వే నిర్మించాలన్నా ముఖ్యమంత్రి ప్రకటించిన నిధులు సరిపోవు. స్థానిక నాయకులు తమ కోరికను స్పష్టంగా ముఖ్యమంత్రికి చెప్పలేకపోవడం వల్ల ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు తమకు కావల్సింది కాజ్‌వేనా లేక వంతెనా అన్న స్పష్టతకు రావాల్సి ఉంది. అందుకు అయ్యే ఖర్చు అంచనాలను కూడా ముఖ్యమంత్రికి స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ నిర్మాణం చేపట్టడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్న వేళ అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



సెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సెక్షన్ 33 కేవీ మహాత్మాగాంధీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ జమ్మిచెట్టు ఫీడర్, 11కేవీ కళానికేతన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఏఎస్‌రామారావు రోడ్డు, డాక్టర్ కిలారు బుచ్చిబాబు రోడ్డు, శాంతినగర్, జమ్మిచెట్టు సెంటర్, గౌస్ వీధి, ఆదర్శ వీధి, రఘురాం వీధి, వీవీపీ మాల్ రోడ్డు, ఉడ్‌పేట, బాడవపేట, లక్ష్మినగర్, వాటర్ ట్యాంకు రోడ్డు, కార్వే బిల్డింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు.



ధర్నాలో పాల్గొన్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ధర్నాచౌక్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల నెపంతో ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ విమర్శించారు. ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సొంత వాహనం కలిగిన డ్రైవర్లకు రూ. 15 వేలు ఇస్తామని, జగన్ ప్రభుత్వం తెచ్చిన జీవో 21ను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తు చేశారు. ప్రజల్లో తిరుగుబాటు రాకముందే ఎన్నికల హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. సంఘం అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవో 8ను సవరించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.పొలారి, జిల్లా అధ్యక్షుడు మునిశంకర్, యూనియన్ ప్రధానకార్యదర్శి సీహెచ్.పెద్దిరాజు, పలువురు ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోతూరి నాగభూషణం స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌లో గ్రంథాలయ సర్టిఫికెట్ కోర్సు(సీఎల్ఎస్‌సీ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రావి శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్ల నిండి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. జూన్-2025 కి సంబంధించి నిర్వహించే ఈసర్టిఫికెట్ కోర్సు శిక్షణ కాలం ఐదు నెలలని, విద్యాబోధన తెలుగు, ఇంగ్లిష్ మీడియంల్లో జరుగుతుందని తెలిపారు. ఒక్కో మీడియంలో 40 సీట్లు ఉంటాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లను పాటిస్తూ ఇంటర్మీడియట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇది రెగ్యులర్ కోర్సు అని, ఐదు నెలల పాటు ప్రతిరోజు తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తామని వివరించారు. దరఖాస్తులు ఇతర వివరాలు కోసం వెబ్‌సైట్ www.apla.co.in నుంచి సీఎల్ఎస్‌సీ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్ ఫొటోకాపీలను జతపరిచి విజయవాడ సర్వోత్తమ భవనంలోని పోతూరి నాగభూషణం స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ చిరునామాకు రిజిస్టర్ పోస్టు చేయాలని డాక్టర్ రావి శారద తెలిపారు. మరిన్ని వివరాలకు 7995313148, 9290670671 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

సహజయోగ ప్రచార రథయాత్ర బృందం పర్యటన

పటమట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎం పాఠశాల, పటమటలంక, కరకట్ట రోడ్డు, మీసేవా కేంద్రం, ఆటోనగర్ ప్రాంతాల్లో మంగళవారం సహజయోగ ప్రచార రథయాత్ర బృందం పర్యటించింది. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో పరిచయ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సహజయోగ ధ్యాన కేంద్రం మహిళా కో-ఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పటమట బాధ్యురాలు అరుణ, మధుసూదనరావు, పి.విజయ, టి.లక్ష్మిరవీంద్ర పాల్గొన్నారు.



సహజయోగ ధ్యాన ప్రక్రియలు వివరిస్తున్న సుగ్గుల సుధారాణి

చెట్టు కొమ్మలు తొలగింపు..విద్యుత్ పునరుద్ధరణ



చెట్టుకొమ్మలను తొలగిస్తున్న వీఎంసీ, విద్యుత్ శాఖ సిబ్బంది

భారతీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం రాత్రి అకాల వర్షానికి నాల్గో డివిజన్ పరిధిలోని గురునానక్ నగర్, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని పెద్దచెట్టు నేలకొరిగింది. ఈ చెట్టు విద్యుత్ స్తంభాలపై పడటంతో విద్యుత్ అంతరాయ సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానికులు అధికారులు తెలియపరచగా వెంటనే స్పందించిన రింగ్ రోడ్డు సెక్షన్ విద్యుత్ శాఖ అధికారి ఫణీంద్ర, నగర పాలక ఉద్యానవనం అధికారి బాబు సమక్షంలో విద్యుత్ శాఖ సిబ్బంది, వీఎంసీ సిబ్బంది సుమారు మూడు గంటలకుపైగా పని చేసి చెట్టుకొమ్మలను తొలగించారు. అనంతరం విద్యుత్ సరఫరాల పునరుద్ధరించారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న నిందితుడి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు

కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న మినీ వ్యాన్ డ్రైవర్‌ను పటమట పోలీసులు వ్యాన్ సహా పట్టుకొని నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల ప్రకారం పటమట ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో మినీ వ్యాన్‌లో 50 కిలోల పీడీఎస్ రైస్ బ్యాగులు 40, 20 కిలోల బ్యాగులు 10 మొత్తం 2,200 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పటమట స్టేషన్ మహిళా ఎస్ఐ గుళ్లపూడి రేవతి అదుపులోకి తీసుకొని విచారించారు. బియ్యం తరలింపులో గోకా దుర్గాప్రసాద్, పులదాసు సుబ్బారావులు ఉన్నట్లు వ్యాన్ డ్రైవర్ జన్ను రవికుమార్ తెలిపాడు. రవికుమార్‌ను అదుపులోకి తీసుకొన్న పోలీసులు కేసు నమోదుచేశారు. పరారీలో వున్న మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారని ఏఎస్‌వో శ్రీనివాస్ పేర్కొన్నారు.



వ్యాన్ డ్రైవర్ జన్ను రవికుమార్

ఐదు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

అజిత్‌సింగ్‌నగర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం నగరం నుంచి రామవరప్పాడు మీదుగా రేషన్ బియ్యం తరలుతున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం రాత్రి బుడమేరు వంతెన వద్ద వాహనాన్ని ఆపి పరిశీలించగా వాహనంలో రేషన్ బియ్యం ఉండటాన్ని గుర్తించారు. ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీన పరచుకున్న అధికారులు రేషన్ బియ్యాన్ని సమీపంలోని రేషన్ డిపోకు తరలించి డ్రైవర్ సహ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన జి.పవన్ కుమార్ తమ కుటుంబ సభ్యులతో మంగళవారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,01,116 చెక్కు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు దాతకు, కుటుంబీకులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేద పండితులు ఆశీస్సులు, ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.


మట్టి నమూనాల సేకరణపై అవగాహన

పెనమలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మట్టి నమూనాల పరీక్షలతో రైతుల పొలాల్లో పోషక విలువలు తెలుస్తాయని మండల వ్యవసాయశాఖాధికారిణి శైలజ తెలిపారు. పెనమలూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం జరిగిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ పోషకాల స్థాయిలను బట్టి సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు అందజేస్తామని తెలిపారు. మండలంలో పొలాల్లోని 338 శాంపిల్స్ మట్టి నమూనాలను త్వరలో సేకరించడం జరుగుతుందని తెలిపారు.

పుర ప్రజలకు మిత్ర బంధం

●యాప్‌తో సమస్యలు సత్వర పరిష్కారం ●వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26కు ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులకు ఐదు శాతం రాయితీని ఈ పురమిత్ర యాప్ ద్వారా కూడా పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ యాప్‌ను తమ ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. నగరపాలకసంస్థ సంబంధిత ఎలాంటి సమస్యనైనా వెంటనే ఫొటో తీసి అప్లోడ్ చేసిన వెంటనే, దగ్గరలోని సంబంధిత సచివాలయం సిబ్బంది ఆ సమస్యను పరిష్కరిస్తారని తెలియజేశారు. పురమిత్ర యాప్‌లో ప్రజల ఫిర్యాదులకు, సేవలకు, చెల్లింపులకు అవకాశం కల్పించారని తెలిపారు. ఫిర్యాదులలో ప్రజలు పారిశుధ్యం, నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక సంబంధిత, వీధి దీపాలు, ఇంజనీరింగ్ తదితర అంశాలపై ఫిర్యాదులు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో సేవలను పొందవచ్చని, ఖాళీ స్థలాలపై పన్ను విధించడం, నీటి చార్జీలు ట్రేడ్ లైసెన్స్, ప్రకటనల పన్ను, డ్రెయినేజీ కనెక్షన్ తదితర అంశాలు ఈ యాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఇంటి వద్దనే చెత్త సేకరణ, పరిసరాలలో పారిశుధ్యం వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని కూడా తెలియపరిచే అవకాశాన్ని ఈ యాప్‌లో కల్పించారని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ పురమిత్ర యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ ఫోన్ ద్వారా లాగిన్ అయ్యి తమకు ఎటువంటి సమస్యలైనా నేరుగా అధికారులకు తెలియపరచి, సత్వర పరిష్కారాన్ని పొందవచ్చని చంద్రశేఖర్ తెలిపారు.



రేపు కబేళా, చేపల మార్కెట్లు, మాంసం దుకాణాలకు సెలవు

మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 10న నగరంలో ఉన్న కబేళాకు సెలవు ప్రకటించడం జరిగిందని నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి నుంచే కబేళాలో ఎటువంటి జంతువులను వధించుటకు అనుమతి లేదని పేర్కొన్నారు. నగరంలో ఉన్న చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్ని కూడా తెరిచేందుకు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించినా, షాపులు తెరిచి చికెన్, మటన్, చేపలు విక్రయిస్తే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మటన్, చికెన్, చేపలు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తుల అన్ని షాపులు మూసివేయాలని చంద్రశేఖర్ ఆదేశించారు.

పీ4 ఆదర్శంగా తీసుకుని సాయం చేద్దాం

రావి కుటుంబ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ పిలుపు

మొగల్రాజపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన పీ4 విధానం ఆదర్శంగా తీసుకుని మనలో ఉన్నత స్థాయిలో ఉన్న వారు పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందిద్దామని రావి కుటుంబ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. రావి ఇంటిపేరు ఉన్న కుటుంబాల సభ్యుల సమావేశం మొగల్రాజపురం మధుగార్డెన్స్ వద్ద ఉన్న రావి కుటుంబం కార్యాలయంలో మంగళవారం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన ఈ సంఘం రావికుటుంబ సభ్యుల చేరికతో బలోపేతం అవుతోందన్నారు. ఇప్పటి వరకు రూ.90 లక్షలను పిల్లలకు ఫీజుల రూపంలో అందించామన్నారు. దేశ విదేశాల్లో ఉన్న రావి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ సాయం అందిస్తున్నా మన్నారు. ఈ సంస్థ సహకారంతో చదువుకుని స్థిరపడిన వారు కూడా తమ వంతుగా సాయం అందించడం సంతోదాయకమని చెప్పారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పిల్లలకు ఈ ఏడాది సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రావి సత్యనారాయణ, కోశాధికారి రావి రమేష్, కమిటీ సభ్యులు రావి రామ్మోహన్‌రావు, రావి రత్నప్రసాద్ పాల్గొన్నారు.



రావి కుటుంబ సభ్యులు

వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెంపుపై

సీపీఎం నిరసన

గవర్నర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా పెట్రోలు, గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. వంట గ్యాస్ ధర పెంపు, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపును నిరసిస్తూ మంగళవారం బీసెంట్ రోడ్డు మహంతి చేపలమార్కెట్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ధర్నా నిర్వహించారు. గ్యాస్ బండలకు తాళ్లు చుట్టి వాటిని మెడకు చుట్టుకుని మహిళలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ దీపం పథకం కింద గ్యాస్ రేటు తగ్గిస్తామన్న ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరసనలో సీపీఎం నేతలు కె. శ్రీదేవి, సిహెచ్ శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

తెరిచిన పుస్తకంలా కూటమి పాలన

● టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి



మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్. బాలస్వామి, పక్కన కార్పొరేటర్లు

కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తెరిచిన పుస్తకంలా పారదర్శక పాలన సాగిస్తుందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి తెలిపారు. మంగళవారం వీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఎంసీలో పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది మేయర్‌తోపాటు అదే పార్టీకి చెందిన పలువురికి నెలవారీ మామూళ్లు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అధికారులు, సిబ్బంది ఎవరూ మామూళ్లు ఇవ్వవద్దని, ఎవరైనా ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు తమంతట తామే మామూళ్లు ఇస్తున్నారని తెలిస్తే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట్లో చోరీ..బంగారం అపహరణ

చిట్టినగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆ ఇంట్లో మరో పది రోజుల్లో పెళ్లి భాజాలు మోగనున్నాయి. కుటుంబ సభ్యులంతా పెళ్లి పనుల హడావుడిలో ఉన్నారు. దీన్నే అదునుగా మలుచుకున్నారు దొంగలు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడ్డారు. ఈ ఘటన విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన సూరగాని ప్రసాద్ ఆటోడ్రైవర్. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రామకృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రెండో కుమారుడు గుంటూరులోని మిర్చియార్డులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం రామకృష్ణకు వివాహం నిశ్చయమైంది. ఈనెల 18న సుముహూర్తం నిర్ణయించుకున్నారు. పెళ్లి శుభలేఖలు ఇవ్వడానికి ప్రసాద్ భార్యతో కలిసి ఆటోలో సోమవారం మధ్యాహ్నం పెదకాని వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా వెనుక వైపు తలుపు తెరిచి ఉంది. బీరువా అంతా చెల్లాచెదురుగా ఉంది. బీరువాలో ఉండే బంగారు ఆభరణాలు కనించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించిన ప్రసాద్ కొత్తపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ చినకొండలరావు, క్రైమ్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఆభరణాల విలువ రూ.4లక్షలవరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు.



వైభవంగా ప్రారంభమైన హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు

విద్యాధరపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భవానీపురం కృష్ణానది తీరాన శ్రీవైష్ణవ మహాదివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి దూపుగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెనుమాకలోగల శ్రీవైష్ణవ మహాదేవ క్షేత్రంలో 365 రోజులపాటు అఖండ శ్రీహనుమాన్ పారాయణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ముగింపు సందర్భంగా బబ్బూరి గ్రౌండ్స్‌లో ఈనెల 7 నుంచి 13 వరకు హనుమాన్ చాలీసా పారాయణం ఏర్పాటు చేశామన్నారు. శ్రీవారి నమూనా ఆలయాన్ని రూపొందించి తిరుమల తరహాలో సేవలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ గాయకులు ఎం.ఎస్.రామారావు మనవడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ చేస్తామని వివరించారు.



రహదారిపై చెల్లా చెదురుగా పడిన విద్యుత్ తీగలు

గూగుల్ తల్లీ.. ఇరికించేశావ్‌గా..!

● గూగుల్ మ్యాప్ సాయంతో వచ్చి సందులో ఇరుక్కుపోయిన కంటైనర్ లారీ

ఆటోనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్‌ను అనుసరించి వచ్చిన కంటైనర్ లారీ దర్శిపేటలోని రావి చెట్టు సందులో ఇరుక్కుపోయింది. రాంగ్‌రూట్‌గా గుర్తించి రివర్స్ తీసుకుంటుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ తీగలు తెగి మరో రెండు విద్యుత్ స్తంభాలు విరిగాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీ పప్పుల మిల్లు సెంటర్‌లోని ఓ ఇంటి సామగ్రిని ఒడిశా తీసుకెళ్లేందుకు విజయవాడ చేరుకుంది. ఇంటి యాజమాని పెట్టిన లోకేషన్ ఆధారంగా లారీ డ్రైవర్ రామలింగేశ్వరనగర్ స్క్రూబ్రిడ్జ్ నుంచి చిన్నవంతెన మీదుగా దర్శిపేట వైపు చూపించడంతో అటుగా లారీని మళ్లించాడు. రామాలయం సమీపంలోని రావిచెట్టు వద్దకు రాగానే రహదారి చిన్నగా ఉందని గ్రహించి కంటైనర్ లారీని రివర్స్ చేయబోతుండగా విద్యుత్



రివర్స్ చేస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కంటైనర్ లారీ

స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు రహదారిపై పడ్డాయి. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సకాలంలో విద్యుత్‌ను నిలిపేశారు. పటమట పోలీసులు చేరుకుని డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. లారీని తొలగిస్తే స్తంభం పడిపోయి పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి వస్తుందని విద్యుత్ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం కంటైనర్ లారీని తొలగించే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని సమాచారం.

రామలింగా.. దాహం దాహం..!

● శాఖల మధ్య సమన్వయం లోపం వల్లే సమస్య
● మనసు పెడితే 10 రోజుల్లో మంచినీటి సరఫరా
● విజయవాడ తూర్పులో 10వేల మందికి నీళ్లివ్వొచ్చు!
● పైపులైన్ల పనులకు అడ్డంకిగా రుద్రభూమి పరిసర స్థలాలు
● స్థల యజమానులకు ప్రయోజనం కల్పిస్తేనే..! సమస్యకు పరిష్కారం
● కలెక్టర్ రంగంలోకి దిగితే తప్ప పరిష్కారం కాదు!

మనసు పెడితే పది రోజుల్లో అయిపోయే పనిని శాఖల మధ్య సమన్వయం లేక సాగదీస్తున్నారు. రామలింగేశ్వరనగర్‌లో 1500 కేఎల్ ఓవర్ హెడ్ రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి 10వేల కుటుంబాల దాహార్తిని తీర్చే అవకాశమున్నా సమన్వయ లోపంతో తీవ్రజాప్యం జరుగుతోంది. ప్రస్తుతం వేసవిలోకి అడుగు పెట్టడంతో రానున్న రోజుల్లో తలెత్తే దాహార్తిని కేవలం 10 రోజుల్లో తీర్చగలిగే పరిస్థితి ఉన్నా అడుగు ముందుకు పడటం లేదు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రంగంలోకి దిగితే తప్ప శాఖల మధ్య సమన్వయం తీసుకురావటం అసాధ్యం. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

రామలింగేశ్వరనగర్ 1500 కేఎల్ రిజర్వాయర్ పనుల్లో జాప్యం



పటమట తూర్పు ప్రాంతంలోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, భారతీనగర్, జేడీనగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో నివశిస్తున్న 10వేల మందికి పైగా ప్రజలకు సమృద్ధిగా రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రక్షిత మంచినీటి పథకంలో భాగంగా ఇప్పటికే 1500 కేఎల్ రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడే ఫిల్టరైజేషన్ ప్లాంట్ పనులు కూడా జరిగాయి. కేవలం పైప్ లైన్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రామలింగేశ్వరనగర్ ఫిల్టరైజేషన్ ప్లాంట్ నుంచి రక్షణ గోడ వెంబడి ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ వరకు పైపులైన్ల పనులు చేపట్టడానికి టెండర్లు పిలిచారు. పైపులైన్ల పనులు కూడా సగం పూర్తయ్యాయి. ప్రకాశం బ్యారేజీ, రుద్రభూమి వద్ద పనులు చేపట్టాల్సి ఉంది. రుద్రభూమి వెంబడి ప్రైవేటు స్థలాల మీదుగా పైపులైన్ వెళితే సమానంగా ఉంటుంది. భారీ పైపులైన్లు కావటం హై ప్రెజర్‌తో నీరు వచ్చే అవకాశం ఉండటంతో వంకర టింకలుగా ఉంటే ఎప్పుడైనా ప్రమాదమే. లీకేజీ తలెత్తితే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి రుద్రభూమి పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు ఇళ్లస్థలాలు కలిగిన వారిని ఒప్పించ గలిగితే సమస్యకు చెక్ పడుతుంది. ఇక్కడున్న ప్రైవేటు స్థలాలకు చెందిన తాతలు, తండ్రులు వీఎంసీ అవసరాల కోసం స్థలాలు ఇస్తూనే ఉన్నారు. అప్పట్లో ఉచితంగా అప్పగించి రిజిస్ట్రేషన్లు చేసిన ఉదంతాలున్నాయి. కాలక్రమంలో ఈ భూములు ఖరీదైనవిగా మారాయి. గతంలో మాదిరిగా భూములు వదలుకోవటానికి స్థానికులు ఇప్పుడు సిద్ధంగా లేరు. ఎంతో ఖరీదైన భూములను అప్పనంగా తీసుకోవటం కంటే వారికి ప్రయోజనం కల్పించేలా టీడీఆర్ బాండ్లను జారీ చేయటం, ఇతరత్రా ప్రయోజనాలు కల్పిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఇందుకోసం ఇప్పటికే వీఎంసీ అధికారులు సర్వే చేపట్టాలని నిర్ణయించినా రెవెన్యూ, కార్పొరేషన్ విభాగాల మధ్య సమన్వయ లేమితో సర్వేలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ సమస్య తేలితే పైపులైన్లు పూర్తిచేసి కృష్ణా నీటిని రామలింగేశ్వరనగర్ రిజర్వాయర్‌కు తీసుకు వెళ్లటానికి పట్టుమని పది రోజులు కూడా పట్టదు. దీనిపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నేరుగా స్థానికుల వద్దకే వెళ్లి సంప్రదింపులు చేశారు. ఎన్నో దఫాలు తమ వంశీకులు పైసా ఆశించకుండా కార్పొరేషన్‌కు ఉచితంగా స్థలాలు ఇచ్చి సహకరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడుంటున్న వారసులకు తగిన ప్రయోజనం కల్పించాల్సిన అవసరం ఉంది. కలెక్టర్ లక్ష్మీశ దీనిపై దృష్టి సారించి కమిషనర్‌తో చర్చించి రెవెన్యూ శాఖ రంగంలోకి దించి భూముల సర్వే చేయించాల్సిన అవసరం ఉంది. తర్వాత స్థల యజమానులకు వీఎంసీ తరపున బాండ్లు కానీ లేదా రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిహారాన్ని కానీ ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



డ్రోన్ ఫెస్ట్‌లో విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

డ్రోన్ ఫెస్ట్ నియోజకవర్గానికే గర్వకారణం

● ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

పటమట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ఫెస్ట్ తమ నియోజకవర్గంలో జరగడం నియోజకవర్గానికే గర్వకారణమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ డాన్‌బోస్కో స్కూల్లో సోమవారం డ్రోన్ ఫెస్ట్ -2025ను సంయుక్తం గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యవసా య రోబో తనను ఆకట్టుకుందన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ సీ ఎం చంద్రబాబు స్ఫూర్తితో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను పుణికిపుచ్చుకొని పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నేర్పుతున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ ప్రయోగశాలలో త్రీడీ ప్రింటింగ్ ద్వారా తయారు చేసిన డ్రోన్ గురించి తెలుసుకొని దాని సాంకేతికత ను పరిశీలించి ఉపాధ్యాయ బృందంపై ప్రశంసల వర్షం కురిపించా రు. అపుస్మా అధ్యక్షుడు తులసి ప్రసాద్ మాట్లాడుతూ ఈప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమన్నారు. టెకీ బోర్డు చైర్మన్ నల్లమిల్లి వెంకట రెడ్డి మాట్లాడుతూ డాన్‌బోస్కో యాజమాన్యం విద్యతో పా టు విద్యార్థులను నైపుణ్యాలను వెలికితీయడం అభినందనీయమన్నారు.

జగ్గయ్యపేట రైలు పట్టాలపై మృతదేహం

● చెల్లాచెదురైన శరీరభాగాలు

జగ్గయ్య పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉద యం రైల్వే అధికారులు గుర్తించారు. ఉదయాన్నే ట్రాక్‌ను క్లీన్ చేసేందుకు వెళ్లిన సిబ్బంది ట్రాక్‌పై చెల్లా చెదురుగా శరీర భాగాలు పడి ఉండటాన్ని గమనించి స్టేషన్ మాస్టర్‌కు తెలియజేయగా ఆయన విజయవాడ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ చిందరవందరగా ఉన్న శరీర భాగాలను గుర్తించి ఒకచోటకు చేర్చి పోస్టుమార్టమ్ నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. 30-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండవచ్చని కుడిచేతిపై ప్రభాస్, అమ్మ, సత్యంబాబు, ఏసుప్రభు శిలువ గుర్తు ఉంది. భుజంపై ఆంజనేయస్వామి చిత్రం ఉంది. తలపై భాగం, నుదురు ఛిద్రమై ఉండటంతో గుర్తు పట్టే పరిస్థితి లేదు. బ్లూ కలర్ జీన్స్, రెడ్ కలర్ కోట్ మోడల్ టీ షర్టు వేసుకున్నట్టు హెచ్‌సీ చెప్పారు. సోమవారం రాత్రి జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? బలవన్మరణమా? అన్నది అంతుపట్టకుండా ఉంది. సర్కిల్ పరిధిలో మిస్సింగ్ కేసులపై విచారిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే రైల్వే సీఐ జేవీ రమణ (94406 27544), హెచ్‌సీ ప్రసాద్ 94917 36189 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

క్లస్టర్ హెచ్ఎం పోస్టును గ్రేడ్-1గా మార్చాలి

● డెమొక్రటిక్ పీఆర్‌టీయూ



గవర్నర్‌పేట, ఏప్రిల్ 8 (ఆం ధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖనూ తన విద్యా సంస్కరణల్లో భాగం గా ఏర్పాటు చేసిన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టును గ్రేడ్ వన్ ప్రధానోపాధ్యాయుడిగా ప్రమోట్ చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను కోరారు. విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసిన ఆ యన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ ఎన్‌సీటీఈ విధానాల ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చామని, రిజిస్టర్ సంఘాలతో ఈనెలలో సమావేశం నిర్వహిస్తామని, మిగిలిన అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉంచుతామని హామీ ఇచ్చినట్టు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ అధ్యక్షుడు తెలిపారు.

చెరువును స్వాధీనం చేసుకుంటాం

● వీఎంసీ ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్ [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

వన్‌టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 64వ డివిజన్ కుందావారి కండ్రిక వెళ్లే దారిలో ఉత్తరం వైపునున్న 23 ఎకరాల చెరువును అనధికారికంగా చేపల పెంపకం జరుగుతోందని వీఎంసీ ఎస్టేట్ ఇన్‌చార్జి ఆఫీసర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో 'కండ్రికలో చెరువు లీజు దందా' అనే ప్రధాన శీర్షికలో ఈ 23 ఎకరాల చెరువు గురించి వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు కథనంలోని అంశాలను పేర్కొంటూ 23 ఎకరాల చెరువును ఎలాంటి అనుమతులు లేకుండా చేపల పెంపకం జరుగుతుందని స్థానికులే చెరువులో చేపల పెంపకం చేస్తున్నారన్నారు. పూర్తి విచారణ చేసి వీఎంసీ స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సమైక్యతా శంఖారావం సదస్సులో పాల్గొనండి

● సాహితీవేత్తలు, కళాకారులు, సంఘాలకు పిలుపు



సమైక్యతా శంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, కళాకారులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం, మైనారిటీల త్యాగాలు మరుగున పడేశారని, భారత రాజ్యాంగంలో కల్పించబడిన లౌకిక సమానత్వ హక్కుల్ని కాలరాస్తున్నారని సాహితీ స్రవంతి సంస్థ కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. ఈ నెల 13న నగరంలో జరిగే సమైక్యతా శంఖారావం సదస్సులో సాహిత్యవేత్తలు, కళాకారులు భాగస్వామ్యం కావాలని కోరారు. మంగళవారం వివిధ సాహిత్య, కళాకారుల సంఘాల ప్రతినిధులు ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో సమావేశం నిర్వహించారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సదస్సుకు రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్, పౌరహక్కుల నేత హరగోపాల్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ లాంటి ప్రముఖులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధి షఫీ అహ్మద్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, ప్రజానాట్యమండలి కార్యదర్శి అప్పన్న, విరసం నేతలు అరసవల్లి కృష్ణ, మోతుకూరి అరుణ్ కుమార్, జాషువా సంస్థ గుండు నారాయణ, ఎక్సరే సంస్థ ప్రతినిధి బి. ఆంజనేయరాజు, మందరపు హైమావతి పాల్గొన్నారు.

కోర్టు ఫీజు స్టాంపుల కొరత తీర్చండి

● రాష్ట్ర ఐలూ ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు

విజయవాడ లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో కోర్టు ఫీజు స్టాంపుల కొరతను తీర్చాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మంగళవారం న్యాయశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. 3 నెలల నుంచి న్యాయస్థానాలు, రెవెన్యూ కోర్టులు, వివిధ న్యాయ సంబంధిత ట్రిబ్యునల్స్‌లో ఉపయోగించే కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులో లేవన్నారు. దీంతో న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిటీషన్లు వేయాలంటే కోర్టు ఫీజులు తప్పనిసరన్నారు, రూ.1, రూ.2కు కూడా బ్యాంకు చలానా ద్వారా చెల్లించే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో సమయంతోపాటు పరిపాలన విషయాలు కూడా ఆలస్యం అవుతున్నాయన్నారు. జిల్లాల్లో రిజిస్ట్రార్లను కలిస్తే ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని చెబుతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులోకి తెచ్చి సమస్యను పరిష్కరించాలని ఐలూ తరపున విజ్ఞప్తి చేస్తున్నట్టు మాధవరావు పేర్కొన్నారు.

బ్లాకులో నోటరీ స్టాంపులు

● సీనియర్ న్యాయవాది గురునాథం

కోర్టు ఫీజు స్టాంపులతో పాటు నోటరీ స్టాంపులు కూడా దొరకడం లేదని సీనియర్ న్యాయవాది వి.గురునాథం తెలిపారు. నోటరీ చేయాలంటే రూ.5 స్టాంపు లేక బ్లాకులో కొని తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. విజయవాడ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దొరక్కపోవడంతో కంకిపాడు రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి బ్లాక్‌లో రూ.5 స్టాంపును రూ.6, 7 చెల్లించి తెస్తున్నామని నోటరీలు వాపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కోర్టు ఫీజు స్టాంపులు, నోటరీ స్టాంపులు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.

అసత్య ప్రచారాలను ఖండిస్తున్నాం

● ఎండీ కొల్లి ఈశ్వరబాబు ● డీజీపీతోపాటు సీపీ, స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు



చిట్టినగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్లుగా ఉన్నత విలువలతో పాడి రైతుల ఆర్థికాభివృద్ధి, ఉద్యోగులకు సంపూర్ణ భద్రత, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్న సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు అన్నారు. అటువంటి యూనియన్‌పై రెండు రోజులుగా సోషల్ మీడియా గ్రూప్‌లలో ప్రచారమవుతున్న అసత్య వీడియో సందేశాలు, ఒక పత్రికలో ప్రచురించిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంగళవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా గ్రూప్‌లలో ప్రచారమవుతున్న సందేశంలో, ఒక పత్రికలో ప్రచురించిన కథనంలో పేర్కొన్న కొడాలి ప్రమీల అనే మహిళ కృష్ణా మిల్క్ యూనియన్ ఉద్యోగిని కాదన్నారు. ఆమెకు కృష్ణా మిల్క్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమితికి సంబంధం లేని వ్యక్తులు దురుద్దేశం, స్వార్థ ప్రయోజనాల కోసం సమితి చైర్మన్, పాలక వర్గ సభ్యులు, సమితి ఉద్యోగులపై అసత్య ఆరోపణలు చేస్తూ, సమితి ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నములను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ అసత్య ప్రచారాలపై డీజీపీ, సిటీ పోలీస్ కమిషనర్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. త్వరలోనే కుట్ర పూరితమైన అసత్య ప్రచారాలు చేస్తున్నవారిని గుర్తించి చర్యలు తీసుకోమని కోరగా, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని ఈశ్వరబాబు తెలిపారు.

ఘనంగా జల, పంచామృతాభిషేకాలు

వైభవంగా సాగుతున్న వెండి మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ ఉత్సవాలు





ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులకు గ్రామోత్సవం, అభిషేకం చేస్తున్న భక్తులు

జగ్గయ్య పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అద్దాల బజార్‌లో వేంచేసి యున్న కోట మైసమ్మ సహిత వెండి మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు జలాభిషేకం, పంచా మృతాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ ప్రభూత బలి, మూల మంత్ర అనుష్టానములు యాజ్ఞికులు వెంకట రమణశర్మ, కిశోర్ శర్మ, సత్యనారాయణశర్మ బృందం జరిపించింది. 108 కలశాల్లో పంచామృ తాలు, వివిధ నదీ జలాలు తీసుకుని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి మాడవీధుల్లో ప్రతిష్ఠించనున్న శ్రీమహాలక్ష్మీ అమ్మ వారి మూల విరాట్, ఉత్సవమూర్తులు, గణపతి, షిర్డి సాయి విగ్రహాలను రథోత్సవం నిర్వహించారు. అనంతరం జలాభిషేకం చేశారు. మహిళా కమిటీ సభ్యులు ఏకరూప దుస్తుల్లో పాల్గొన్నారు. ట్రస్ట్ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొండూరి నాగేశ్వరరావు, నిర్వహణ కమిటీ చైర్మన్ సూరె రాము, గొల్లపుడి ముక్తేశ్వరరావు, ఆర్. శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 8-59 గంటలకు తాత్వికులు, బలుసుపాడు శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు గెంటేల వెంకటరమణ దంపతుల చేతుల మీదగా యంత్రస్థాపన, పునఃప్రతిష్ఠ జరుగుతుందని, అనంతరం పూర్ణాహుతి, అన్నసమారాధన ఉంటుందని, భక్తులంతా హాజరు కావాలని కమిటీ కోరింది.

సీతారామ రజక వీధిలో..

పట్టణంలో శ్రీ సీతారామ రజకవీధిలో శ్రీ సీతారామలక్ష్మణ, ఆంజనేయ, విజయగణపతి, నాగరాజు స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ బుధవారం జరగనుంది. ఐదేళ్ల క్రితం వేప చెట్టు కింద నిర్మించిన రామ మందిరం, చెట్టు పెరిగిపోయి మందిరాన్ని తోసేయ్యటంతో పునఃప్రతిష్ఠ అవసరమైంది. మంగళవారం ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉత్సవం జరిపించారు. యాజ్ఞికులు అవినాష్, నరసింహం కార్యక్రమాలు జరిపించారు.

పోలీసులకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

● రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి

వన్‌టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పోలీసులపై చేసిన వ్యాఖ్యలు తక్షణం ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడులో వచ్చిన జగన్ రాష్ట్ర పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పోలీసులను బట్టలూడదీసి కొడతానంటూ, యూనిఫాంలు తీయిస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై గురుమూర్తి మండిపడ్డారు. జగన్ తన తీరు మార్చుకోకపోతే వైసీపీకి ప్రజలంతా సమాధి కట్టటం ఖాయమన్నారు. జగన్ నోటికి వచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తే మూల్యం చెల్లించుకోకతప్పదని గురుమూర్తి హెచ్చరించారు.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



శ్రీరామపట్టాభిషేకంలో విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం దొండపాడు గ్రామంలో శ్రీ కోదండరామస్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేకం మంగళవారం ఘనంగా జరిగింది. ఆంజనేయస్వామికి నాగవల్లి దళార్చన అద్భుతంగా జరిగింది. శ్రీ త్రిదండి దేవనాద రామానుజ జీయర్ స్వామి అనుచరులు, పురోహితుల నడుమ మహాసామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నాం అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ, దొండపాడు గ్రామస్థుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో

వెర్టిగో, ఎపిలెప్సీ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సుందరాచారి, కుమారవేలు

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరం ఎంజీ రోడ్డులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో ఆధునిక వెర్టిగో, ఎపిలెప్సీ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్ ఎన్.వి సుందరాచారి, ప్రిన్సిపల్, గుంటూరు మెడికల్ కాలేజ్, రిటైర్డ్ మేనేజర్ జనరల్ డాక్టర్ ఎస్.కుమారవేలు, చీఫ్ న్యూరాలజిస్టు, ఆస్టర్ రమేష్ గ్రూప్ ప్రారంభించారు. ఈసందర్భంగా వెర్టిగో క్లినిక్ వివరాలను డాక్టర్ లక్ష్మి వెల్లడించారు. వెర్టిగో, బ్యాలెన్స్ సమస్యలతో బాధపడే రోగులకు ఆధునిక డయాగ్నోస్టిక్ పరికరాలతో నిపుణుల బృందం సమగ్ర వైద్య సేవలు అందించనుందన్నారు. ఈ క్లినిక్‌లో వీడియో నిస్టాగ్మోగ్రఫీ (వీఎన్‌జీ), ఎలక్ట్రోనిస్టాగ్మోగ్రఫీ (ఈఎన్‌జీ), వెస్టిబులర్ ఎవోక్‌డ్ మయోజెనిక్ పొటెన్షియల్స్ (వీఈఎమ్‌పీ), పోస్టురోగ్రఫీ వంటి ఆధునిక పరికరాలతో సమగ్ర వెస్టిబులర్ ఎవాల్యుయేషన్ థెరపీ (వీఆర్‌పీ), కానలిత్ రీపోజర్ (సీఆర్‌పీ), బ్యాలెన్స్ అండ్ పాల్ ప్రివెన్షన్ వంటి వైద్య సేవలందిస్తామన్నారు. ప్రముఖ ఎపిలెప్టాలజిస్ట్ డాక్టర్ పావులూరి హరిణి మాట్లాడుతూ ఎపిలెప్సీ క్లినిక్‌లో 64 చానెల్ వీడియో ఈఈజీ, సీటీ స్కాన్, ఎమ్మార్ఐ వంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎపిలెప్సీ అనేది మెదడును ప్రభావితం చేసే దీర్ఘకాలిక నాడీ వ్యాధి అన్నారు. ఇది శిశువులను, వృద్ధులను ఎవరినైనా ప్రభావితం చేయగలదన్నారు. మెదడులో విద్యుత్ యాక్టివిటీ గాయాలు, ఇన్ఫెక్షన్స్, జన్యుపరమైన కారణాలు, ట్యూమర్లు వంటి కారణాలతో ఈ వ్యాధి వస్తుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్.వి సుందరాచారి మాట్లాడుతూ ఈవ్యాధుల పట్ల రోగులకు అవగాహన కల్పించాలన్నారు. అపోహలు తొలగించి సరైన వ్యాధి నిర్ధారణతో ఖచ్చితమైన వైద్యాన్ని అందించడం ద్వారా రోగికి ఉపశమనం కలుగుతుందన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ పోతినేని రమేష్‌బాబు, చైర్మన్ ఎం.ఎస్ రామమోహనరావు, డీఎమ్‌డీ డాక్టర్ మమత రాయపాటి, మెడికల్ డైరెక్టర్ నాదెళ్ల గిరిబాబు, యూనిట్ హెడ్ డాక్టర్ కారుపాటి సుదర్శన్, కార్తీక్ చైదరి పాల్గొన్నారు.

9 ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 9 ఏప్రిల్ 2025

వేసవిలో కమ్మని పెరుగు

ఎండాకాలంలో పెరుగు తొందరగా పులుపు ఎక్కుతూ ఉంటుంది. ఈ పుల్లటి పెరుగు ఎవరికీ తినాలనిపించదు. ఇలా కాకుండా కొన్ని చిట్కాలతో వేసవిలో కూడా పెరుగు కమ్మగా ఉండేటట్లు చేయవచ్చు...

- చాలామంది బజారు నుంచి పాలు తెచ్చి వెంటనే ఫ్రిజ్‌లో పెట్టేస్తూ ఉంటారు. తరవాత ఎప్పటికో వాటిని కాచి తోడు పెడతారు. అలా కాకుండా తాజా పాలను తెచ్చిన వెంటనే బాగా మరిగించి తరవాత చల్లార్చి తోడు పెట్టాలి. ఇలా తయారైన పెరుగు ఎక్కువసేపు తాజాగా ఉంటుంది. పాలను తోడు పెట్టడానికి పుల్లటి పెరుగు కాకుండా కమ్మటి పెరుగునే వాడాలి.
- పాలు బాగా వేడిగా ఉన్నప్పుడు తోడు పెట్టకూడదు. అలాగే పాలు పూర్తిగా చల్లారినా కూడా పెరుగు సరిగా తోడు కోదు. గోరువెచ్చని పాలలో కొద్దిగా పెరుగు వేసి నెమ్మదిగా కలపాలి.
- మట్టి పాత్ర లేదా సిరామిక్ పాత్రలో పాలు పోసి తోడుపెడితే పెరుగు గట్టిగా కమ్మగా తయారవుతుంది.
- పాలను తోడు పెట్టే ముందు అందులో ఒక చెంచా పంచదార కలిపితే పెరుగు త్వరగా పులుపు ఎక్కకుండా ఉంటుంది.
- ఒక చిన్న గిన్నెలో రెండు చెంచాల పాలు తీసుకొని అందులో అర చెంచా కమ్మని పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తోడు పెట్టాలనుకుంటున్న పాలలో వేసి కలిపి మూతపెట్టాలి. ఇలా చేయడం వల్ల కమ్మని గడ్డ పెరుగు తయారవుతుంది. ఇది త్వరగా పులుపు ఎక్కదు.
- ఒక వెడల్పాటి గిన్నెలో సగం వరకు నీళ్లు పోయాలి. ఇందులో పాలు తోడు పెట్టిన గిన్నెను ఉంచితే ఆరు గంటల్లో కమ్మని పెరుగు తయారవుతుంది. ఎండాకాలంలో ఈ పద్ధతిని పాటిస్తే పెరుగు ఎక్కువసేపు తాజాగా ఉంటుంది.
- పాలను రాత్రిపూట తోడుపెడితే తెల్లారేసరికి తోడుకుని పెరుగు తయారవుతుంది. దీన్ని వెంటనే ఫ్రిజ్‌లో పెడితే రోజంతా తాజాగా ఉంటుంది.



విభిన్నం

హెల్మెట్ పెట్టుకోకపోతే బండి ముందుకు కదలనంటుంది. మద్యం సేవిస్తే వాహనంలోని సెన్సర్ పసిగట్టేస్తుంది. పొడి చెత్త డబ్బాలో తడి చెత్త వేస్తే అప్రమత్తం చేస్తుంది. ఇవి ఏ శాస్త్రవేత్తలో కనుగొన్నవి కావు... బడా సంస్థల ఆర్ అండ్ డీ విభాగం సృష్టి అంతకన్నా కాదు... ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి అద్భుత ఆవిష్కరణలు. ఆ టీచరమ్మ పేరు.. విజయభార్గవి. శ్రీసత్యసాయి జిల్లా రేకులకుంట ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్న ఆమె తన ఆవిష్కరణల గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.



ఈ భార్గవి స్మార్ట్ టీచర్

"సరిగ్గా ఐదేళ్ల కిందట... మావారు జయప్రకాశ్ బైక్ మీద ప్రయాణిస్తుండగా కింద పడ్డారు. బాగా గాయాలయ్యాయి. ఆ సమయంలో ఆయన హెల్మెట్ ధరించలేదు. ఇది నన్ను ఎంతో ఆందోళనకు గురి చేసింది. ఆలోచనల్లోకి నెట్టింది. రోజూ ఎక్కడో ఒకచోట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా హెల్మెట్ పెట్టుకోకపోవడంవల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. మావారి ఘటన తరువాత ఇలాంటివెన్నో ఉదంతాలు ఒక్కసారి నా కళ్ల ముందు తిరిగాయి. అలాగే మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి గురైతే జరిగే నష్టం అంతాఇంతా కాదు. వీటివల్ల వాహనం నడిపేవారికే కాదు... ఎదుటివారికి కూడా ప్రమాదమే. మరి దీనికి పరిష్కారం ఏంటి? ఆలోచిస్తుంటే తట్టిందే స్మార్ట్ హెల్మెట్. కొద్ది రోజుల్లోనే నా ఆలోచనకు రూపం ఇచ్చాను. అది నాలో ఎనలేని స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపింది. ఆ తరువాత వీధుల్లో చెత్త పేరుకుపోకుండా చూసేలా స్మార్ట్ డస్ట్‌బిన్ ఒకటి తయారు చేశాను. దీనికి కూడా మంచి స్పందన వచ్చింది.

> **సహకారం అందించాలి...**
>
> 
>
> హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. దీనివల్ల కుటుంబాలు దిక్కులేనివైపోతాయి. ఎక్కడబడితే అక్కడ చెత్తవేస్తే పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతాయి. ప్రజారోగ్యం దెబ్బతింటుంది. ఇలాంటి సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొనే నేను ఆవిష్కరణల దిశగా అడుగులు వేశాను. దీనికి ప్రభుత్వాల సహకారం తప్పనిసరి. ముఖ్యంగా స్మార్ట్ హెల్మెట్, ఆధార్ ఆధారిత డస్ట్‌బిన్‌కు పేటెంట్ రైట్స్ ఇచ్చి, సమాజానికి ఉపయోగపడేలా వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

పాఠాలు చెబుతూనే...

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో మా నివాసం. మావారు కూడా ఉపాధ్యాయుడే. ప్రస్తుతం నేను మడకశిర మండలం రేకులకుంట ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నాను. ఒక పక్క పిల్లలకు పాఠాలు చెబుతూనే మరోవైపు వినూత్న ప్రయోగాలు చేస్తుంటాను. నిత్యవిద్యార్థినిలా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. సాంకేతిక పరిజ్ఞానంతో మన రోజువారీ జీవితానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలనేది నా తపన. దాని కోసం వివిధ రకాల పరికరాలను రూపొందించి, పలు సైన్స్ ఫెయిర్స్‌లో ప్రదర్శిస్తుంటాను. అలా నా ఆవిష్కరణలకు బహుమతులు కూడా అందుకున్నాను. బోధనతో పాటు ప్రయోగాలు కూడా నా దైనందిన జీవితంలో ఒక భాగం అయ్యాయి.

హెల్మెట్ ధరిస్తే...

సాధారణ హెల్మెట్‌కు కొన్ని పరికరాలు అమర్చి స్మార్ట్ హెల్మెట్ తయారు చేశాను. తొలుత ప్రత్యేక సెన్సర్లతో ఓ డివైజ్‌ను రూపొందించాను. దాన్ని హెల్మెట్‌కు అమర్చాను. దీనిని మోటార్ సైకిల్ స్టార్టర్‌కు అనుసంధానం చేశాను. దీనివల్ల హెల్మెట్ ధరిస్తేనే వాహనం స్టార్ట్ అవుతుంది. ఇక హెల్మెట్‌లో ఉండే సెన్సర్... మద్యం వాసనను కూడా పసిగడుతుంది. మద్యం సేవించి వాహనం నడపాలని ప్రయత్నిస్తే అది ఆగిపోతుంది. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తీసినా వాహనం ఆగిపోతుంది. స్మార్ట్ హెల్మెట్ ధరించి వాహనం నడిపే సమయంలో ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులతో సహా ఎంపిక చేసుకున్న మొబైల్ నంబర్లకు వెంటనే మెసేజ్ వెళుతుంది. ఏ ప్రాంతంలో, ఏ సమయంలో ప్రమాదం జరిగిందో కూడా సమాచారం చేరవేస్తుంది. జీపీఆర్ఎస్ ద్వారా 108 అంబులెన్స్‌కూ సమాచారం పంపుతుంది. కేవలం రెండు వేల రూపాయల ఖర్చుతో ఈ హెల్మెట్‌ను తయారు చేశాను.

చెత్తకు ఆధార్ స్కాన్...

రోడ్ల పక్కన ఉండే డస్ట్‌బిన్‌లను కూడా 'స్మార్ట్'గా మార్చే ప్రయత్నం చేశాను. వీధుల్లో కుటుంబ యజమానుల ఆధార్ స్కాన్ అయ్యేలా డస్ట్‌బిన్‌లను రూపొందించాను. ఎవరైనా చెత్తను తీసుకెళ్లి డస్ట్‌బిన్‌లో వేస్తే, వెంటనే ఆ మెసేజ్ మునిసిపాలిటీ లేదా పంచాయతీకి చేరుతుంది. పొడి చెత్త స్థానంలో తడిచెత్త వేస్తే వెంటనే అలర్ట్ మెసేజ్ కూడా వస్తుంది. డస్ట్‌బిన్ నిండినా, చెత్త కుళ్లిపోయినా సంబంధిత మునిసిపాలిటీ లేదా పంచాయతీకి సమాచారం చేరుతుంది. దీంతో పాటు ఎవరెవరు ఎన్నిసార్లు కుండీలో చెత్త వేశారనేది కూడా తెలుస్తుంది. ఈ పరికరం ద్వారా చెత్తను డస్ట్‌బిన్‌లో వేయనివారిని కూడా గుర్తించవచ్చు. తద్వారా వీధుల్లో చెత్త పడేయకుండా కట్టడి చేయవచ్చు.

పురస్కారాలు... ప్రశంసలు...

నా ఆవిష్కరణలకు మంచి గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉంది. మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ నుంచి అవార్డు అందుకున్నాను. గతంలో హైదరాబాద్‌కు చెందిన 'విజ్ఞానదర్శిని' సంస్థ ఉమెన్స్ ఫెస్టివల్ పురస్కారం ఇచ్చింది. 2023లో స్మార్ట్ హెల్మెట్ ఆలోచనకు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయి బహుమతి పొందాను. పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, కాలుష్య నియంత్రణ, అనారోగ్య సమస్యలకు పరిష్కారం, పారిశ్రామిక వ్యర్థాలు తగ్గించడం, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆహార భద్రత, విద్యుత్ తదితర వాటిలో నూతన ఆవిష్కరణలు చేసినందుకు పలు అవార్డులు, ప్రశంసలు అందుకున్నాను. నిత్య జీవితంలో జన జీవితానికి ఉపయోగపడే మరిన్ని పరికరాలు రూపొందించాలనేది నా ఆకాంక్ష. దాని కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటాను."

• బాలకృష్ణ, హిందూపురం

ఇంట్లో దుమ్ము చేరితే...

ఇంట్లో ఉపకరణాల మీద, గది మూలల్లో దుమ్ము చేరుతూ ఉంటుంది. ఇలా ఇంట్లో దుమ్ము పేరుకోకుండా ఉండేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాల గురించి తెలుసుకుందాం.



- సాధారణంగా ఇంట్లో చీపురుతో ఊడుస్తూ ఉంటాం. దీనివల్ల కొన్ని దుమ్ము కణాలు పైకి లేచి పక్కనే ఉన్న వస్తువులపై పడుతుంటాయి. నేలమీద కూడా కొన్ని కణాలు అలాగే మిగిలి ఉంటాయి. చీపురుతో కాకుండా వ్యాక్యూమ్ క్లీనర్‌తో ఇంటిని శుభ్రం చేస్తే దుమ్ము పూర్తిగా తొలగిపోతుంది. అలాగే వారానికి ఒకసారి ఇంటిని తడిగుడ్డతో తుడవాలి.
- చెప్పులు, షూస్ లాంటివి ఎక్కువగా దుమ్మును ఇంట్లోకి తీసుకొస్తాయి. వీటిని ఇంటి బయటే వదలడం వల్ల సగం సమస్య తీరుతుంది. మూడు రోజులకు ఒకసారి డోర్‌మ్యాట్, కార్పెట్ లాంటివాటిని వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి.
- కొంతమంది ఇంట్లో కూడా చెప్పులు వేసుకుని నడుస్తూ ఉంటారు. ఈ చెప్పులను బయటికి వేసుకెళ్లకుండా ఇంట్లోనే వాడుకుంటూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి.
- ఇంట్లో దుప్పట్లు, సోఫా కవర్లు, కర్టెన్ల మీద ఎక్కువగా దుమ్ము పడుతూ ఉంటుంది. వీటిని తీసి గట్టిగా దులిపి మళ్లీ వేస్తూ ఉంటారు. ఇలా దులిపినప్పుడు దుమ్ము కణాలు లేచి ఇల్లంతా వ్యాపిస్తాయి. కాబట్టి వీటిని దులపకుండా వారానికి ఒకసారి సబ్బు నీళ్లలో నానబెట్టి ఉతకడం మంచిది.
- ఇంటి తలుపులు, వెంటిలేటర్లు, కిటికీల మూలలు, వాటి ఊచల మీద కూడా విపరీతంగా దుమ్ము నిలుస్తూ ఉంటుంది. డెటాల్ లేదా సబ్బు నీళ్లలో ముంచిన గుడ్డతో వీటిని తరచూ తుడుస్తుంటే ఆ ప్రదేశాల్లో దుమ్ము పేరుకోదు.
- ఇంట్లో ఉండే అరల్లో ఎక్కువగా దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. పదిహేను రోజులకు ఓసారి క్లీనింగ్ డస్టర్ సహాయంతో వీటిని శుభ్రం చేస్తే సరిపోతుంది.

ఫ్యాషన్

గులాబీ రంగులో మెరిసే 'రోజ్ గోల్డ్' ఆభరణాలు సర్వత్రా ఆదరణ పొందుతున్నాయి. నేటి యువతులను విపరీతంగా ఆకట్టుకుంటూ తాజా ఫ్యాషన్‌లో భాగంగా మారిన రోజ్ గోల్డ్ ఆభరణాలను పరిశీలిద్దామా?



రోజ్ గోల్డ్ అంటే?

కలిపే మిశ్రమ లోహాల పరిమాణాన్ని బట్టి బంగారం రంగు మారుతూ ఉంటుంది. రోజ్ గోల్డ్ కోసం బంగారంలో ఎక్కువ శాతం రాగి లోహాన్నీ, కొద్ది పరిమాణంలో వెండినీ కలుపుతారు. ఎంత ఎక్కువ రాగి కలిపితే బంగారం అంత ఎరుపు రంగు సంతరించుకుంటుంది. కాబట్టి బంగారం గులాబీ వర్ణం సంతరించుకునేంత మేరకు రాగిని కలిపి, రోజ్ గోల్డ్ తయారు చేస్తారు. 18 క్యారెట్ల బంగారంలో 75% బంగారం, 21% రాగి, 4% వెండి ఉంటుంది.

గులాబీ మెరుపుల్లో...



- రోజ్ గోల్డ్ స్టడ్ ఇయర్ రింగ్స్‌ను భారీ సైజు బంగారు జూకాలతో కలిపి ధరించవచ్చు.
- రెండు బంగారు గాజులు లేదా వెండి గాజుల మధ్య రోజ్ గోల్డ్‌తో తయారైన గాజు ఇట్టే ఇమిడిపోతుంది. స్టైల్‌తోపాటు, కొత్త పోకడకు నాంది అవుతుంది



ఆభరణాలు ఇలా...

ఆభరణాల్లో రోజ్ గోల్డ్‌కు చోటు కల్పించాలంటే ప్రస్తుతం మన దగ్గరున్న వెండి, బంగారు ఆభరణాలతో మ్యాచ్ అయ్యే రోజ్ గోల్డ్ ఆభరణాలు కొనాలి. మిగతా లోహాలతో తయారైన ఆభరణాలతో కలిసిపోవటం రోజ్ గోల్డ్‌కి ఉన్న ప్రత్యేకత. అయితే ఎలాంటి ఆభరణాలతో మ్యాచ్ చేయాలో అవగాహన లేదా? అయితే...ఈ చిట్కాలు పాటించండి.



- వైట్ గోల్డ్ అయిన ప్లాటినంకు కూడా ఆదరణ ఎక్కువే! కాబట్టి రోజ్ గోల్డ్, ప్లాటినం కలిపి లేయర్డ్ జ్యువెలరీగా వాడొచ్చు.
- బంగారంతో పోలిస్తే రోజ్ గోల్డ్ ఖరీదు తక్కువ కాబట్టి భారీ ఆభరణాలు ధరించాల్సిన సందర్భంలో రోజ్ జ్యువెలరీని ఎంచుకోవచ్చు.
- చెవికి పెద్ద పెద్ద రింగులు లేటెస్ట్ ఫ్యాషన్. రోజ్ గోల్డ్‌తో తయారైన సాదా రింగులు కాకుండా, జడలా అల్లినట్టుండే బ్రెయిడెడ్ రింగ్స్ ఎంచుకుంటే వినూత్నంగా కనిపిస్తారు.
- నగలే కాదు రోజ్ గోల్డ్‌తో తయారైన చేతి గడియారాలూ దొరుకుతాయి. వాచీ ధరించే అలవాటున్న వాళ్లు రోజ్ గోల్డ్ గడియారం కొనుక్కుంటే వేడుకల్లో దాన్నొక ఆభరణంగా ధరించవచ్చు.



మామిడి- బెల్లం షర్బత్

వేసవి వచ్చిందంటే మామిడి కాయలు విరివిగా దొరుకుతాయి. వీటితో షర్బత్ చేసుకుంటే దాహం తీరటంతో పాటుగా తాగటానికి రుచిగా కూడా ఉంటుంది. అయితే చాలా మంది ఈ షర్బత్‌లో పంచదార వేస్తారు. దీని వల్ల బ్లడ్ షుగర్ విలువలు పెరుగుతాయి. అలా పెరగకుండా పంచదార వేయని షర్బత్ ఎలా చేయాలో తెలుసుకుందాం.

తయారీ విధానం

- ప్రెషర్ కుక్కర్‌లో మూడు పుల్లటి మామిడి కాయలను వేసి ఉడకపెట్టండి.
- మామిడికాయలు ఉడికిన తర్వాత తొక్క తీసి గుజ్జును ఒక గిన్నెలోకి తీసుకోండి.
- ఈ గుజ్జులో అర గ్లాసు బెల్లం పొడి, రుచికి తగినట్లుగా నల్ల ఉప్పు, కొద్దిగా జీలకర్ర పొడి వేయండి.
- ఈ మిశ్రమంలో తగినన్ని ఐసు ముక్కలు, మూడు చిన్న గ్లాసుల నీళ్లు పోసి మిక్సీలో బాగా తిప్పండి. షర్బత్ రెడీ.



అభిరుచి

పెళ్లయ్యాక అమ్మ చేతి రుచులకు దూరమైన ఓ అమ్మాయి... తల్లి సూచనలతో సంప్రదాయ వంటకాల తయారీలో నిష్ణాతురాలయ్యారు. ఫుడ్ కంటెంట్ క్రియేటర్‌గా సోషల్ మీడియాలో దూసుకెళ్తున్నారు. ఏడాదిన్నర కాలంలో మూడున్నర లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను సంపాదించుకున్న అర్పిత దాస్ ప్రయాణం గురించి, ప్రయోగాల గురించి ఆమె మాటల్లోనే...



హలో అమ్మా!

"కొత్త కాపురం మొదలుపెట్టాక... ప్రతి అమ్మాయి మిస్ అయ్యే వాటిలో ప్రధానమైనది... అమ్మ చేతి వంట. ఇల్లాలుగా వంటిల్లు పూర్తిగా తన చేతుల్లోకి వచ్చేస్తుంది. వంటలో ఎంతో కొంత అనుభవం ఉన్నా... 'ఏది చెయ్యాలి? ఎలా చెయ్యాలి?' అనేది ఎప్పుడూ ప్రశ్నే. అందుకే 'హలో అమ్మా!' అంటూ తల్లికి కాల్ చేసి, ఇంటి వంటకాల తయారీ గురించి సందేహాలను అడగడం దాదాపు రోజూ జరుగుతూనే ఉంటుంది. అందుకు నేను మినహాయింపు కాదు.

అందుకే ధైర్యం చేశాను...

మాది పశ్చిమబెంగాల్‌లోని హౌరాకు చెందిన జమీందారీ కుటుంబం. సంస్కృతి, సంప్రదాయాల మధ్య పెరిగాను. సృజనాత్మకంగా ఏదో చెయ్యాలనే తాపత్రయం నాకు చిన్నప్పటి నుంచీ ఉండేది. 'బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్' (బీఎఫ్ఎ) పూర్తి చేశాను. పెయింటింగ్స్ వేసేదాన్ని, డిజైనింగ్ చేసేదాన్ని, కథలు రాసేదాన్ని. గొప్ప జీవిత లక్ష్యాలేవీ లేకుండా... కుటుంబ సభ్యులతో, స్నేహితులతో రోజుల్ని సరదాగా గడిపేసేదాన్ని. అలాంటి నేను.... సింగపూర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న సౌమిక్‌తో పెళ్ళయ్యాక... పూర్తిగా భిన్నమైన ప్రపంచంలోకి అడుగు పెట్టాను. మిగిలినవన్నీ బాగానే ఉన్నా... నా పుట్టింటి రుచులకు దూరమయ్యాననే అసంతృప్తి ఉండేది. హౌరాలోని మా ఇంట్లో ఎంతోమంది పనివారు ఉండేవారు. కానీ వంట మాత్రం అమ్మే చేసేది. అమ్మ ఏది చేసినా బ్రహ్మాండంగా ఉండేది. ఏది అడిగినా విసుక్కోకుండా చేసి పెట్టేది. సింగపూర్‌లో అది ఎలా సాధ్యమవుతుంది? రోజూ అమ్మకు వీడియో కాల్ చేసి, ఆమె చెప్పిన వంట పద్ధతులు అనుసరించేదాన్ని. ఆ వంటకాలు నా భర్తకు కూడా బాగా నచ్చాయి. తీరిక సమయాల్లో కొన్ని యూట్యూబ్ వీడియోలు చూస్తున్నప్పుడు... సంప్రదాయికమైన బెంగాలీ వంటకాల గురించి సాధికారికంగా వివరించేవి పెద్దగా కనిపించలేదు. అమ్మ చెప్పే రెసిపీలతో వీడియోలు చేయాలనిపించింది. అంతకుముందు నా పర్యాటక అనుభవాలను, పెయింటింగ్స్ ను సోషల్ మీడియాలో పంచుకున్నాను. వీడియో ఎడిటింగ్ తెలుసు. కాబట్టి ధైర్యం చేశాను. అందరూ చేసుకోగలిగే పద్ధతిలో ఫిష్ ఫ్రై చేసి... ఫేస్‌బుక్‌లో ఉంచాను. నా కుటుంబం, పరిచయస్తులు మాత్రమే దాన్ని చూస్తారనుకున్నాను. కానీ రాత్రికి రాత్రి అది వైరల్ అయింది. కొన్ని గంటల్లోనే లక్షల్లో వ్యూస్ వచ్చాయి. ఇది నేను ఊహించలేదు. అప్పుడే ఫుడ్ కంటెంట్ క్రియేటర్‌గా మారాలనే ఆలోచన వచ్చింది. 'ఇక తగ్గేదిలే' అనుకున్నా.

మొక్కుబడిగా కాకుండా...

అప్పటి నుంచి సంప్రదాయికమైన బెంగాలీ వంటకాలు, ఇంట్లో సులువుగా వండుకోగలిగే పదార్థాలు... ఇంకా చాలా వాటిని తయారు చేసి 'వీకెండ్ ఫ్లేవర్స్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం ప్రారంభించాను. ఒక్కొక్క పోస్ట్ పెడుతూ ఉంటే... వాటికి వీక్షకుల నుంచి వచ్చిన స్పందన నాలో సంతోషంతో పాటు ఉద్వేగాన్ని కూడా కలిగించింది. 'ఎప్పుడో చిన్నప్పుడు తిన్నాం. అవి ఎలా చెయ్యాలో మీరు చూపిస్తూ ఉంటే... వెంటనే ట్రై చేసేద్దామనిపిస్తోంది' అని కొందరు... 'ఆ వంటకం ఎలా చెయ్యాలో చెప్తారా' అని మరి కొందరు, 'పేరు గుర్తు లేదు కానీ... ఈ దినుసులతో చేస్తారని మాత్రం తెలుసు. అదేమిటో చెప్తారా, ప్లీజ్?' అని ఇంకొందరు చెబుతూ ఉంటే... రెట్టించిన ఉత్సాహంతో, అమ్మ మార్గదర్శకత్వంతో వరుసగా వీడియోలు చేశాను. కనీసం వారానికి ఒక వీడియో పోస్ట్ చెయ్యాలనేది నియమంగా పెట్టుకున్నాను. సంప్రదాయ వంటకాలకు ఆధునికమైన మెరుగులు దిద్దడం, ఇతర ప్రాంతాలకు చెందిన వంటకాలను బెంగాలీ పద్ధతిలో చేయడం, పిజ్జాలు, బర్గర్స్ లాంటి వాటిలో పాత రుచుల్ని మేళవించడం... ఇలా పలు ప్రయోగాలు చేస్తున్నాను. అమ్మ చేసిన వంటల తయారీ గురించి ఆమెను అడుగుతున్నట్టు... నా వీడియోలన్నీ 'హలో అమ్మా!' అని ప్రారంభమవుతాయి. ఇది వీక్షకులందరికీ నచ్చింది. ఏదో మొక్కుబడిగా చెబుతున్నట్టు కాకుండా... చూస్తున్నవారికి ఆకట్టుకొనేలా మాట్లాడడానికి ప్రయత్నిస్తాను. రచయిత్రిగా నాకున్న కాస్త అనుభవం దీనికి పనికొస్తోంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో నాకు మూడున్నర లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఎక్కడికైనా వెళ్ళినప్పుడు నన్ను జనం గుర్తుపట్టి పలకరిస్తున్నారు. నేను ఎన్నడూ ఊహించని ఈ ప్రయాణం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఆహారం కేవలం కడుపు నింపుకోవడానికి మాత్రమే కాదు. దాని వెనుక ఎన్నో జ్ఞాపకాలు ఉంటాయి. భావోద్వేగాలుంటాయి. అది మనుషుల్ని దగ్గర చేస్తుంది. నా కంటెంట్‌ను చూసేవారు తమ ఇంట్లో తిన్న పాత రుచుల్ని గుర్తు తెచ్చుకుంటే... నా ప్రయత్నం సఫలమైనట్టే."





జాతీయ జట్టులోకి శ్రీచరణి

ముక్కోణపు సిరీస్‌కు ఎంపికైన తెలుగమ్మాయి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ యువ క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణి జాతీయ మహిళా జట్టుకు ఎంపికైంది. ఈనెలాఖరులో శ్రీలంక ఆతిథ్యమిస్తున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల భారత మహిళల జట్టును మంగళవారం ప్రకటించారు. ఇందులో ఎడమచేతి వాటం స్పిన్నరైన 20 ఏళ్ల శ్రీచరణి చోటు దక్కించుకుంది. కడప జిల్లాకు చెందిన శ్రీచరణి.. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడింది. శ్రీచరణితో పాటు మరో ఇద్దరు యువ బౌలర్లు కశ్వీ గౌతమ్, శుచి ఉపాధ్యాయ్ కూడా ఈ సిరీస్‌తో అరంగేట్రం చేయనున్నారు. తెలంగాణకు చెందిన అరుంధతి రెడ్డి జట్టులో చోటు నిలబెట్టుకుంది. ఇక, ఐర్లాండ్‌తో సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ ముక్కోణపు సిరీస్‌తో తిరిగి జట్టులోకొచ్చింది. ఈనెల 27 నుంచి కొలంబోలో జరిగే ఈ సిరీస్‌లో శ్రీలంక, భారత్, దక్షిణాఫ్రికా పోటీపడుతున్నాయి.

జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తిక భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, తేజల్ హసబ్నిస్, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్.



భర్తతో మేరీ

విడాకుల బాటలో మేరీ కోమ్!

వ్యాపార భాగస్వామితో డేటింగ్?

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ తమ 20 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలుకనున్నట్టు సమాచారం. భర్త కరుంగ్ ఓంకోలెర్‌తో తను విడిపోయేందుకు సిద్ధమైనట్టు ఆమె సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతానికి ఇంకా విడాకుల కోసం దరఖాస్తు చేసుకోకపోయినా, ఇద్దరూ విడిగానే జీవిస్తున్నారు. కరుంగ్ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. ప్రచారం కోసం రూ. 2-3 కోట్ల వరకు ఖర్చు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో కాపురంలో కలతలు ఏర్పడడంతో తమ నలుగురు పిల్లలతో మేరీ ఫరీదాబాద్‌కు మకాం మార్చింది. కరుంగ్ మాత్రం ఢిల్లీలోనే ఉంటున్నాడు.

ఓ బాక్సర్ భర్తతో..: ఓ మహిళా బాక్సర్ భర్తను వ్యాపార భాగస్వామిగా పేర్కొంటూ మేరీ కోమ్ ఇన్‌స్టా ఖాతాలో పలు ఫొటోలు, వీడియోలు పోస్టుచేసింది. ఆ వ్యక్తి.. మేరీకోమ్ బాక్సింగ్ ఫౌండేషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. మేరీ అతనితో కలిసి మహాకుంభ్‌కు కూడా వెళ్లి ఉత్సవాల్లో పాల్గొంది.

ఐపీఎల్‌లో నేడు | వేదిక అహ్మదాబాద్
గుజరాత్ x రాజస్థాన్ | రా.7.30

నాకౌట్‌కు అర్జున్

పారిస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్ టూర్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి నాకౌట్‌కు చేరుకొన్నాడు. మంగళవారం జరిగిన ఐదు రౌండ్లలో రెండు గేమ్‌లు గెలిచిన అర్జున్.. మరో రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. 9వ రౌండ్‌లో ఇయాన్ నెపోమ్నియాచి చేతిలో మాత్రమే అర్జున్ ఓడాడు. దీంతో మొత్తం 6.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచిన అర్జున్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. టాప్-8లో నిలిచిన వారికే క్వార్టర్స్ ఆడే అవకాశం ఉంది. 9వ స్థానంలో నిలిచిన ప్రజ్ఞానంద (4 పాయింట్లు), 11వ స్థానంలో నిలిచిన వరల్డ్ చాంపియన్ గుకేష్ (3.5 పాయింట్లు) ఎలిమినేట్ అయ్యారు.

సురుచికి స్వర్ణం

షూటింగ్ వరల్డ్ కప్



బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో టీనేజ్ షూటర్ సురుచి ఇందర్ సింగ్ స్వర్ణ పతకం సాధించింది. 18 ఏళ్ల సురుచి ఫైనల్లో 244.6 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. చైనాకు చెందిన కియాన్ వీ, జియాంగ్ రాన్‌గ్జిన్ వరుసగా రజత కాంస్యాలకు పరిమితమయ్యారు.

ధ్రువ్ జోడీ బోణీ

ఆసియా బ్యాడ్మింటన్

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జంటలు ధ్రువ్ కపిల/తనీషా క్యాస్ట్రో, అసిత్ సూర్య/అమృత మిక్స్‌డ్ డబుల్స్‌లో శుభారంభం చేశా రు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కపిల జోడీ 15-21, 21-12, 21-11తో మలేసియా జంట హో పాంగ్/సూయిన్‌పై, సూర్య/అమృత 21-9, 21-11తో శ్రీలంక జోడీ తులిత్/పంచలిపై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరారు.

కంకషన్‌తో కెరీర్ ముగింపు



విల్ పకోవ్‌స్కీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెటర్ 27 ఏళ్ల విల్ పకోవ్‌స్కీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన కెరీర్‌లో ఒకే టెస్టు ఆడిన ఈ ఆటగాడి నిర్ణయం వెనుక కంకషన్ తదనంతర పరిణామాలే కారణం కావడం గమనార్హం. గతేడాది మార్చిలో జరిగిన షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో పేసర్ మెరిడిత్ షార్ట్ పిచ్ బాల్ హెల్మెట్‌కు బలంగా తాకింది. ఆ వెంటనే తను మైదానం వీడాడు. అతని కెరీర్‌లో మొత్తంగా 12 సార్లు కంకషన్ గాయాలయ్యాయి. స్వతంత్ర మెడికల్ ప్యానెల్ సూచన ప్రకారం పకోవ్‌స్కీ ఆట నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పటికే దెబ్బతిన్న తన మెదడును మరింత గాయాలపాలు చేయదల్చుకోలేదని పకోవ్‌స్కీ అన్నాడు.

ప్రియాన్ష్ ఫటాఫట్

39 బంతుల్లోనే మెరుపు శతకం

పంజాబ్‌దే విజయం
చెన్నైకి వరుసగా నాలుగో ఓటమి



ప్రియాన్ష్ ఆర్య (103)

చండీగఢ్: యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 103) మెరుపు శతకంతో విరుచుకుపడిన వేళ.. పంజాబ్ కింగ్స్ అదరగొట్టింది. ఇక సీజన్‌లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్‌లో ఆకట్టుకున్నా.. ఫినిషింగ్‌లో దూకుడు కనబర్చలేకపోయింది. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 18 రన్స్ తేడాతో పంజాబ్ నెగ్గింది. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. టాప్-6లో ఐదుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే నిరాశపర్చినా.. ప్రియాన్ష్ ఒంటిచేత్తో జట్టు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అతడికి శశాంక్ (52 నాటౌట్) తోడ్పడగా, ఆఖర్లో జాన్సెన్ (34 నాటౌట్) రాణించాడు. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసి ఓడింది. ఓపెనర్లు కాన్వే (69 రిటైర్డ్ అవుట్), రచిన్ (36) మెరుపు ఆరంభంతో తొలి వికెట్‌కు 61 రన్స్ అందించారు. అయితే మధ్య ఓవర్లలో తడబాటుతో చేయాల్సిన రన్‌రేట్ పెరిగింది. శివమ్ దూబే (42) భారీ షాట్లతో ఆకట్టుకున్నా అతను కీలక సమయంలో వెనుదిరగడం దెబ్బతీసింది. డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లు సులువుగా పరుగులివ్వలేదు. దీంతో చివరి ఓవర్‌లో 28 రన్స్ కావాల్సిన వేళ ధోనీ (27) వెనుదిరగగా, జట్టు 9 పరుగులే చేయగలిగింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రియాన్ష్ నిలిచాడు.

ఆర్య అదిరేలా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓవైపు వికెట్లు పతనమవుతున్నా.. మరో వైపు ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య విధ్వంసం కొనసాగింది. తొలి ఎనిమిది ఓవర్లలోనే ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (0), శ్రేయాస్ (9), స్టొయినిస్ (4), నేహల్ (9), మ్యాక్స్‌వెల్ (1) ఇలా అంతా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగినా.. ఏమాత్రం ఒత్తిడికి లోనుకాని ఆర్య బాదుడు మాత్రం ఆపలేదు. బౌలర్ ఎవరైనా చితక్కొడుతూ మైదానం నలువైపులా బౌండరీల వరద పారించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్సర్ బాదిన తను రెండో బంతికే ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను ఖలీల్ వదిలేశాడు. దీనికి సీఎస్‌కే భారీ మూల్యమే చెల్లించుకుంది. ఆ తర్వాత తన జోరుకు పవర్‌ప్లేలో స్కోరు 75/3కి చేరగా, అటు 19 బంతుల్లోనే ఆర్య ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. ఈ దశలో శశాంక్ నుంచి అతడికి సహకారం అందింది. 13వ ఓవర్‌లో ఆర్య 6,6,6,4తో 23 రన్స్ రాబట్టగా.. 39 బంతుల్లోనే తొలి సెంచరీని పూర్తి చేశాడు. లీగ్‌లో ఇది నాలుగో ఫాస్టెస్ట్ సెంచరీ కావడం విశేషం. అయితే తర్వాతి ఓవర్‌లోనే అతడిని స్పిన్నర్ నూర్ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చివరి ఐదు ఓవర్లలో శశాంక్, జాన్సెన్ చెలరేగి 55 పరుగులు అందించడంతో పంజాబ్ 200+ స్కోరును అవలీలగా సాధించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
కోల్‌కతా	5	2	3	0	4	-0.056
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	5	1	4	0	2	-0.889
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) శంకర్ (బి) నూర్ 103, ప్రభ్‌సిమ్రన్ (బి) ముకేశ్ 0, శ్రేయాస్ (బి) ఖలీల్ 9, స్టొయినిస్ (సి) కాన్వే (బి) ఖలీల్ 4, నేహల్ (సి) ధోనీ (బి) అశ్విన్ 9, మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) అశ్విన్ 1, శశాంక్ (నాటౌట్) 52, జాన్సెన్ (నాటౌట్) 34, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 219/6; వికెట్ల పతనం:** 1-17, 2-32, 3-54, 4-81, 5-83, 6-154; **బౌలింగ్:** ఖలీల్ 4-0-45-2, ముకేశ్ 2-0-21-1, అశ్విన్ 4-0-48-2, జడేజా 3-0-18-0, నూర్ అహ్మద్ 3-0-32-1, పథిరణ 4-0-52-0.

చెన్నై: రచిన్ (స్టంప్డ్) ప్రభ్‌సిమ్రన్ (బి) మ్యాక్స్‌వెల్ 36, కాన్వే (రిటైర్డ్ అవుట్) 69, రుతురాజ్ (సి) శశాంక్ (బి) ఫెర్గూసన్ 1, దూబే (బి) ఫెర్గూసన్ 42, ధోనీ (సి) చాహల్ (బి) యశ్ 27, జడేజా (నాటౌట్) 9, విజయ్ శంకర్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 201/5; వికెట్ల పతనం:** 1-61, 2-62, 3-151, 4-171, 5-192; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-39-0, యశ్ ఠాకూర్ 4-0-39-1, మ్యాక్స్‌వెల్ 2-0-11-1, జాన్సెన్ 4-0-48-0, ఫెర్గూసన్ 4-0-40-2, స్టొయినిస్ 1-0-10-0, చాహల్ 1-0-9-0.

లఖ్‌నవూ థ్రిల్లింగ్ విన్

- చెలరేగిన పూరన్, మార్ష్
- 4 పరుగులతో ఓడిన కోల్‌కతా



పూరన్ (87 నాటౌట్)



మార్ష్ (81)

కోల్‌కతా: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) థ్రిల్లింగ్ విక్టరీని నమోదు చేసింది. రహానె (35 బంతుల్లో 61) అర్ధ శతకంతో ప్రత్యర్థిని వణికించినా.. శార్దూల్, దిగ్వేష్ రాఠీ కీలక సమయంలో వికెట్లు పడగొట్టి కోల్‌కతా జోరుకు బ్రేకులేశారు. దీంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 పరుగులతో కోల్‌కతాపై నెగ్గింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' పూరన్ (36 బం తుల్లో 7 ఫోర్లు, 8 సిక్సులతో 87 నాటౌట్), మార్ష్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులతో 81) అర్ధ శతకాలతో దుమ్మురేపడంతో.. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఛేదనలో కోల్‌కతా ఓవర్లన్నీ ఆడి 234/7 స్కోరుకు పరిమితమైంది. వెంకటేష్ అయ్యర్ (45), రింకూ (15 బంతుల్లో 38 నాటౌట్) శ్రమ వృథా అయింది.

ఆఖర్లో తడబాటు: విజయానికి 43 బంతుల్లో 77 పరుగులే కావాల్సి రావడంతో నైట్‌రైడర్స్ సులువుగానే గెలుస్తుందని భావించారు. కానీ, రహానెను శార్దూల్ అవుట్ చేయడంతో.. కోల్‌కతా ఇన్నింగ్స్ గాడితప్పింది. కేవలం 15 పరుగుల తేడాతో నాలుగు వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. చివరి ఓవర్‌లో విజయానికి 24 పరుగులు కావాల్సి ఉండగా.. రింకూ మ్యాజిక్ చేయలేకపోయాడు. అంతకుముందు డికాక్ (15) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మరో ఓపెనర్ నరైన్ (30)తో కలసి రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించిన రహానె.. అయ్యర్‌తో కలసి మూడో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

అదరగొట్టిన టాపార్డర్: టాపార్డర్ బ్యాటర్లు చెలరేగడంతో లఖ్‌నవూ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జట్టుకు ఓపెనర్లు మార్‌క్రమ్, మార్ష్ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యంతో బలమైన పునాది వేశారు. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన పూరన్.. మార్ష్‌తో రెండో వికెట్‌కు 71 రన్స్ జోడించాడు.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (బి) హర్షిత్ 47, మార్ష్ (సి) రింకూ (బి) రస్సెల్ 81, పూరన్ (నాటౌట్) 87, సమద్ (బి) హర్షిత్ 6, మిల్లర్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 238/3; వికెట్ల పతనం:** 1-99, 2-170, 3-221; **బౌలింగ్:** వైభవ్ 4-0-35-0, జాన్సన్ 3-0-46-0, వరుణ్ 4-0-31-0, హర్షిత్ 4-0-51-2, నరైన్ 3-0-38-0, రస్సెల్ 2-0-32-1.

కోల్‌కతా: డికాక్ (ఎల్బీ) ఆకాశ్ దీప్ 15, నరైన్ (సి) మార్‌క్రమ్ (బి) రాఠీ 30, రహానె (సి) పూరన్ (బి) శార్దూల్ 61, వెంకటేష్ (సి) మార్‌క్రమ్ (బి) ఆకాశ్ దీప్ 45, రమణ్‌దీప్ (సి) మార్‌క్రమ్ (బి) బిష్ణోయ్ 1, రఘువంశీ (సి) పంత్ (బి) అవేశ్ 5, రస్సెల్ (సి) మిల్లర్ (బి) శార్దూల్ 7, రింకూ (నాటౌట్) 38, హర్షిత్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 20 ఓవర్లలో 234/7; వికెట్ల పతనం:** 1-37, 2-91, 3-162, 4-166, 5-173, 6-177, 7-185; **బౌలింగ్:** ఆకాశ్ దీప్ 4-0-55-2, శార్దూల్ 4-0-52-2, అవేశ్ 4-0-45-1, దిగ్వేష్ 4-0-33-1, బిష్ణోయ్ 4-0-47-1.

బిజినెస్



ట్రంప్-మస్క్ మధ్య చెడిందా..?

- ఇరువురి నడుమ సుంకాల మంట!!
- టారిఫ్‌లు వద్దన్న టెస్లా అధిపతి
- అధ్యక్షులవారు మాత్రం ససేమిరా..

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితుడు ఎలాన్ మస్క్ మధ్య చెడిందని సమాచారం. ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలే ఇరువురి మధ్య అభిప్రాయ విభేదానికి కారణమని ఓ అమెరికన్ మీడియా సంస్థ కథనం పేర్కొంది. సుంకాలు విధించవద్దని మస్క్ ఎంత చెప్పినా ట్రంప్ వినలేదట. ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని టెస్లా అధిపతికి అధ్యక్షులవారు ఖరాఖండిగా తేల్చి చెప్పేశారట. సుంకాల దెబ్బకు తన సంపద భారీగా తరిగిపోవడంతో పాటు టెస్లా కార్ల కంపెనీ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకోవడంతో పెద్దన్నపై మస్క్ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రతీకార సుంకాలకు తాను వ్యతిరేకమని మస్క్ చెప్పకనే చెప్పారు. గత వారంలో ట్రంప్ సుంకాలు ప్రకటించిన కొద్ది సేపటికే ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత మిల్టన్ ఫ్రైడ్మాన్ స్వేచ్ఛా వాణిజ్యంపై మాట్లాడుతున్న వీడియోను మస్క్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. అంతేకాదు, యూరప్‌తో సుంకాలు లేని వాణిజ్యం నెరపాలని కోరారు. అయితే, సుంకాలపై మస్క్ వైఖరిని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం మస్క్, నవారో మధ్య మాటల యుద్ధమే కొనసాగుతోంది. మస్క్, వైట్‌హౌస్‌కు మధ్య అగాధం పెరిగిందన్న వార్తలను ఇది మరింత బలపరుస్తోంది.

మస్క్ సంపదలో రూ.11.61 లక్షల కోట్లు ట్రంపార్పణం: ట్రంప్ సుంకాల దెబ్బకు మస్క్ సంపద ఈ ఏడాదిలో 13,500 కోట్ల డాలర్ల (రూ.11.61 లక్షల కోట్లు) మేర తరిగిపోయి ప్రస్తుతం 30,000 కోట్ల డాలర్ల దిగువకు (రూ.25.80 లక్షల కోట్లు) పడిపోయింది. గత గురు, శుక్రవారాల్లోనే మస్క్ నెట్‌వర్త్ 3,100 కోట్ల డాలర్ల మేర క్షీణించింది. సోమవారం నాడు మరో 440 కోట్ల డాలర్ల ఆస్తిని కోల్పోయారు.



ఒక రాష్ట్రం-ఒక ఆర్ఆర్‌బీ
మే 1 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ: మరోసారి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ) పునర్ వ్యవస్థీకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. మే 1 నుంచి 'ఒక రాష్ట్రం-ఒక ఆర్ఆర్‌బీ' విధానం అమల్లోకి రానుంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న 43 ఆర్ఆర్‌బీలను 28కి కుదిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్,ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, బిహార్, కర్ణాటక, జమ్మూకాశ్మీర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా, రాజస్థాన్‌ల్లోని పలు ఆర్ఆర్‌బీలను ఒకే ఆర్ఆర్‌బీగా విలీనం చేస్తున్నట్టు తెలిపింది. ఆర్ఆర్‌బీలు ఖర్చులు తగ్గించుకుని నిర్వహణ సామర్థ్యం పెంచుకునేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఆర్ఆర్‌బీలను పునర్ వ్యవస్థీకరించడం ఇది నాలుగోసారి.

నేడే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొలి ద్రవ్య పరపతి విధానం బుధవారం ప్రకటించనున్నారు. ఈసారి కూడా ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించవచ్చన్న ఊహాగానాల నడుమ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం కోసం పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మల్హోత్రా సారథ్యంలోని ఎంపీసీ మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. కాగా బుధవారం ఉదయం 10 గంటలకు గవర్నర్ ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారని ఆర్‌బీఐ తెలిపింది.

సెమీకండక్టర్స్ వ్యాపారంలోకి సైయెంట్

- సైయెంట్ సెమీకండక్టర్స్ పేరుతో సంస్థ ఏర్పాటు
- రూ.862 కోట్లు కేటాయింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఐటీ కంపెనీ సైయెంట్ తన సెమీకండక్టర్ వ్యాపారాన్ని పెద్దఎత్తున విస్తరిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే 400 మంది ఉద్యోగులతో సైయెంట్ సెమీకండక్టర్స్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసి 10 కోట్ల డాలర్లు (సుమారు రూ.862 కోట్లు) కేటాయించింది. సెప్టెంబరు నాటికి ఈ అనుబంధ కంపెనీ కోసం విదేశాల నుంచి మరిన్ని నిధులు సమీకరిస్తామని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎండీ బోదనపు కృష్ణ తెలిపారు. ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లను నియమించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. అయితే విదేశాల నుంచి ఎంత మొత్తం నిధులు సమీకరించేది ఆయన వెల్లడించలేదు. భవిష్యత్‌లో ఈ అనుబంధ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే యోచన కూడా ఉందన్నారు.


నైపుణ్యాలపైనే దృష్టి: సెమీకండక్టర్ల వ్యాపారంలో కొత్త చిప్స్ పరిశోధన, అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా మేధో సంపత్తి హక్కులు పొందాలని సైయెంట్ భావిస్తోంది. ఇందులో భాగంగా దేశ విదేశాల్లోని విద్యుత్ వాహనాలు, విద్యుత్ పంపిణీ సంస్థల వంటి రంగాలకు అవసరమైన కస్టమైజ్డ్ సిలికాన్ చిప్స్ అభివృద్ధి చేస్తామని కృష్ణ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కూడా ఈ విషయంలో తమకు కలిసి వస్తాయని కంపెనీ భావిస్తోంది.

తుది తీర్పుకు లోబడే 'రిస్డిప్లామ్' ఔషధం

మా ధర రూ.15,900 మాత్రమే: నాట్కో

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిస్డిప్లామ్ జెనరిక్ ఔషధం మార్కెట్లోకి విడుదల చేయడం ఢిల్లీ హైకోర్టు తుది తీర్పుకు లోబడి ఉంటుందని నాట్కో ఫార్మా వెల్లడించింది. తమ రిస్డిప్లామ్ జెనరిక్ ఔషధం ధర కూడా డోసు రూ.15,900 మాత్రమేనని పేర్కొంది. ప్రస్తుతం ఇదే పేటెంట్ ఔషధాన్ని స్విస్ ఫార్మా కంపెనీ రోచే రెండేళ్లకు రూ.72 లక్షల చొప్పున, ఆ తర్వాత ఏడాదికి రూ.56 లక్షల చొప్పున విక్రయిస్తోంది. అరుదైన వెన్నుపూస కండరాల క్షీణత (ఎస్ఎంఏ) వ్యాధి చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారు. ప్రస్తుతం రోచె ఫార్మా ఒక్కటే ఈ పేటెంటెడ్ ఔషధాన్ని 'ఎవరిస్డీ' పేరుతో మన దేశంలో మార్కెట్ చేస్తోంది. ఈ ఔషధం తయారీ, మార్కెటింగ్‌పై రోచెకు 2035 వరకు పేటెంట్ హక్కులు ఉన్నాయి.

ఉఫ్.. రిలీఫ్!



భారీ నష్టాల నుంచి మార్కెట్లకు కాస్త ఉపశమనం
- సెన్సెక్స్ 1,089 పాయింట్లు అప్
- 22,500 ఎగువ స్థాయికి నిఫ్టీ
- రూ.7 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: ట్రంప్ సుంకాల షాక్‌తో సొమ్మసిల్లిన స్టాక్ మార్కెట్లు కాస్త తేరుకున్నాయి. కనిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో ఆసియా, ఐరోపా మార్కెట్లతో పాటు దలాల్ స్ట్రీట్‌లోనూ మంగళవారం ఊరట ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ ఒక దశలో 1,721.49 పాయింట్లు (2.35 శాతం) ఎగబాకి 74,859.39 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,089.18 పాయింట్ల (1.49 శాతం) లాభంతో 74,227.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 535 పాయింట్ల (2.41 శాతం) వరకు పెరిగినప్పటికీ, చివర్లో 374.25 పాయింట్ల (1.69 శాతం) వృద్ధితో 22,535.85 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.32 లక్షల కోట్లు పెరిగి రూ.396.57 లక్షల కోట్లకు (4.62 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో పవర్‌గ్రిడ్ మినహా అన్నీ రాణించాయి. టైటాన్ షేరు 3.29 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, ఎల్ అండ్ టీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్, బ్యాంక్, జొమాటో, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా స్టాక్స్ 2 శాతానికి పైగా పెరిగాయి.
- బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 2.18 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.87 శాతం వృద్ధిని నమోదు చేశాయి. రంగాలవారీ సూచీలన్నీ రాణించాయి. ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ అత్యధికంగా 2.58 శాతం ఎగబాకింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, టెలికాం, ఇండస్ట్రియల్స్ ఎనర్జీ సూచీలూ రెండు శాతానికి పైగా పెరిగాయి.

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే, జపాన్ నికాయ్ 6.03 శాతం, చైనాకు చెందిన షాంఘై ఇండెక్స్ 1.58 శాతం, హాంకాంగ్‌కు చెందిన హాంగ్‌సెంగ్ 1.51 శాతం వృద్ధి చెందాయి. మరోవైపు బ్రిటన్‌కు చెందిన ఎఫ్‌టీఎస్ఈ 2.71 శాతం, ఫ్రాన్స్‌కు చెందిన సీఏసీ 2.50 శాతం, జర్మనీకి చెందిన డాక్స్ సూచీలు 2.48 శాతం లాభంతో క్లోజయ్యాయి. కాగా అమెరికా సూచీలు డోజోన్స్ 2.07 శాతం, ఎస్ అండ్ పీ 2.05 శాతం, నాస్‌డాక్ 2.37 శాతం మేర లాభాలతో ప్రారంభమయ్యాయి.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 50 పైసలు క్షీణించి రూ.86.26 వద్ద ముగిసింది. దాదాపు మూడు నెలల్లో రూపాయికిదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అంతేకాదు, రూపాయి విలువ తగ్గడం వరుసగా ఇది మూడో రోజు కూడా.

ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర మరో రూ.200 తగ్గి రూ.91,250కి జారుకుంది. వరుసగా ఐదు రోజులు తగ్గుతూ వచ్చిన వెండి రేటు మాత్రం కిలోకు రూ.200 పెరుగుదలతో రూ.92,700 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో మాత్రం ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ అర శాతానికి పైగా పెరిగి 3,007 డాలర్లకు చేరగా.. సిల్వర్ 30 డాలర్ల ఎగువన ట్రేడైంది.

'1600' ఫోన్ నంబర్ సిరీస్‌నే వాడాలి..

- తన నియంత్రిత, రిజిస్టర్డ్ సంస్థలకు సెబీ నిర్దేశం

మదుపరుల ప్రయోజనాలను రక్షించడంతోపాటు ఆర్థిక మోసాలను అరికట్టేందుకు సెబీ మరో చర్య చేపట్టింది. ఇకపై కస్టమర్లకు కాల్ చేసేందుకు కేవలం '1600' ఫోన్ నంబర్ సిరీస్‌నే ఉపయోగించాలని సెబీ తన నియంత్రిత, రిజిస్టర్డ్ సంస్థలన్నింటినీ నిర్దేశించింది. తద్వారా మదుపరులు తమ నియంత్రిత, రిజిస్టర్డ్ సంస్థల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం సులభమవుతుందని, ఆర్థిక మోసాలనూ తగ్గించేందుకు వీలవుతుందని సెబీ పేర్కొంది.


ఎక్స్ ఖాతా తెరిచిన సెబీ

సెబీ కూడా ఎక్స్ (గతంలో ట్విటర్)లో ఖాతా తెరిచింది. "@SEBI_updates' పేరుతో అధికారిక ఎక్స్ ఖాతాను ప్రారంభించినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ ఖాతాలో నియమావళి నోటిఫికేషన్లు, ఉత్తర్వులు, సర్క్యులర్లు, పత్రికా ప్రకటనలను పోస్ట్ చేయనున్నట్లు తెలిపింది.

జపాన్, కొరియాలో నిఫ్టీ ఫండ్స్


గత ఆర్థిక సంవత్సరం (2024-25) జపాన్, కొరియాలో నిఫ్టీ సూచీలను ట్రాక్ చేసే 11 ప్యాసివ్ ఫండ్ల (ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్లు వంటివి)ను ప్రారంభించినట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) మంగళవారం వెల్లడించింది. అందులో 9 ఫండ్లు నిఫ్టీ-50 సూచీని ట్రాక్ చేస్తున్నట్లు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




9వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	440
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	480	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	89
కర్నూలు	100	నెల్లూరు	94
విశాఖపట్నం	109	అనంతపురం	94
గోదావరి	115		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,730 ▼	82,250 ▼	1,03,000 ▼
విజయవాడ	91,000 ▼	85,000 ▼	92,000 ▲
విశాఖపట్నం	88,220 ▼	80,870 ▼	90,040 ▲
రాజమండ్రి	89,730 ▼	82,750 ▼	92,200 ▼
ప్రొద్దుటూరు	88,850 ▼	81,600 ▼	92,300 ▲
ముంబై	88,550 ▼	81,112 ▼	90,363 ▼

బ్రహ్మ కుమారీస్ అధినేత్రి దాది రతన్ మోహిని కన్నుమూత

సీఎం చంద్రబాబు సంతాపం



జైపూర్, ఏప్రిల్ 8: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ అధినేత్రి దాది రతన్ మోహిని కన్నుమూశారు. వందేళ్లు దాటిన దాది రతన్ మోహిని.. ఇటీవల ఆరోగ్యం సరిగా లేక అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. 1925 మార్చి 25న జన్మించిన దాది రతన్ మోహిని అతి పిన్న వయసులో బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో చేరారు. ప్రపంచమంతా సంచరించి ఆధ్యాత్మిక ప్రగతికి కృషి చేశారు. జాతి, మత భేదాలకు అతీతంగా ఆధ్యాత్మిక చైతన్యం కలిగించి ఎందరికో మార్గ దర్శకులయ్యారు. తన విశేష సేవలకు గాను డాక్టరేట్‌తో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. దాది మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటి, సమాజానికి శాంతి, మానవతా విలువల సందేశాన్ని మోహిని జీ అందించారని, ఆమె మరణం భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచానికి తీరని లోటని ఎక్స్‌లో పేర్కొన్నారు.

అయోధ్యరాముడికి వచ్చే నెలలో పట్టాభిషేకం!

- ఈ నెలాఖరుకల్లా రామదర్బార్ సిద్ధం
- జైపూర్‌లో రూపుదిద్దుకుంటున్న రాజసభ

అయోధ్య, ఏప్రిల్ 8: అయోధ్య రామాలయంలో గత ఏడాది జనవరి 22న ప్రాణప్రతిష్ఠ జరిగింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, రాజకీయ నేతలు, సాధువులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు సహా 8 వేల మంది ప్రముఖులు తరలిరాగా.. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఇప్పుడు మరో కీలక ఘట్టం అక్కడ ఆవిష్కృతం కానుంది. అయోధ్యాధీశుడిగా శ్రీరాముడి పట్టాభిషేకాన్ని వచ్చే నెలలో నిర్వహించేందుకు సకల సన్నాహాలూ జరుగుతున్నాయి. దానికి ముందుగా ఈ నెలాఖరులోగా ఆలయ మొదటి అంతస్తులో రామదర్బార్ లేదా రాజసభను నెలకొల్పనున్నారు. అయితే పట్టాభిషేకాన్ని ప్రాణప్రతిష్ఠ తరహాలో పటాటోపంగా నిర్వహించడం లేదు. పరిమిత సంఖ్యలో మాత్రమే అతిథులను ఆహ్వానించనున్నారు. ప్రధాని మాజీ ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రా సారథ్యంలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం చకచకా పూర్తవుతోంది. ఆలయ సముదాయం ఈ నెలాఖరుకల్లా సిద్ధమవుతుందని మిశ్రా ఇటీవల స్వయంగా చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి ఆలయ ప్రాకారం పూర్తవుతుందన్నారు. ప్రాకారం లోపల, వెలుపల నిర్మించిన ఆలయాల్లో ప్రతిష్ఠించాల్సిన విగ్రహాలు ఈనెల 30నాటికి వచ్చేస్తాయన్నారు.

శిల్పి ప్రశాంత్ పాండే నేతృత్వాన..

బాలరాముడి విగ్రహాన్ని కర్ణాటక శిల్పి అరుణ్ యోగిరాజ్ రూపొందించిన సంగతి తెలిసిందే. రామదర్బార్‌ను ప్రముఖ శిల్పి ప్రశాంత్ పాండే నేతృత్వంలోని 20 మంది హస్త కళాకారులు జైపూర్‌లో తీర్చిదిద్దుతున్నారు. ఈయన తండ్రి సత్యనారాయణ పాండే పర్యవేక్షిస్తున్నారు. ఆ కుటుంబంలో నాలుగు తరాలుగా అందరూ శిల్పప్రావీణ్యం కలిగినవారే కావడం విశేషం. రామదర్బార్‌లో సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, ఆంజనేయుడి విగ్రహాలు (తెల్ల మార్బుల్) కూడా ఉంటాయి. ఆలయ ప్రాంగణంలో నెలకొల్పే సూర్యదేవుడు, విఘ్నేశ్వరుడు,



హనుమంతుడు, దుర్గాదేవి, అన్నపూర్ణాదేవి విగ్రహాలు, సప్తర్షి ఆలయంలో ప్రతిష్ఠించే సప్తర్షుల విగ్రహాలను కూడా పాండే రూపుదిద్దుతున్నారు. 'ఇది ప్రస్తుతం తుది ప్రక్రియలో ఉంది. పూర్తికాగానే అయోధ్య రామాలయానికి తరలిస్తాం' అని పాండే చెప్పారు. కాగా.. 'రామచరిత మానస్' రాసిన సంత్ తులసీదాస్ విగ్రహాన్ని కూడా ఆలయ ప్రాంగణంలోనే నెలకొల్పుతున్నారు. మరోవైపు, రామాలయానికి 4కిలోమీటర్ల దూరాన ప్రధాన అంతర్జాతీయ రామకథ మ్యూజియంను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో శ్రీరామ జననం, రామాయణ ఇతర ఘట్టాలను కళ్లకుగట్టే హోలోగ్రాం, రామాలయ నిర్మాణానికి శతాబ్దాలుగా సాగిన ఉద్యమం తాలూకు డాక్యుమెంటరీ.. పురావస్తు శాఖ తవ్వకాల్లో వెలుగుచూసిన ప్రాచీన కళాఖండాలు, శిల్పాలను ప్రదర్శిస్తారు.

పెళ్లి కుమారుడితో కాబోయే అత్త పరార్

ఆలీగఢ్, ఏప్రిల్ 8: కాబోయే అల్లుడితో ఓ అత్త పరారు కావడం సంచలనం కలిగించింది. వారిద్దరు ప్రేమలో పడడమే ఇందుకు కారణం. పెళ్లికి ఇంకా 9రోజులుండగా నగదు, నగలు తీసుకొని ఆమె వెళ్లిపోయింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ తన కుమార్తె కోసం స్వయంగా యువకుడిని చూసి పెళ్లి నిశ్చయం చేసింది. అత్తవారిల్లు అన్న భావనతో ఆ యువకుడు నిత్యం వస్తుండేవాడు. ఈ క్రమంలో పెళ్లి కుమారుడు, కాబోయే అత్త మధ్య ప్రేమ చిగురించింది. పెళ్లి దగ్గరపడుతుండడంతో షాపింగ్ కోసం వెళ్తున్నానని చెప్పిన అత్త మళ్లీ తిరిగి రాకపోవడంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'పుట్టేది సౌరభ్ బిడ్డే అయితే దత్తత తీసుకుంటాం'

మేరఠ్, ఏప్రిల్ 8: ప్రియుడి సాయంతో భర్తను హత్య చేసిన భార్య ముస్కాన్ రస్తోగి కేసులో మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె గర్భం దాల్చినట్టు వైద్య పరీక్షలో తేలినట్టు అధికారులు తెలిపారు. మర్చంట్ నేవీ అధికారి అయిన సౌరభ్ రాజ్‌పుత్‌ను ఆమె.. ప్రియుడు సాహిల్ శుక్లాతో కలిసి నరికి ముక్కలు చేసింది. ప్రస్తుతం జైలులో ఉన్న ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించగా గర్భందాల్చినట్టు తేలింది. దీనిపై సౌరభ్ సోదరుడు స్పందించారు. జన్మించేది సౌరభ్ బిడ్డే అయితే తాము దత్తత తీసుకుంటామని తెలిపారు.

మేధా పాట్కర్ ప్రొబేషన్‌పై విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: సామాజిక ఉద్యమకారిణి మేధా పాట్కర్ (70)కు మంగళవారం న్యాయస్థానంలో ఊరట లభించింది. పరువు నష్టం దావాలో జైలు శిక్ష పడిన ఆమెను ప్రొబేషన్‌పై విడుదల చేస్తున్నట్టు అదనపు సెషన్స్ జడ్జి విశాల్ సింగ్ ప్రకటించారు. సత్ప్రవర్తనను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత ఢిల్లీ గవర్నర్ ఎల్.కె.సక్సేనా నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమ సమయంలో ఆమెపై ఈ పరువు నష్టం దావా వేశారు.







సెంటిమెంట్ తేదీన విశ్వంభర?



చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతోన్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంక్రాంతికి రావాల్సిన ఈ సినిమా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు కొత్త తేదీని చిత్రబృందం ప్రకటించలేదు. కానీ, చిరంజీవి బ్లాక్ బస్టర్ సినిమాల్లో ఒకటైన 'జగదేక వీరుడు - అతిలోక సుందరి' విడుదలైన మే9న 'విశ్వంభర'ను రిలీజ్ చేయనున్నారనే వార్తలు ఆ మధ్య వెలువడ్డాయి. తాజాగా జూలై 24న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాలీవుడ్‌లో మరోసారి వార్తలు వినిపిస్తున్నాయి. 'ఇంద్ర' కూడా అదే రోజున విడుదలై ఇండస్ట్రీ హిట్ కొట్టింది. ఆ సెంటిమెంట్ 'విశ్వంభర'కు కూడా పనిచేస్తుందని చిత్రబృందం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. కాగా, 'విశ్వంభర' నుంచి ఈనెల 12న తొలి పాటను విడుదల చేయనున్నట్లు సమాచారం. అలాగే 'చిరంజీవి - అనిల్ రావిపూడి' చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

అఖిల్... లెనిన్



పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుందిరా, పేరు ఉండదు... పోయేటప్పుడు ఊపిరి ఉండదు పేరు మాత్రమే ఉంటుందిరా' అంటూ పవర్‌ఫుల్ డైలాగ్, లుక్‌తో ఎంట్రీ ఇచ్చారు అఖిల్ అక్కినేని. ఆయన కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్ ఖరారైంది. మంగళవారం అఖిల్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. అందులో గుబురు మీసం, పొడవాటి జుట్టుతో మాస్‌లుక్‌లో అఖిల్ ఆకట్టుకున్నారు. రాయలసీమ నేపథ్యంలో పోరాట ఘట్టాలు, పతాకస్థాయి భావోద్వేగాలతో ఈ చిత్రం రూపొందుతోందని గ్లింప్స్‌ను బట్టి తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకుడు. సంగీతం: తమన్, సినిమాటోగ్రఫీ: నవీన్‌కుమార్, ఎడిటర్: నవీన్ నూలి.

'టిల్లూ'కు మించిన వినోదంతో వస్తున్నాం



- సిద్ధు జొన్నలగడ్డ

"బొమ్మరిల్లు, పరుగు' లాంటి హిట్ చిత్రాల కోవలోనే భాస్కర్ గారు దర్శకత్వం వహించిన 'జాక్' చిత్రం కూడా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఆయన 24 గంటలూ ఈ సినిమా గురించే ఆలోచించారు. 'టిల్లుతో నువ్వు క్రియేట్ చేసిన ఇమేజ్ ఈ చిత్రంలోనూ ఏమాత్రం తగ్గకూడదు' అని అనేవారు. ఆయన చెప్పినట్లు నా గత చిత్రాలకు మించిన ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఈ చిత్రంతో ఇవ్వబోతున్నాం" అని హీరో సిద్ధు జొన్నలగడ్డ చెప్పారు. ఆయన కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "టిల్లూ స్క్వేర్ తర్వాత చాలా జాగ్రత్తలు తీసుకొని చేసిన సినిమా ఇది. భాస్కర్ గారి విజన్‌లో హీరోగా నన్ను చూసుకోవడం ఆనందాన్నిచ్చింది" అని అన్నారు. బొమ్మరిల్లు భాస్కర్ మాట్లాడుతూ 'ఇది మనందరి కథ. ఒక శిలలో ఉండే శక్తి ఏంటో మీరు ఈ సినిమాలో చూస్తారు. నటిగా వైష్ణవి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుంది. సిద్ధు ప్రతిభావంతుడైన నటుడు. సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. ప్రసాద్ గారితో కలసి పనిచేయడం కొత్త ఉత్సాహాన్నిచ్చింది' అని చెప్పారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. ప్రేక్షకాదరణ దక్కుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. "టిల్లూ స్క్వేర్‌తో పోల్చితే జాక్‌లో పదిరెట్ల వినోదం ఉంటుంది. హ్యాపీగా నవ్వుకోవడానికి ఈ సినిమాకు వెళ్లండి" అని నిర్మాత నాగవంశీ చెప్పారు.

మంచు విష్ణుపై మనోజ్ ఫిర్యాదు



మంచు కుటుంబం మరోసారి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో మంచు మనోజ్ తన అన్న మంచు విష్ణుపై ఫిర్యాదు చేశారు. తాను ఇంట్లోలేని సమయంలో కారుతోపాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడని, జల్‌పల్లి ఇంట్లో సైతం 150 మంది చొరబడి విధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ 'ఏప్రిల్ 1న పాప పుట్టిన రోజు వేడుకల కోసం జైపూర్ వెళ్లాను. విష్ణుతో పాటు 150 మంది ఇంట్లోకి వచ్చారు. నా గదులను ధ్వంసం చేశారు. నగల పెట్టెలను సైతం ధ్వంసం చేశారు' అని తెలిపారు. కాగా, నార్సింగిలో మంచు మనోజ్ నివాసం ఉంటున్న ముప్పా విల్లాస్‌లో జరిగిన దొంగతనం సంఘటనపై ఆయన డ్రైవర్ సాంబశివరావు ఫిర్యాదు చేశారని నార్సింగి పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగి (ఆంధ్రజ్యోతి)

ఒక వైపు అధికారం.. మరో వైపు నిజం!



చట్టానికి తప్ప ఎవరికీ తలవంచని అధికారి, వృత్తిని దైవంలా భావించే ఐఆర్ఎస్ ఆఫీసర్ అమీ పట్నాయక్ మళ్లీ వచ్చేశాడు. 2018లో వచ్చిన హిట్ మూవీ రైడ్‌కు సీక్వెల్ రెడీ అయింది. రైడ్ 2' పేరుతో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో ఐఆర్ఎస్ ఆఫీసర్ అమీ పట్నాయక్‌గా అజయ్ దేవగణ్ మళ్లీ నటిస్తున్నారు. రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో పనోరమ స్టూడియోస్, టీ సిరీస్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించాయి.. రైడ్‌లో ఇలియానా కథానాయికగా నటిస్తే, సీక్వెల్‌లో ఆ పాత్రను వాణీ కపూర్ చేజిక్కించుకున్నారు. 'ఒకవైపు అధికారం.. మరో వైపు నిజం. ఈ ప్రయాణం ఇప్పుడు మరింత పెద్దదిగా మారింది' అని పేర్కొంటూ ట్రైలర్‌ను సోషల్ మీడియా ద్వారా మంగళవారం విడుదల చేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965



అట్లీ దర్శకత్వంలో 'పుష్పరాజ్'

తమిళ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించనున్న సినిమా ఖరారు అయింది. సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మంగళవారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా 'ల్యాండ్‌మార్క్ సినిమాటిక్ ఈవెంట్ "ఏఏ22-ఏ6" కోసం సిద్ధమవ్వండి. సన్ పిక్చర్స్ నుంచి ఒక గొప్ప ప్రయత్నం' అని ట్వీట్ చేస్తూ ఓ వీడియోను నిర్మాణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లుగా వీడియోలో చూపించారు. అలాగే, అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన విజువల్స్‌నూ ఇందులో చూపించారు. అంతర్జాతీయ స్థాయిలో భారీ బడ్జెట్‌తో ఈ మూవీని తీర్చిదిద్దుతున్నట్లు వీడియో చూస్తే అర్థమవుతోంది. ఈ కథకు భారీగా వీఎఫ్ఎక్స్ సన్నివేశాల అవసరం ఉండడంతో అల్లు అర్జున్, అట్లీ ఇద్దరూ అమెరికా వెళ్లారు. వివిధ వీఎఫ్ఎక్స్ స్టూడియోలను సందర్శించి నిపుణులతో చర్చించారు. రూ. 250 కోట్లు వీఎఫ్ఎక్స్ కోసమే సన్ పిక్చర్స్ ఖర్చు చేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రోస్థటిక్ మేకప్‌లో అల్లు అర్జున్ కనిపించే అవకాశం ఉందని తెలిసింది.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

దుష్టశక్తిపై సమరం



గ్లామర్ తార తమన్నా భాటియా నాగ సాధువుగా నటించిన 'ఓదెల 2' చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్' కు ఇది సీక్వెల్. దర్శకుడు సంపత్‌నంది కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించడమే కాకుండా దర్శకత్వ పర్యవేక్షణ చేశారు. అశోక్ తేజ దర్శకుడు. డి. మధు నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం ముంబైలో విడుదల చేశారు. ఓదెల గ్రామానికి ఓ దుష్ట శక్తి కారణంగా ప్రమాదం పొంచి ఉందని చెప్పే ఓ పవర్‌ఫుల్ వాయిస్‌తో ట్రైలర్ మొదలవుతుంది. మంచికీ, చెడుకీ మధ్య జరిగే సమరంలో ఓ నాగసాధువు ఆ గ్రామాన్ని ఎలా రక్షించిందన్న కథాంశంతో ఆసక్తికరంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. తమన్నా తన అద్భుత నటనతో నాగసాధువు పాత్రకు సహజత్వం తెచ్చారు. అలాగే వశిష్ట ఎన్ సింహ పోషించిన మాంత్రికుడి పాత్ర భయానకంగా ఉంది.

వినోదాత్మక చిత్రం



రామ్ ప్రకాశ్ గున్నం హీరోగా నటించి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'చెరసాల'. శ్రీజిత్, నిష్కల, రమ్య కీలక పాత్రలు పోషించారు. కథి అంజమ్మ, షికార నిర్మించారు. ఈ నెల 11న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు రామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ "మంచి భావోద్వేగాలతో పాటు చక్కని వినోదం ఉన్న చిత్రమిది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని అన్నారు.

సందేశాత్మక ప్రేమకథ



పృథ్వీ అంబర్ ప్రధానపాత్రలో సాయిరాజేశ్ మహదేవ్ తెరకెక్కించిన చిత్రం 'డియర్ ఉమ'. సుమయ రెడ్డి హీరోయిన్‌గా నటించి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు శివ నిర్వాణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మంచి ప్రేమకథతో పాటు సందేశం ఉన్న ఫీల్ గుడ్ చిత్రమిది" అని తెలిపారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది.

10 వేలు తీసుకున్నావ్.. సమస్య తీర్చవా?

- ఎమ్మార్వోను నిలదీసిన మహిళ
- వీఆర్వోలు లక్ష తిన్నారంటూ ఆత్మహత్యాయత్నం



హైమావతి నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కుంటున్న తహసీల్దార్ వెంకటేశ్ నాయక్

కోడుమూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'నా భూమిని ఆన్‌లైన్ చేస్తానని రూ.10 వేలు తీసుకున్నావ్. మీ వీఆర్వోలు లక్ష తినేశారు. పైగా కోరిక తీర్చమంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. ఇది ఎమ్మార్వో కార్యాలయమేనా? లేక....' అంటూ ఓ బాధితురాలు మంగళవారం కర్నూలు జిల్లా కోడుమూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం చేసుకుంది.చాకలి హైమావతి అనే వివాహిత కోడుమూరులో నివసిస్తోంది. ఆమె తండ్రికి ప్యాలకుర్తి గ్రామంలో తొమ్మిది ఎకరాల భూమి ఉంది. తండ్రి మరణానంతరం ఆ భూమిని మొదటి భార్య కుమారుడు లక్ష్మన్న స్వాధీనం చేసుకున్నాడు. అందులో సగ భాగం ఆమెకు చెందుతుందని 2023లో కోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు మేరకు తనకు భూమి అప్పగించి, ఆన్‌లైన్ చేయాలని ఆనాటి నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం కార్యాలయానికి వెళ్లిన ఆమె.. తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ ఎదుటే పురుగుల మందు డబ్బా తీసి.. తాగేందుకు ప్రయత్నించింది. ఆమె ప్రయత్నాన్ని తహసీల్దార్ అడ్డుకుని, చేతిలోని పురుగుల మందు బాటిల్‌ను లాగేశారు.

పవన్ కాన్వాయ్ కోసం ట్రాఫిక్ ఆపలేదు

- విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్ స్పష్టీకరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి సమీపంలోని చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో సోమవారం కొంతమంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్ష రాయలేకపోవడానికి డిప్యూటీ సీఎం కాన్వాయ్ కోసం పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేయడమే కారణమని వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అల్లూరి జిల్లా పర్యటన కోసం సోమవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారని, అక్కడి నుంచి కాన్వాయ్‌లో ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి మీదుగా ఏఎస్ఆర్ జిల్లాకు వెళ్లారని చెప్పారు. పవన్ కాన్వాయ్‌ను బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో పంపించడంతో, దానికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డులో వాహనాల రాకపోకలకు అనుమతించామని తెలిపారు. కాన్వాయ్ కోసం ఎక్కడా ట్రాఫిక్‌ను ఆపలేదన్నారు. వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను మీడియాకు విడుదల చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోలేకపోవడానికి కారణం ఏమిటనేది తమకు తెలియదన్నారు. ట్రాఫిక్‌ను నిలిపేయడం వల్లే పరీక్షా కేంద్రానికి 2 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నామని ఆ విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పిన వీడియోలను మీడియా ప్రతినిధులు ట్రాఫిక్ ఏడీసీపీకి చూపించగా.. ఆయన ఖండించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డులో ఇతర వాహనాల రాకపోకలు సాగుతున్నట్టు కనిపిస్తుంటే.. వారి ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలా..? లేదా..? అనే విషయాన్ని మీడియానే ఆలోచించుకోవాలని అన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్ల దోషులకు

మరణ శిక్షే సరి

- ఖరారు చేసిన తెలంగాణ హైకోర్టు
- ఎన్ఐఏ కోర్టు తీర్పునకు సమర్థన

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, దిల్‌సుఖ్‌నగర్, చాదర్‌ఘాట్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో దోషులకు మరణశిక్షే సరి అని హైకోర్టు అభిప్రాయపడింది. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు వీరికి మరణశిక్ష విధిస్తూ 2016లో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. దోషుల్లో పరివర్తన వస్తుందనే విశ్వాసం కనిపించడం లేదని, శిక్షను జీవిత ఖైదుగా మార్చడం వృథా ప్రయాసే అవుతుందని వ్యాఖ్యానించింది. ఎన్ఐఏ కోర్టు తీర్పుపై దోషులు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. మరణ శిక్ష పడ్డ ఉగ్రవాదుల్లో అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ, జియా-ఉర్-రహ్మాన్ అలియాస్ వఘాస్ అలియాస్ నబీల్ అహ్మద్, మహమ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ అలియాస్ మోనూ, యాసిన్ భత్కల్ అలియాస్ షారూఖ్, ఎజాజ్ షేక్ అలియాస్ సమర్ అర్మాన్ తుండే అలియాస్ సాగర్ అలియాస్ ఐజాజ్ సయీద్ షేక్ ఉన్నారు. 2013 ఫిబ్రవరి 21న సాయంత్రం 7 గంటల సమయంలో.. సెకన్ల వ్యవధిలో దిల్‌సుఖ్‌నగర్ 107 బస్టాండ్, సమీపంలోని ఏ1-మిర్చీ సెంటర్ వద్ద రెండు భారీ పేలుళ్లు జరిగి, 18 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 131 మందికి గాయాలయ్యాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రియాజ్ భత్కల్ ఇప్పటికీ పరారీలో ఉండగా.. ఏ-2 నుంచి ఏ-6 వరకు ఉన్న ఐదుగురికి ఎన్ఐఏ కోర్టులో మరణశిక్ష ఖరారైంది. 157 మంది సాక్షులను విచారించాక.. ఎన్ఐఏ కోర్టు ఈ తీర్పునిచ్చింది. దాంతో దోషులు ఆ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తూ.. పిటిషన్ దాఖలు చేశారు. అదే సమయంలో ట్రయల్ కోర్టు కూడా తన తీర్పును హైకోర్టుకు రిఫర్ చేసింది. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. దోషులు 30 రోజుల్లో సుప్రీం కోర్టులో అప్పీల్ చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ఏ1 మిర్చీ సెంటర్ వద్ద సంబరాలు

మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు ఘటనా స్థలిలో హడావుడి నెలకొంది. దోషులకు ఏ శిక్ష పడుతుందా అని బాధితులు, నాటి ప్రత్యక్ష సాక్షులు ఉత్కంఠతో ఎదురు చూశారు. హైకోర్టు మరణ శిక్ష ఖరారు చేయగానే సంబరాలు జరుపుకొన్నారు. మృతుల ఆత్మశాంతికి నివాళులర్పించారు. ఏ1 మిర్చి సెంటర్ వద్ద మిఠాయిలు పంచుకున్నారు. కాగా.. ఈ ఘటన జరిగి పన్నెండేళ్లయినా.. ఇంకా ఆ బీభత్సం కళ్లముందే కదలాడుతోందని బాధితులు మీడియాకు చెప్పారు.

అదో పీడ కల

పేలుళ్ల బాధితుడు దుర్గాప్రసాద్

చింతూరు ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటన తనను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని ఒక పీడ కలగా వెంటాడుతోందని అప్పట్లో తీవ్రంగా గాయపడిన అల్లూరి జిల్లా చింతూరుకు చెందిన పురాలేశెట్టి దుర్గాప్రసాద్ తెలిపారు. ఐదుగురికి ఉరి శిక్ష ఖరారు చేస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు ఎలాంటి సహాయం చేయలేదని, ఆదుకోవాలని కోరారు.



కురిడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

'వలంటీర్' పేరిట

వైసీపీ వంచన

- అల్లూరి జిల్లా కురిడి గ్రామంలో పవన్ కల్యాణ్ పర్యటన

పాడేరు/డుంబ్రిగుడ/అరకులోయ/విశాఖపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వలంటీర్ ఉద్యోగం పేరుతో వైసీపీ ప్రభుత్వం యువతను చాలా తెలివిగా వంచించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వలంటీర్ నియామకాలు, వేతనాల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి జీవోలు గానీ, అధికారిక ఉత్తర్వులు గానీ లేవని చెప్పారు. ఆఖరుకు వలంటీర్లకు ఇచ్చిన గౌరవ వేతనం ఏ పద్దు నుంచి ఇచ్చారనేది సైతం తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిని బట్టి.. వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను ఎంత దారుణంగా వంచించిందో అర్థం చేసుకోవాలన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో ఆయన పర్యటించారు. తొలుత స్థానిక శివాలయంలో పూజలు చేసిన ఆయన అనంతరం గిరిజనులతో కలిసి రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ వలంటీర్లుగా పనిచేసిన పలువురు మహిళలు కలిసి.. తమను తిరిగి కొనసాగించాలని అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిపై పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. వలంటీర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్న ఆలోచనతో ఉన్నామని, దీనిపై కేబినెట్‌లో కూడా చర్చించామని తెలిపారు. కానీ, వలంటీర్ల నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులు కానీ, వివరాలు కానీ తమకు లభించలేదన్నారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వద్ద తానే చర్చకు తీసుకువచ్చినట్టు తెలిపారు. వలంటీర్ ఉద్యోగాల పేరిట విద్యావంతులైన యువతను గత వైసీపీ ప్రభుత్వం నిండా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు వలంటీర్లకు వేతనాలు ఎక్కడి నుంచి ఇచ్చారో సంఘం నాయకులను ప్రశ్నించాలని సూచించారు. ఏజెన్సీలో గత వైసీపీ ప్రభుత్వం వంద కిలోమీటర్లయినా రోడ్లు వేయలేదని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ.వెయ్యి కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. మొత్తం వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందన్నారు. వలంటీర్ల నుంచి సాధారణ ప్రజల వరకు త్రిశంకు స్వర్గంలో పెట్టిందని ఆరోపించారు. "నాకు తెలిసినంత వరకు సుమారుగా రూ.25 వేల కోట్ల మేరకు వైసీపీ ప్రభుత్వంలో అవినీతి జరిగింది. దొరినకాడికి దొరికినట్టు దోచేశారు" అనిచెప్పారు.

> "నేను గిరిజనుడిగా పుట్టకపోయి ఉండవచ్చు. కానీ, నాది కూడా గిరిజనుల మనస్తత్వమే"
> - ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఉమ్మడి సాగుకు ఉపాధి హామీ

గిరిజనులకు సుస్థిరమైన ఆదాయం వచ్చేలా ఉమ్మడి వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తొలుత కురిడి గ్రామంలోనే పైలట్ ప్రాజెక్టుగా దీనిని ప్రారంభించనున్నట్టు చెప్పారు. దీనికిగాను అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక సీఎస్ శశిభూషణ్‌కుమార్‌కు అక్కడికక్కడే సూచించారు. ఏజెన్సీ వాతావరణానికి అనువైన స్ట్రాబెర్రీ, యాపిల్, అవకాడో, ఇతర కూరగాయలు ఉమ్మడిగా సాగు చేసేందుకు నిర్ణయం తీసుకోవాలన్నారు. కురిడి గ్రామంలో సుమారు 400 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని, ఉమ్మడి వ్యవసాయం చేసుకుని గిరిజనులు ఉపాధి పొందాలని సూచించారు. ఈ గ్రామమంటే తనకు ఇష్టమని, 2018లో వచ్చినప్పుడు ఇక్కడ పరిస్థితులు, సమస్యలపై అవగాహన ఏర్పడిందని, అందుకే గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. తన సొంత నిధుల నుంచి రూ.5 లక్షలు గ్రామానికి ఇవ్వనున్నట్టు ప్రకటించారు.

మన్యంలో కేరళ తరహా పర్యాటకం

గిరిజన ప్రాంతాల్లో కేరళ తరహాలో పర్యాటకాభివృద్ధికి అవకాశాలున్నాయని పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రకృతికి హాని చేయకుండా, పర్యాటకులను ఆకర్షించడంతోపాటు, స్థానికంగా ఉన్న ఆచారాలు, సంప్రదాయాలను బలోపేతం చేసేలా పర్యాటకాభివృద్ధికి కృషి చేయనున్నట్టు చెప్పారు. పర్యాటకంతో యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు.

విశాఖ పర్యటన రద్దు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విశాఖపట్నం పర్యటన రద్దయింది. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు గాయపడినట్టు సమాచారం రావడంతో విశాఖ కార్యక్రమాలు రద్దు చేసుకుని వెళ్లారు.

కాఫీ తోటల్లో చెక్క వంతెన ప్రారంభం

ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా అరకులోయ మండలం సుంకరమెట్ట కాఫీ ఎస్టేట్స్‌లో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన చెక్క వంతెనను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆ వంతెనపై నడుస్తూ పర్యాటకుల సందర్శన కోసం ఏర్పాటు చేసిన ట్రీడెక్స్, పక్షి గూడు ఆకారంలో ఏర్పాటు చేసిన బర్డ్ నెస్ట్‌లను ఆసక్తిగా తిలకించారు. కాఫీ, అంతర పంటగా మిరియాల సాగుపై ఏపీఎఫ్‌డీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సుజయకృష్ణ రంగారావుతో కలిసి కాఫీ తోటల్లో పవన్‌కల్యాణ్ పనస, మామిడి మొక్కలు నాటారు.



డీఎస్సీపై సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్, విద్యా శాఖ అధికారులు

జూన్ నాటికి విద్యాశాఖ

సంస్కరణలు పూర్తి!

వచ్చే నాలుగేళ్లు ప్రమాణాల పెంపుపైనే దృష్టి

- న్యాయ వివాదాలకు తావు లేకుండా వీలైనంత త్వరగా డీఎస్సీ విడుదల
- ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ ఉండొద్దు
- టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకత
- సమీక్షలో అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశాలు
- కేజీబీవీ టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణలను జూన్ నాటికి పూర్తి చేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో సమీక్షించారు. సంస్కరణలు పూర్తిచేసిన తర్వాత రాబోయే నాలుగేళ్లు విద్యా ప్రమాణాల మెరుగుదలపై దృష్టి సారించాలన్నారు. న్యాయ వివాదాలు రాకుండా వీలైనంత త్వరగా మెగా డీఎస్సీ విడుదలకు సన్నద్ధం కావాలన్నారు. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా టెన్త్, ఇంటర్ ఫలితాలను విడుదల చేయాలని సూచించారు. మన మిత్ర యాప్‌లో కూడా ఫలితాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆగస్టులో జరిగే రాష్ట్రాల విద్యాశాఖ మంత్రుల సదస్సును ఏపీలో నిర్వహించేందుకు కేంద్ర మంత్రి అంగీకరించారని, అందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన ఫలితాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు వివరాలతో మే నాటికి డ్యాష్‌బోర్డు అందుబాటులోకి తీసుకువాలన్నారు. విద్యార్థుల లీప్ యాప్‌ను అపార్ ఐడీతో లాగిన్ అయ్యి చూసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాపౌట్స్ నమోదు కాకూడదన్నారు. సమగ్ర శిక్ష పరిధిలోని పాఠశాలల్లో పారదర్శకంగా అడ్మిషన్లు చేపడుతున్నామని సంబంధిత అధికారులు వివరించారు. కేజీబీవీల్లో టీచర్ల బదిలీలకు మంత్రి ఈ సందర్భంగా ఆమోదం తెలిపారు. అలాగే అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ, ఉపాధ్యాయ శిక్షణ సంస్థ, ఆర్కైవ్స్ మ్యూజియం నిర్మాణాలకు అవసరమైన చర్యలు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టే క్లిక్కర్స్‌ను 9వ తరగతి విద్యార్థులకు అమలు చేయాలని, వాటి వల్లే వచ్చే ఫలితాల ఆధారంగా 6 నుంచి 10 తరగతులకు అమలు చేయాలన్నారు. జీవో 117కు ప్రత్యామ్నాయ జీవోను వీలైనంత త్వరగా విడుదల చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే సమయానికి పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉండాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో పారదర్శకత ఉండాలని, ఎలాంటి పైరవీలకు తావు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు, కృతికా శుక్లా, బి.శ్రీనివాసరావు, దీవన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి: లోకేశ్

ఆంధ్రా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. వర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. 1926లో యూనివర్సిటీని స్థాపించారని, ఈ సందర్భంగా ఈనెల 26 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26 వరకు ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహిస్తామని వీసీ జీపీ రాజశేఖర్ మంత్రికి వివరించారు. ఘన చరిత్ర కలిగిన ఏయూ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి సూచించారు. క్యూఎస్ ర్యాంకింగ్‌లో ఏయూ టాప్-100లోకి రావడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. త్వరలోనే వర్సిటీల్లో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు.

వక్ఫ్ భూములకు ఎసరు

(మొదటి పేజీ తరువాయి)

ఆశ చావలేదు. ఎలాగైనా వాటిని వ్యాపారం పేరిట అస్మదీయులకు కట్టబెట్టి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ భూములకు లబ్ధిదారులవ్వాలనే కుట్రలు, కుయుక్తులకు తెరలేపారు. తెర వెనక మంత్రాంగం నడిపి ప్రభుత్వానికి ఇసుమంతైనా తెలియనీయకుండా వేల ఎకరాల భూములతో వ్యాపారం చేయాలనుకున్నారు. ఇందుకు వక్ఫ్‌బోర్డుతో ఓ నోటీసు ఇప్పించారు. వక్ఫ్ భూములతో వ్యాపారం చేయాలనుకునే వారు ఆసక్తిని (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) లిఖితపూర్వకంగా తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. మే 8వ వరకు గడువు ఇచ్చారు. ఈ దందాలో నలుగురు పెద్దల పాత్ర ఉంది. వారిలో ఇద్దరు అధికారులు, మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు. అందులో ఒకరు వక్ఫ్ వ్యవస్థలో చాలా కీలకమైన వ్యక్తి. ఆయన కనుసన్నల్లోనే భూ మంత్రాంగం నోటీసుదాకా సాగినట్లు తెలిసింది.

జగన్ హయాంలోనే దుస్సాహసం

జగన్ జమానాలో వేల ఎకరాల వక్ఫ్ భూములు పరాధీనమయ్యాయి. నాటి వైసీపీ నేతలు ఈ భూములపై పెద్ద మంత్రాంగం నడిపారు. ఓ కన్సల్టెంట్‌తో వక్ఫ్ బోర్డు భూములపై అధ్యయనం చేయించారు. వాటిని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే ఆదాయం వస్తుందని, అలా వచ్చే ఖర్చుతో ప్రభుత్వ అవసరాలు తీరుతాయని నివేదిక ఇప్పించారు. ఈ నివేదిక ఆధారంగా, వక్ఫ్ భూములను వాణిజ్య అవసరాలకు లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు అనుమతించాలని ఆ నాటి వక్ఫ్‌బోర్డు సీఈవో ప్రతిపాదించారు. అప్పుడు వక్ఫ్‌బోర్డు కూడా లేదు. కేవలం సీఈవో ఆనాటి మైనారిటీ శాఖలోని పెద్దల ఆదేశాలతో ఈ ప్రతిపాదన పంపించారు. ఈ ప్రతిపాదనను చూసి జగన్ కంగుతిన్నారు. ఓటు బ్యాంకుకు ఆయువుపట్టు లాంటి వక్ఫ్ భూములతో వ్యాపారం చేస్తారా? అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రతిపాదనను ముట్టుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు, అంటే 2024 మార్చి నెలకుముందు, జరిగిన పరిణామాలివి.

ధార్మిక ఆస్తులపై సీఎం గైడ్‌లైన్స్..

కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ, దేవదాయ, వక్ఫ్ భూములను కాపాడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ భూముల వినియోగం, రక్షణపై శ్వేతపత్రాలు ఇచ్చారు. గత నాలుగు నెలల క్రితం ముఖ్యమంత్రి వద్ద జరిగిన కీలక సమావేశంలో అధికారులు వక్ఫ్ భూముల ప్రస్తావన తీసుకొచ్చారు. వాటిని వాణిజ్య అవసరాలకు వాడితే ఎలా ఉంటుందన్న ప్రతిపాదన చేయబోగా, సీఎం గట్టిగా వారించారు. "వక్ఫ్ భూములను వాణిజ్య అవసరాలకు వాడొద్దు. వాటిని కమ్యూనిటీ (ముస్లిం వర్గాల) అభివృద్ధి, సంక్షేమం కోసమే వాడాలి" అని స్పష్టం చేశారు. అప్పటికి వక్ఫ్‌బోర్డు నియామకం జరగలేదు. ఈ భేటీలో మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి, కార్యదర్శి, కమిషనర్ స్థాయి అధికారులు మాత్రమే పాల్గొన్నారు. ముస్లిం వర్గాల సంక్షేమం, అభివృద్ధి అంటే ఆ వర్గాల వారికి విద్య, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు విద్యాసంస్థలను నెలకొల్పడం, పరిశ్రమలను ఏర్పాటు చేయడం, ఇంకా ఆర్థికాభివృద్ధిని తీసుకొచ్చే సంస్థలను నెలకొల్పడం వంటి చర్యలు ప్రభుత్వం ద్వారా, మైనారిటీ సంక్షేమశాఖ ద్వారా జరగాలని సీఎం విశదీకరించారు.

వక్ఫ్ భూములపై బోర్డుకు అధికారం లేదు..

సీన్ కట్ చేస్తే.... ఈ నెల 3వ తేదీన వక్ఫ్‌బోర్డు సీఈవో పేరిట ఓ వ్యాపారప్రకటన ఇచ్చారు. తమ వద్ద 1 నుంచి 200 ఎకరాల సామర్థ్యం కలిగిన భూములు ఉన్నాయని, వాటిని వ్యాపార, వాణిజ్య అవసరాలు, అభివృద్ధికి ఉపయోగిస్తామని, మే 8వ తేదీలోగా ఆసక్తి ఉన్న వారు తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, దరఖాస్తు దారులకు ఎలాంటి అర్హత ఉండాలి? వారి ఆదాయం ఎంత ఉండాలి? వారి పూర్వానుభవం ఏవిటి? వారి ఆర్థిక స్థోమత ఎంత ఉండాలి? తదితర అంశాలపై ఆ ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. ఓ క్యూఆర్‌కోడ్ ఇచ్చి దాన్ని స్కాన్‌చేసుకోవాలని చెప్పారు. ఆ కోడ్‌ను స్కాన్‌చేస్తే ఓ డాక్యుమెంట్ వస్తుంది. అందులోనూ ఆసక్తిని కనబరిచేవారికి ఉండే అర్హతలు ఏమిటి, సాంకేతిక పరిమితులు ఏమిటో తెలియజేయలేదు. అంతా సాదాసీదాగా, ఓ చెట్టుకింద సంస్థ ఇచ్చిన ప్రకటనలా ఉంది. దాన్ని చూసిన వారికి ఎవరికైనా దీనికి వెనక ఏదో గూడుపుఠాణి దాగి ఉందన్న అనుమానం వస్తుంది. నిపుణత, అనుభవం అనే శీర్షిక పెట్టారు. కానీ అదెలా ఉండాలో వివరించలేదు. ఆర్థిక స్థిరత్వం ఏమిటో దరఖాస్తుదారులే తెలియజేయాలని పేర్కొన్నారు. అంటే, ఏ ప్రభుత్వ సంస్థ అయినా తమ వద్ద వర్క్ చేయాలనుకునే కంపెనీలు, సంస్థలకు నిర్దిష్ట ప్రమాణాలు, అర్హతలు, అనుభవం ఉండాలని ముందుగానే నిర్ణయిస్తాయి. వాటిని నిర్దేశిస్తూ ఆ ప్రమాణాలకు తగిన వారే దరఖాస్తు చేసుకోవాలని చెబుతాయి. కానీ, ఇది ఇందుకు పూర్తి విరుద్ధంగ ఉంది. ఏదీ చెప్పలేదు. దరఖాస్తు దారులే తమ స్థోమత, ఆదాయం, అనుభవం, నైపుణ్యత వంటివి చెప్పాలని పేర్కొన్నారు. దీన్ని బట్టే అర్థమవుతోంది ఇదెంత డొల్లగా ఉందో! ఈ ప్రకటన గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఆరాతీయగా, విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా, ప్రభుత్వానికి మాటమాత్రమైన చెప్పకుండానే వక్ఫ్‌బోర్డు సీఈవో ఈ ప్రకటన జారీ చేశారు. అయితే, ఇలాంటి ప్రకటనలు ఇచ్చే అధికారం వక్ఫ్‌బోర్డు సీఈవోకు లేదు. వక్ఫ్‌బోర్డు స్వతంత్ర సంస్థ కావొచ్చు. కానీ, దాని పరిధిలోని వేల ఎకరాల భూములను కాపాడుతోంది ప్రభుత్వం. వక్ఫ్‌బోర్డుతో సహా మైనారిటీ సంక్షేమశాఖ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తోంది ప్రభుత్వమే. కాబట్టి ఈ సంస్థ పరిధిలోని ప్రతీ గజం భూమిపై ప్రభుత్వానికే బాధ్యత ఉంటుంది. ఒకవేళ భూముల విషయంలో వక్ఫ్‌బోర్డు ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే విధిగా ఆ ప్రతిపాదనపై ప్రభుత్వాన్ని సంప్రదించాలి. సర్కారుకు అంగీకరించిన తర్వాతే ఏ నిర్ణయం అయినా తీసుకోవాలి. కానీ వక్ఫ్‌బోర్డు ఇవేవీ చేయకుండానే తనకు తానే నోటిఫికేషన్ ఇచ్చింది.

అంతా చీకటి మంత్రాంగం

మైనారిటీ సంక్షేమశాఖలో కీలకస్థానాల్లో ఉన్న నలుగురి పెద్దలకు వక్ఫ్ భూములపై కన్నుపడింది. తాము ఏది చెప్పినా సీఎం వింటున్నారని వారు భావిస్తున్నారు. కాబట్టి వక్ఫ్ భూముల విషయంలో ఏం చేసినా అడిగేవారుండరని అనుకున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో వక్ఫ్ భూముల్లో పెట్రోలు బంకులు, వాణిజ్య భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌ల వంటి వాటికి తమ అస్మదీయులతోనే లీజు ఒప్పందాలు చేయించాలని ముందుగానే నిర్ణయించారు. రాయలసీమలోని భూములను సోలార్, విండ్ ఎనర్జీ కంపెనీలకు ఇచ్చేపేరిట ప్రకటన ఇచ్చినా, అది జరగదని వారికి తెలుసు. ఈ పేరిట వాణిజ్య అవసరాలను నడుపుకోవచ్చన్నది అసలు ఉద్దేశం. అంతే...తమ ఆలోచనలను వక్ఫ్‌బోర్డుపై రుద్దారు. వక్ఫ్ సభ్యులకు పూర్తి సమాచారం ఇవ్వకుండా అంతా మంచికే అని చెప్పి బోర్డులో అనుకూల తీర్మానం చేయించారు. ఆ తర్వాత ఈనెల 3న ప్రకటన ఇప్పించారు. ఈ మొత్తం వ్యవహారంలో మైనారిటీ సంక్షేమంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు, మరో రిటైర్డ్ అధికారి పాత్ర ఉన్నట్లు తెలిసింది. ఇందులో ఓ అధికారి డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. మరొకరు మైనారిటీ సంక్షేమశాఖలో కీలక వ్యక్తి వద్ద పనిచేస్తున్నారు. ఈయన రిటైర్డ్ అధికారి. ఇక నాలుగో వ్యక్తే కీలకం. ఈయన కీలక హోదాలో ఉండి మొత్తం అందరినీ కూడగట్టి వాణిజ్య అవసరాలకు వక్ఫ్ భూముల ప్లాన్‌ను రచించినట్లు తెలిసింది.

పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లకు

సింగిల్ విండో అనుమతులు

- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి
- ఇంటర్నేషనల్ హైడ్రో అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్లకు సింగిల్ విండ్ విధానంలో అనుమతులు ఇస్తున్నామని ఇంటర్నేషనల్ హైడ్రో అసోసియేషన్‌కు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో దేశంలోనే ఏపీని మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తున్నామని చెప్పారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులతో మంత్రి గొట్టిపాటి సమావేశమయ్యారు. పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాల ఏర్పాటుతో పాటు యాజమాన్య నిర్వహణా విధానాలపై సమీక్షించారు. పునరుత్పాదక విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో చాగంటి, రాజుపాలెం, గడికోట, అవవేటిపల్లి, దిన్నెపల్లి ప్రాంతాల్లో సుమారు 5000 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

ఆక్వా సమస్యపై కేంద్రం దృష్టి

- సుంకాల ప్రభావం పడకుండా చూస్తాం
- నేడు భీమవరంలో ఆక్వా రైతు సదస్సు: శ్రీనివాసవర్మ


రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలు రాష్ట్రంలోని ఆక్వా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టే విషయమని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆక్వా రైతు నష్టపోకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికాకు మన దేశం నుంచి ఎగుమతయ్యే రొయ్యల్లో 45-50 శాతం ఏపీ నుంచే వెళతాయన్నారు. ట్రంప్ విధించిన టారిఫ్ ఆక్వా పరిశ్రమకు శరాఘాతంగా మారిందన్నారు. ఈ సమస్యపై వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడానన్నారు. 9వ తేదీన భీమవరంలో ఆక్వా రైతులతో సదస్సు నిర్వహిస్తున్నామని, సుంకాల ప్రభావం నేరుగా ఆక్వా రైతులపై పడకుండా చూస్తామని చెప్పారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఆక్వా పరిశ్రమను కాపాడుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారు.

ఉపాధిలో అంబుడ్స్‌మెన్ ఉన్నట్టా? లేనట్టా?

- జిల్లాల్లో రెన్యువల్ నిలిపివేత..

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతిని నియంత్రించేందుకు ప్రధానంగా పనిచేసే అంబుడ్స్‌మెన్ వ్యవస్థ రాష్ట్రంలో ఉందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి పథకం సజావుగా సాగేందుకు విజిలెన్స్, సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్, అంబుడ్స్‌మెన్ వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ పథకం చట్టం పేర్కొంటోంది. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఈ వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సోషల్ ఆడిట్ డైరెక్టర్‌గా శ్రీకాంత్‌ను, చీఫ్ విజిలెన్స్ అధికారిగా అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి భవానీ హర్షను, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారిగా రిటైర్డ్ ఇంజనీర్ గోపీచంద్‌ను నియమించింది. అయితే అంబుడ్స్‌మెన్ వ్యవస్థను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు మరిచిపోయారు. గత ప్రభుత్వంలో 13 ఉమ్మడి జిల్లాలకు ఒక్కో జిల్లాకు ఒక్కో అంబుడ్స్‌మెన్‌ను నియమించారు. సాధారణంగా అంబుడ్స్‌మెన్‌లను రెండేళ్లపాటు విధుల్లో కొనసాగిస్తారు. అవసరమైతే మరో రెండేళ్లు కొనసాగిస్తారు. రాష్ట్రంలో 8 జిల్లాల అంబుడ్స్‌మెన్‌లకు పదవీకాలం గత ఏడాది జూన్ 30తో ముగిసింది. వారిని తిరిగి కొనసాగించాలంటే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి వారికి రెన్యువల్ ఇవ్వాలి. 9 నెలలవుతున్నా రెన్యువల్ చేయలేదు. తొలగించనూలేదు. దీంతో వారు విధుల్లో ఉన్నారా? లేదా? అనే సందిగ్ధం నెలకొంది. కానీ మొత్తం 13 జిల్లాల్లో అంబుడ్స్‌మెన్‌లు మాత్రం విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం తమను కొనసాగిస్తుందో?, లేదో తమకే తెలియదని వారు పేర్కొంటున్నారు.

చంద్రబాబు ఇంటి నిర్మాణానికి నేడు భూమిపూజ



- ఉదయం 8.50కి ముహూర్తం
- సచివాలయం దగ్గరలో ఐదెకరాల్లో నిర్మాణం

అమరావతి, తుళ్లూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత ఇంటిని నిర్మించుకుంటున్నారు. వెలగపూడి సచివాలయం సమీపాన ఈ-9 రహదారి పక్కనే ముఖ్యమంత్రి కుటుంబం ఐదు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. నాలుగు వైపులా రోడ్లు, సచివాలయానికి, హైకోర్టుకు సమీపంలో ఉండేలా చూసి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో బుధవారం ఉదయం 8.50 గంటలకు చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి భూమి పూజ చేయనున్నారు. ఏడాదిన్నరలో ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని ప్రాంతంలోని ఉండవల్లి కరకట్ట వద్ద చంద్రబాబు నివాసం ఉంటూ పాలన సాగించారు. రాజధాని నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇచ్చిన చంద్రబాబు.. ఇంతవరకూ సొంత ఇంటి నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చాక.. తొలి రోజు నుంచే రాజధానినిర్మాణంపై దృష్టి సారించారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులను పట్టాలు ఎక్కించారు. అమరావతి పనులు గాడిన పడటంతో సొంత ఇంటి వ్యవహారంపై చంద్రబాబు దృష్టి పెట్టారు. పలు ప్రాంతాల్లో స్థలం కోసం అన్వేషించి.. ఎట్టకేలకు వెలగపూడి సచివాలయం వెనుక కిలోమీటర్ దూరంలో ఐదెకరాలు కొన్నారు. సీఎం సొంత ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో రాజధాని ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా, ప్రైవేటు కార్యక్రమం కావడంతో రాజధాని రైతులతో సహా ఎవరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. అయితే సంప్రదాయం ప్రకారం సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు బహూకరిస్తామని వెలగపూడి గ్రామస్తులు చెప్పగా.. పోలీసులు అనుమతించారు.

మంత్రి ఎదుటే బాహాబాహీ

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిపై దాడికి యత్నం
- పులివెందులలో టీడీపీ వర్గాల ఘర్షణ

పులివెందుల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఎదుటే టీడీపీలోని రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగింది. సమావేశం ప్రారంభమవుతుండగా.. వేములకు చెందిన పార్టీ నాయకుడు పార్థసారథిరెడ్డి తమ్ముడు శేషారెడ్డి (బీటెక్ రవి వర్గం) ఒక్కసారిగా.. వేదికపై ఉన్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిపై దాడికి యత్నించారు. క్షణాల్లోనే ఇరువర్గాల కార్యకర్తలు వేదికపైకి దూసుకొచ్చి పెద్దఎత్తున ఈలలు, కేకలు వేయడంతో గందరగోళం నెలకొంది. తోపులాట కూడా జరిగింది. దీంతో వేదికపైన ఉన్న వారందరూ దిగిపోవాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మంత్రి సవిత గట్టిగా చెప్పారు. ఇలాంటి చర్యలు పార్టీకో, చంద్రబాబుకో నష్టం కలుగజేయవని.. మీరే నష్టపోతారని శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. దీంతో గొడవ సద్దుమణిగి సమావేశం ప్రారంభమైంది. జరిగిన చిన్నపాటి ఘర్షణకు ఎవరి మనసైనా నొచ్చుకుని ఉంటే ఉంటే క్షమాపణ కోరుతున్నానని బీటెక్ రవి అన్నారు.



పులివెందులలో ఘర్షణపడుతున్న కార్యకర్తలను మందలిస్తున్న మంత్రి సవిత, శ్రీనివాసరెడ్డి

జగన్... నీ బట్టలూడదీసే రోజులు దగ్గరపడ్డాయి

- నీ పాలనలో 2,866 మందిని వైసీపీ గూండాలు పొట్టన పెట్టుకున్నారు : ఎమ్మెల్యే రాజు ఆగ్రహం



అనంతపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'పోలీసుల బట్టలు ఊడదీస్తానంటున్నావ్... నీ బట్టలూడదీసే రోజులు దగ్గరపడ్డాయనేది గుర్తుంచుకో జగన్' అని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. 'అనంతపురం రేంజ్ డీఐజీ ఒక మహిళ. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఒక మహిళ. ఎవరి బట్టలూడదీస్తావ్? మతిభ్రమించి మాట్లాడుతున్నావా జగన్.! రెండు కుటుంబాల మధ్య జరిగిన సంఘటన నేపథ్యంలో ఒకరు చనిపోయారు. ఆ సంఘటనను రాజకీయం చేస్తావా? శవాల పునాదుల మీద నిర్మించిన పార్టీ వైసీపీ. అలాంటి పార్టీ అధినేత జగన్‌కు చంపడం తెలుసు. చంపి రాజకీయంగా ఎలా వాడుకోవాలో తెలుసు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ వైఎస్ వివేకానందరెడ్డి హత్యే. వై అంటే ఎక్కడైనా... ఎస్ అంటే శవం. లింగమయ్య హత్య కేసులో పోలీసులు చట్టపరంగా అరెస్టు చేశారు. ఈ హత్య పరిటాల కుటుంబానికి సంబంధమనే విధంగా జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు మాట్లాడటం అసంబద్ధంగా ఉంది. చంద్రబాబు సీఎం అయిన తరువాత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, అక్రమ అరెస్టులు చేస్తున్నారని కొందరి పేర్లు చెబుతూ జగన్ మాట్లాడిన తీరు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది' అని రాజు అన్నారు. వైసీపీ పాలనలో 2,866 మందిని ఆ పార్టీ గూండాలు పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. "అప్పిరెడ్డీ, నీ రౌడీ రాజకీయాలు గుంటూరులో చేసుకో. ఇక్కడ వరకూ మాట్లాడితే... ఖచ్చితంగా తోలు తీస్తాం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని వీధి రౌడీల్లా వ్యవహరిస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోరు. జగన్ పర్యటనకు 1,000మందికిపైగా పోలీసులతో భద్రతా చర్యలు తీసుకుంది. శవ రాజకీయాలు చేస్తే ప్రజలు పాతిపెడతారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో జగన్." అని హెచ్చరించారు.

పరామర్శలో అరాచకం!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డగోలుతనం, అరాచకమే! శ్రీసత్యసాయి జిల్లా జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం జగన్ పరామర్శించారు. జగన్ పర్యటన నేపథ్యంలో.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యనేతలు భారీగా జన సమీకరణ చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. వచ్చిన వాళ్లు పద్ధతిగా ఉన్నారా అంటే అదీ లేదు. జగన్ హెలికాప్టర్ దిగింది మొదలు వీరంగం సృష్టించారు. ఈలలు, కేకలు వేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. జగన్ బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో కుంటిమద్ది సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగారు. ఆ క్షణం నుంచే కార్యకర్తలు పూనకం వచ్చినట్లుగా ఊగిపోయారు. బారికేడ్లను తోసేసి ముందుకు దూసుకుపోయారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను లెక్కచేయలేదు. వారిపైనా తిరగబడి... తోసుకుని వెళ్లిపోయారు. ఈ పరిణామంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. వైసీపీ శ్రేణులను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు నానా తంటాలు పడ్డారు. అప్పటికే... వైసీపీ కార్యకర్తలు జగన్ హెలికాప్టర్ చుట్టూ మూగారు. హెలికాప్టర్ డోర్లు లాగి, అందులోని పైలట్ బ్యాగ్‌ను తస్కరించినట్లు కూడా తెలుస్తోంది. పోలీసులు అతి కష్టం మీద జగన్‌ను బయటికి తీసుకొచ్చారు.

అంతా పథకం ప్రకారమేనా...

'భద్రతా వైఫల్యం' అంటూ ప్రభుత్వంపై నిందలు వేసేందుకు వైసీపీ నేతలు పథకం ప్రకారం నడుచుకున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. జగన్ వచ్చింది... హత్యకు గురైన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు! అక్కడ ర్యాలీలు, సభలూ నిర్వహించలేదు. అయినా సరే... హెలిప్యాడ్ వద్దకు కూడా కార్యకర్తలను తరలించారు. పోలీసులు హెలిప్యాడ్‌లోకి అనుమతి పొందిన వైసీపీ ముఖ్యనాయకులను మాత్రమే పంపించారు. కానీ జగన్ హెలికాప్టర్ ల్యాండ్ అవ్వగానే వందలమంది కార్యకర్తలు దూసుకెళ్లారు.



శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది సమీపంలో హెలికాప్టర్‌ను చుట్టుముట్టిన వైసీపీ శ్రేణులు

దెబ్బతినడం నిజమా...: పరామర్శ యాత్ర సందర్భంగా వైసీపీ ఆడిన డ్రామాలన్నీ కొన్ని గంటల్లోనే బట్టబయలయ్యాయి. "పోలీసులు జగన్ పర్యటనకు అడ్డు తగులుతున్నారు. కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. హెలిప్యాడ్‌వద్దకు ఎవరినీ రానివ్వడంలేదు" అంటూ మంగళవారం ఉదయం 11 గంటలకు వైసీపీ ఒక ట్వీట్ చేసింది. ఆ తర్వాత అరగంటలోనే... 'హెలిప్యాడ్ వద్ద కనీస భద్రత కరువు. జనం తాకిడితో దెబ్బతిన్న హెలికాప్టర్ విండ్ షీల్డ్' అంటూ మరో ట్వీట్ పెట్టారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకుంటున్నారని వాపోయిందీ వాళ్లే... అడ్డుకోలేక పోయారని నిందించేదీ వాళ్లే. ఇక... 'విండ్ షీల్డ్ దెబ్బతినింది. దీని వెనుక కుట్ర ఉంది' అని వైసీపీ నేతలు మరో హైడ్రామాకు తెరలేపారు. హెలిప్యాడ్ చుట్టూ బారికేడ్లు పెట్టి... ఏకంగా 250 మంది పోలీసులను మోహరించినా వైసీపీ కార్యకర్తలు అరాచకంగా వ్యవహరించారు. కొందరైతే హెలికాప్టర్‌ను పట్టుకుని వేలాడారు. దీంతో జగన్ సుమారు 15 నిమిషాలపాటు లోపలే ఉండిపోవాల్సి వచ్చింది. పోలీసులు అతికష్టం మీద కార్యకర్తలను పక్కకు తోసేసి... జగన్‌ను బయటికి తీసుకొచ్చారు. జగన్ అక్కడి నుంచి పాపిరెడ్డిపల్లికి వెళ్లిన అరగంటకు...హెలికాప్టర్ బెంగళూరుకు వెళ్లిపోయింది. 'విండ్‌షీల్డ్ దెబ్బతినడంతో వీవీఐపీని తీసుకెళ్లలేమంటూ పైలట్ వెళ్లిపోయారు' అని వైసీపీ నేతలు పేర్కొన్నారు. అయితే... విండ్‌షీల్డ్ దెబ్బతింటే పైలట్ ఎందుకు హెలికాప్టర్‌లో ప్రయాణిస్తారని టీడీపీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. 'పన్ వేకే హెలికాప్టర్‌ను మాట్లాడుకున్నారని కూడా అనుమానిస్తున్నారు.

బాధితులకే ట్రైనింగ్: మృతుడు కురబ లింగమయ్య కుటుంబ సభ్యుల పరామర్శ కూడా చిత్ర విచిత్రంగానే జరిగింది. బాధిత కుటుంబాన్ని సముదాయించి... సంఘటన ఎలా జరిగిందో వారి నుంచి తెలుసుకోవాల్సిన జగన్, రివర్స్‌లో వారికే సంఘటన గురించి ఎలా చెప్పాలో ట్రైనింగ్ ఇచ్చారు. లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి బయటకు వచ్చాక మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు బాబాయ్ వివేకాను గొడ్డలితో నరికి చంపిన తీరును కళ్లారా చూసినట్లు ఎలా చెప్పారో... అదే విధంగా లింగమయ్య హత్య గురించి కూడా వివరించారు.

పోలీసుల బట్టలూడదీస్తాం!

వాళ్ల ఉద్యోగాలు పీకేస్తాం

జగన్ హెచ్చరిక

అనంతపురం/పుట్టపర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): "కొందరు పోలీసులు టీడీపీ నాయకులకు వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. వారి బట్టలూడదీస్తాం. గుర్తుపెట్టుకుని మరీ ఉద్యోగాలు పీకేస్తాం" అని మాజీ సీఎం జగన్ హెచ్చరించారు. శ్రీసత్యసాయిజిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. పోలీసులను హెచ్చరిస్తూ నోరు పారేసుకున్నారు. లింగమయ్యపై 20 మంది దాడిచేస్తే ఇద్దరిపైనే కేసులు పెట్టారని, హత్యకు ప్రేరేపించిన ఎమ్మెల్యే (పరిటాల సునీత), ఆమె కుమారుడు (శ్రీరాం)పై కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ గురించి అనుచితంగా మాట్లాడారు. "సుధాకర్ అనేవాడు వీడియోకాల్ చేసి..ఎమ్మెల్యే, ఆమె కుమారుడితో మా ఎంపీటీసీలచేత మాట్లాడించాడు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భద్రతా వైఫల్యం లేదు!

- 1100 మంది పోలీసులతో భద్రత
- హెలిప్యాడ్ వద్ద 250 మంది పోలీసులు
- రెచ్చగొట్టినా సంయమనం వహించాం
- శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న వెల్లడి



చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎక్కడా భద్రతా వైఫల్యం లేదని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న స్పష్టం చేశారు. నిష్పాక్షికంగా విధులు నిర్వహించామని తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె చెన్నేకొత్తపల్లి సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని, జన సమీకరణ చేయవద్దని వైసీపీ నేతలను కోరాం. కానీ... వాళ్లు పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా జన సమీకరణ చేశారు. సోషల్ మీడియాలోనూ పిలుపు ఇచ్చారు. అయినా పూర్తిస్థాయి భద్రత కల్పించాం. జగన్ పర్యటనకు 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. హెలిప్యాడ్ వద్ద తొలుత 150 మందిని... ఆ తర్వాత జనం ఎక్కువగా ఉన్నారనే ఉద్దేశంతో మరో వందమందిని నియమించాం" అని ఎస్పీ వివరించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారని...ఈ ఘటనకు ప్రధాన కారణం ఇదే అని అన్నారు. కొంతమంది హెలికాప్టర్ డోర్‌ను లాగడంతో అది దెబ్బతిన్నట్లు తెలిసిందన్నారు.

చర్యలు తీసుకోవచ్చు...

పోలీసుల బట్టలూడదీస్తామన్న జగన్‌వ్యాఖ్యల గురించి ప్రస్తావించగా...దానిపై తాను స్పందించనని ఎస్పీ చెప్పారు. "పోలీసు యూనిఫాం మేము కష్టపడి సాధించుకున్నది. ఎవరో ఇచ్చింది కాదు. విధి నిర్వహణలో తప్పు చేసి ఉంటే సర్వీస్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. జగన్ పర్యటనలో వైసీపీ నాయకులు పోలీసులను కవ్వించినా ఎక్కడా సంయమనం కోల్పోలేదు" అని ఎస్పీ తెలిపారు. లింగమయ్య హత్యకేసు విచారణలో సక్రమంగా వ్యవహరించడంలేదన్న ఆరోపణలను తోసిపుచ్చారు. హత్య జరిగిన 48గంటల్లో నిందితులను అరెస్టు చేశామన్నారు.

హత్యా రాజకీయాల కోసమే జగన్ పర్యటన

- 'వైఎస్' ఫ్యామిలీ వందలాది మంది ప్రాణాలు తీసింది: సత్యకుమార్

అనంతపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో దళితుడిని చంపి, డోర్ డెలివరీ చేసిన వారిని వెనకేసుకొచ్చి కాపాడిన సంస్కృతి జగన్‌దే' అని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. అనంతపురంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు నాంది పలికింది జగన్ కుటుంబమే. జగన్ ఫ్యామిలీ వందలాది మంది ప్రాణాలు తీసింది. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన హత్యతో రాజకీయాలు చేయడానికే జగన్ వచ్చారు. తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసిన జగన్ చరిత్ర అందరికీ తెలుసు. అలజడి, వైషమ్యాలు, విద్వేషాలు సృష్టించేందుకే జగన్ పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఎన్నికల్లో 11 సీట్లతో ప్రజలు గట్టి గుణపాఠం చెప్పినా జగన్ వ్యవహార శైలిలో మార్పు రాలేదు' అని సత్యకుమార్ విమర్శించారు.

పీఎం ఉజ్వల్‌లోకి 65 లక్షల మంది

- రాష్ట్రానికి ఏటా 587 కోట్ల సబ్సిడీ: మంత్రి మనోహర్



కేంద్ర ఇంధన శాఖ మంత్రి హర్దీప్ పూరితో సమావేశమైన మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద రాష్ట్రంలోని 65.40 లక్షల మందిని దీపం2 పథకం లబ్ధిదారులుగా చేర్చే అవకాశం ఉందని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఈ విషయమై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్‌పూరితో చర్చించగా.. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఫలితంగా దీపం-2 పథకంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.587 కోట్లు సబ్సిడీ రూపంలో వస్తాయన్నారు. మంగళవారం కేంద్ర మంత్రులు హర్‌దీప్‌సింగ్‌పూరి, ప్రహ్లాద్ జోషితో నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. అనంతరం ఏపీ భవన్‌లో మాట్లాడారు. పీడీఎస్, టెక్నాలజీ వినియోగం, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండటం తదితర అంశాలపై ప్రహ్లాద్ జోషితో చర్చించినట్టు చెప్పారు. భారత్ రైస్, భారత్ దాల్, తదితర ఉత్పత్తుల మార్కెటింగ్‌పై మంత్రితో చర్చించానన్నారు. ఇతర దేశాలకు బియ్యం ఎగుమతికి అవకాశం కల్పిస్తామని జాతీయ వినియోగదారుల సంస్థ ఎండీ జోసఫ్ హామీ ఇచ్చారని తెలిపారు.

కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా 'కొత్తపల్లి' బాధ్యతలు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు మంగళవారం తాడేపల్లిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాలుగు నెలల కిందట ఆయన్ను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కానీ పలు కారణాలతో ఆయన ఇంతకాలం బాధ్యతలు తీసుకోలేదు.

'టీడీఆర్' కుంభకోణంపై చర్యలు: మంత్రి అనగాని

తిరుపతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై వేగంగా చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. తిరుపతి, విశాఖపట్నం తదితర చోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణాలు జరిగాయన్నారు. ప్రభుత్వం వాటిపై విచారణకు కమిటీ వేసిందని, త్వరలోనే వాస్తవాలు బయటకొస్తాయని అన్నారు. తిరుపతిలో జారీ అయిన 443లో 165 బాండ్లను పక్కన పెట్టామన్నారు.

వృద్ధి రేటుంటే సూపర్ 6 ఏవీ?: బొత్స

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృద్ధిరేటు 8.2 శాతం ఉంటే సూపర్-6 పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. 'రాష్ట్రంలో వృద్ధిరేటు 8.2 శాతం ఉందని సీఎం చంద్రబాబు అసత్యాలు చెబుతున్నారు. వాస్తవంగా కూటమి పాలనలో ఆదాయం గతంలో కంటే 32 శాతం తగ్గింది.' అన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచండి

- పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారుకు తెలియజేయాలి
- పరిష్కరించిన వాటికి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- గ్రీవెన్స్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు
- 90 శాతం ఫిర్యాదులు మూడు శాఖల్లోనే..

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో వేగాన్ని పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం గ్రీవెన్స్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు, ఎప్పటికప్పుడు దరఖాస్తుదారునికి గ్రీవెన్స్ స్థితిని వివరించాలన్నారు. పరిష్కరించగలిగే వినతులను నిర్దిష్ట కాలవ్యవధిలోనే పూర్తి చేయాలని, పరిష్కరించలేనివి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో దరఖాస్తుదారునికి స్పష్టంగా, సున్నితంగా, అర్థమయ్యేలా వివరించాలని నిర్దేశించారు. పరిష్కరించలేని వినతుల విషయంలో అధికారుల వ్యవహార శైలి సౌమ్యంగా లేనప్పుడు ప్రజల నుంచి ఆగ్రహాన్ని ఎదుర్కొనాల్సి వస్తుందని గుర్తించాలన్నారు. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరు తప్పనిసరిగా తీసుకోవాలని, తద్వారా నకిలీ ఫిర్యాదులను, అధికార యంత్రాంగాన్ని తపుదోవపట్టించేవాటిని నివారించవచ్చని స్పష్టం చేశారు. వ్యవస్థను దుర్వినియోగపరిచేలా, యంత్రాంగాన్ని దారి మళ్లించేలా చేసేవారిపై చర్యలు తీసుకునేలా వివరాలను సమీకరించాలని ఆదేశించారు. వినతులు పరిష్కరించిన తర్వాత దరఖాస్తుదారుని నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. వారి సూచనలను కూడా పరిగణనలోనికి తీసుకుని భవిష్యత్తులో అమలు చేయాలని నిర్దేశించారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా ఫిర్యాదుదారుతో మాట్లాడాలని, దీనిద్వారా జిల్లాలో ఎక్కువగా వచ్చే సమస్యలు ఏమిటో కలెక్టర్లకు అర్థమవుతాయని చంద్రబాబు చెప్పారు.

90% రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ శాఖల్లోనే..

రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ శాఖల్లో 90 శాతం ఫిర్యాదులు ఉంటున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం రీ-సర్వేలో నిబంధనలను ఉల్లంఘించడంతో భూసంబంధిత ఫిర్యాదులు భారీగా పెరిగాయన్నారు. రికార్డుల్లో భూయజమాని పేరు మారిపోవడం, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో పేర్లను మార్చేయడం వల్ల సమస్యలు పెరిగాయని చెప్పారు. విస్తీర్ణంలో తేడాలు రీసర్వేలో బాగా కనిపించాయన్నారు. పోలీసు శాఖకు సంబంధించి ఆస్తి తగాదాలు, ఆర్థిక నేరాలతో కూడిన ఫిర్యాదులు అత్యధికంగా వస్తున్నాయని చెప్పారు. సైబర్ క్రైమ్ పెరిగిపోయిందని, ఈ మోసాలు చాలా ఎక్కువగా నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ శాఖలో ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ, నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడం, అనధికార నిర్మాణాలు, ఆస్తి పన్నుల ఫిర్యాదులు అధికంగా ఉన్నాయన్నారు. వీటన్నింటిపైనా అప్రమత్తంగా వ్యవహరిస్తూ సాధ్యమైనంత త్వరగా వినతులు పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.



విజయవాడలో పూర్తిస్థాయి పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కీర్తివర్దన్ సింగ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమ తదితరులు

బెజవాడలో పూర్తిస్థాయి పాస్‌పోర్టు కార్యాలయం

- ఇకపై పాస్‌పోర్టు ముద్రణ, జారీ ఇక్కడే.. ప్రారంభించిన కేంద్ర మంత్రి

విజయవాడ(వన్‌టౌన్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఇకనుంచి పూర్తిస్థాయిలో సేవలు అందించనుంది. ఇకపై ఇక్కడే పాస్‌పోర్టు ముద్రణ, జారీ వంటి ఇతర సేవలను దరఖాస్తుదారులు పొందనున్నారు. ఈ మేరకు స్థానిక బందరు రోడ్డులోని స్టాలిన్ భవన్‌లో పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయం నూతన భవనాన్ని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో పాస్‌పోర్టు సేవా కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఇకపై ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలోనే ప్రింటింగ్, ఇతర అన్ని రకాల సేవలను అందిస్తారని చెప్పారు. సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక కార్యాలయ నిర్మాణం కోసం 2 ఎకరాలు కేటాయించారని చెప్పారు. మోదీ హయాంలో ఆర్థిక అభివృద్ధి జరిగిందని, చాలా రాష్ట్రాల్లో యువతకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వృద్ధి రేటులో గుజరాత్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖపట్నంలో ప్రాంతీయ కార్యాలయం ఉందని, ఇప్పుడు విజయవాడలో కూడా ఆ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అమరావతిలో కూడా ఒక పాస్‌పోర్టు కార్యాలయం నిర్మాణం జరుగుతుందని తెలిపారు. కాగా, ఇన్నాళ్లు పాస్‌పోర్టు ముద్రణ, జారీ కోసం విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయానికి పంపించేవారు. ఇప్పుడు ఈ సేవలను కూడా విజయవాడలోనే అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తమవుతోంది.

నాయకుల్లో నైరాశ్యం నిజమే

- కష్టపడినవారికి సముచిత స్థానం: పల్లా



తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'నామినేటెడ్ పదవులు ఆశించిన నాయకుల్లో నైరాశ్యం ఉంది. ఎవరు కాదన్నా ఔనన్నా ఇది చర్చించుకోవాల్సిన అంశమే' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కోసం కష్టపడినవారికి సముచిత స్థానం కల్పించేందుకు నాయకత్వం కృషిచేస్తోందని చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీలోని సీనియర్లు, సామాజికవర్గాలు, కూటమి పార్టీల వాటాలు.. ఇలా అనేక సమీకరణలతో పదవుల భర్తీ ఆలస్యమవుతోందన్నారు. కొన్ని పదవులు రాష్ట్రం యూనిట్‌గా, మరికొన్ని జిల్లా యూనిట్‌గా తీసుకుని ఇవ్వాల్సి ఉంటుందని.. త్వరలోనే అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని తెలిపారు. తిరుమల కొండపై గతంలో ఇష్టారాజ్యంగా చేయడం వల్లే వైసీపీని 11 సీట్లకే దేవుడు పరిమితం చేశాడని.. ఇంకా కొందరు మిడిసిపడుతున్నారని, వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. ముస్లిం సోదరులకు అండగా ఉండాలనే వక్ఫ్ బిల్లుకు పార్లమెంటులో మద్దతు పలికామన్నారు. రెండు నాల్కలతో వ్యవహరించిన వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

దేశానికి కాంగ్రెస్ ఎంతో అవసరం

- రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి: షర్మిల



అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేశానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో అవసరమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. అహ్మదాబాద్‌లో మంగళవారం ప్రారంభమైన కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడారు. 'జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడాల్సిన అవసరం ఉంది. బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది. ఆ పార్టీకి తెలిసిందల్లా విభజించి పాలించడమే. మతం పేరుతో మంట పెట్టి చలి కాచుకోవడం ఆపార్టీకి అలవాటు. ఎన్నికల సంఘంతో సహా వ్యవస్థలన్నింటినీ సొంత అవసరాలకు వాడుకుంటోంది. దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఆహ్వానిస్తున్నాం. ప్రతి నెలా భారీ కార్యక్రమాలు ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని షర్మిల తెలిపారు.

పీ4 పటిష్ఠ అమలుకు ప్రత్యేక సొసైటీ

(మొదటి పేజీ తరువాయి)

కమిటీకి జిల్లా మంత్రి చైర్మన్‌గా, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉంటారు. గ్రామ, వార్డు విభాగాల్లో సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ఆ బాధ్యతలు చూస్తారు. రాష్ట్ర స్థాయి సొసైటీ ఏర్పాటు, పీ4 పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రతిజిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని చెప్పారు. దాతలు ఎవరు, ఎంత మొత్తం ఇచ్చారు, ఇంకెంత సాయం బంగారు కుటుంబాలకు అవసరం అనే విషయాలన్నీ వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే పథకం అమలు పారదర్శకంగా ఉంటుందని, పీ4పై విశ్వాసం మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

టార్గెట్ 5 లక్షల కుటుంబాలు: ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికి అనుగుణంగా మార్గదర్శి, బంగారు కుటుంబాల నమోదు చేపడుతున్నట్టు సమీక్షలో అధికారులు వివరించారు. ఇందుకోసం విఎలాప్, డొనేట్‌కార్ట్, రంగ్‌దే సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాయని చెప్పారు. సాయం చేయదలచుకొన్న వారికి ఆన్‌లైన్ ద్వారా కూడా సాయమందించే ఏర్పాటు చేస్తామన్నారు. దాతలు ముందుగా పీ4 ప్లాట్‌ఫామ్ ద్వారా లాగిన్ అవడంతో ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆగస్టు నాటికి నమోదు ప్రక్రియ పూర్తిచేసి సాయం కార్యరూపం దాల్చేలా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు నిర్దేశించారు.

చంద్రబాబు విజన్‌తో పేదరిక నిర్మూలన: మంత్రి డోలా

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తన విజన్‌తో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. సామాజిక న్యాయం, సాధికారితపై కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ అధ్యక్షతన ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి చర్చా కార్యక్రమం 'చింతన్ శివిర్'లో ఆయన పాల్గొన్నారు. మంగళవారం రెండో రోజు సమావేశానికి హాజరైన మంత్రి డోలా ఏపీలో అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. దీన్ని ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఆసక్తిగా తిలకించారు.అనంతరం డోలా మాట్లాడుతూ విజన్-2047లో భాగంగా పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు ఉగాది రోజున పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. సమాజంలోని ధనవంతులు నిరుపేదల అభివృద్ధికి సహకరించడమే దీని ఉద్దేశమన్నారు. తమ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థ తీసుకొచ్చి, ఈగల్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో డీఏడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీయేనన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అనుసంధానంతో పారిశుధ్య నిర్వహణను నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



ప్రధాని మోదీతో ముద్ర లబ్ధిదారులు

జూట్ బ్యాగులు తయారుచేస్తున్నా

- బ్యాంకు రూ.రెండు లక్షల ముద్రా రుణం ఇచ్చింది
- సకాల రుణ చెల్లింపుతో మరో 9.5 లక్షలు ఇచ్చారు
- వ్యాపారాన్ని విస్తరించా.. నా వద్ద 15మంది పనిచేస్తున్నారు
- ప్రధానికి తెలిపిన ఏపీకి చెందిన ముద్రా లబ్ధిదారు
- ముద్రా యోజనకు పదేళ్లు... మహిళలతో మోదీ భేటీ
- రూ.33 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమ్మిళిత సామాజిక వృద్ధిని, ఆర్థికస్వేచ్ఛను ముద్రా రుణాలు మహిళలకు అందించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చి పదేళ్లు అయిన సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని తన అధికార నివాసంలో ముద్రా రుణాల లబ్ధిదారులతో ప్రధాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక మహిళతో ప్రధాని సంభాషించారు. ముద్రా రుణాల వల్ల తనకు కలిగిన లబ్ధిని మోదీకి ఆమె వివరించారు. "2009లో నాకు పెళ్లయింది. 2019 వరకు ఇంటికే పరిమితం అయ్యాను. ఆ ఏడాదే జనపనార సంచుల వ్యాపారం ప్రారంభించాను. దీనికోసం ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో పదమూడురోజుల పాటు శిక్షణ తీసుకున్నాను. ముద్రా యోజన కింద కెనరా బ్యాంకు ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకున్నాను. బ్యాంకు రుణ మంజూరు కోసం ఎటువంటి పూచీకత్తూ అడగలేదు. రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించడంతో 2022లో కెనరా బ్యాంక్ అదనంగా రూ.9.5 లక్షలు మంజూరు చేసింది. ఆ డబ్బులతో నా వ్యాపారాన్ని మరింతగా విస్తరించాను." ప్రధాని మోదీకి ఆమె తెలిపారు. 'మీ వద్ద ఎంతమంది పనిచేస్తున్నార'ని ప్రధాని ఆరా తీశారు. ప్రస్తుతం తన కింద 15 మంది పనిచేస్తున్నారని ఆమె బదులిచ్చారు. కాగా, దశాబ్ద కాలంలో రూ. 33 లక్షల కోట్లను రుణాలరూపంలో ముద్రా లబ్ధిదారులకు ఇచ్చినట్టు ప్రధాని తెలిపారు. "ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించేస్థాయికి యువతను ఎదిగించడం ముద్రా రుణాల లక్ష్యం. పారిశ్రామిక, వ్యాపార స్ఫూర్తిని మహిళల్లో నింపాలనేది మా ప్రయత్నం. నిర్లక్ష్యానికి గురైనవారికి ఆర్థిక చేయూతను అందించాం. వారికి ఉన్న అనేక కలలను నిజం చేశాం." అని మోదీ వివరించారు. ఈ పథకం నుంచి మహిళలు ఏ మేరకు లబ్ధి పొందారనేది నేరుగానే తెలుసుకుంటానని చెప్పారు. తలుచుకుంటే భారతీయులకు అసాధ్యం అనేది లేదనేది ముద్రా పథకం రుజువు చేసిందని 'ఎక్స్' ఖాతాలో ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ పథకం నుంచి మహిళల్లో 70 శాతం మంది లబ్ధి పొందారని, అందులోనూ ఎస్సీ,ఎస్టీ, ఓబీసీలు అధికంగా ప్రయోజనం పొందారని ఆయన వివరించారు. కాగా, వ్యక్తిగత రుణ సంస్థలైన షెడ్యూలింగ్ కమర్షియల్ బ్యాంకులు (ఎస్‌సీబీలు), రీజినల్ రూరల్ బ్యాంకులు (ఆర్ఆర్‌బీలు), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్ఎఫ్‌సీలు), మైక్రో ఫైనాన్స్ ఇనిస్టిట్యూట్‌లు (ఎమ్ఎఫ్ఐలు) ముద్రా రుణాలను సమకూర్చుతున్నాయి. తయారీ, వాణిజ్యం, సేవలు, వ్యవసాయ సంబంధ కార్యకలాపాలు, చిన్న వ్యాపారాలు.. ఇలా ఏదో ఒక పని చేస్తున్నవారికి చేయూతను అందిస్తున్నాయి. కాగా, నిజంగానే నారీశక్తిని ముద్రా రుణాలు శక్తివంతం చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కాగా, ముద్రా రుణాలను నాలుగు కేటగిరీల్లో మంజూరు చేస్తారు. శిశు కేటగిరీలో రూ.50 వేలు, కిశోర రూ.50వేలు-రూ.ఐదులక్షలు, తరుణ రూ. ఐదు లక్షలు- రూ.పది లక్షలు అందిస్తారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినవారికోసం తరుణ ప్లస్ కేటగిరీని సృష్టించారు. వీరికి రూ. 20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన వారిని తరలిస్తున్న సహాయక సిబ్బంది

పవన్ చిన్న కుమారుడికి గాయాలు

- సింగపూర్ స్కూల్‌లో అగ్నిప్రమాదం..
- ఏడేళ్ల మార్క్ శంకర్ చేతులు, కాళ్లపై బొబ్బలు
- మన్యం పర్యటన ముగించుకుని సింగపూర్‌కు డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడు. మంటల కారణంగా చేతులు, కాళ్లపై బొబ్బలు ఏర్పడ్డాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరుకోవడంతో శ్వాస సంబంధిత సమస్యను ఎదుర్కొన్నాడు. ఏడేళ్ల మార్క్ శంకర్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు జనసేన పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, ఈ ఘటనలో పదేళ్ల విద్యార్థిని మృతి చెందగా.. మరో 20 మంది వరకు గాయపడ్డారు. వీరిలో 15 మంది వరకు చిన్నారులు ఉన్నారు. అగ్నిప్రమాదం జరిగిందని తెలిసినప్పుడు అరకు పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. మంగళవారం రాత్రి 9:30 గంటలకు సింగపూర్ బయల్దేరి వెళ్లారు.

అసలు ఏం జరిగింది..?

సింగపూర్‌లోని సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ) సమీపంలోని రివర్ వ్యాలీ రోడ్డులో మూడు అంతస్థుల భవనం ఉంది. దీనిలో పలు దుకాణాలతోపాటు.. చిన్నారులకు రోబోటిక్ ఇనిస్టిట్యూట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే 30 మంది స్కూల్ పిల్లలకు సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వారిలో పవన్ కుమారుడు మార్క్ శంకర్ కూడా ఉన్నాడు. ఈ క్రమంలో స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ భవనంలో ఒక్కసారిగా మంటలు రాజుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనపై సమాచారం అందగానే సింగపూర్ హోంశాఖ మంత్రి కె. షణ్ముగం హుటాహుటిన స్పందించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఫైర్ ఇంజన్లను రంగంలోకి దింపారు. అయితే.. సహాయక చర్యలు చేపట్టే సమయానికే 10 ఏళ్ల బాలిక మంటల్లో చిక్కుకుని మృతి చెందినట్టు మంత్రి తెలిపారు. ఈ ఘటనలో మరో 20 మంది వరకు గాయపడ్డారని, వీరిలో 15 మంది చిన్నారులే ఉన్నారని సింగపూర్ పౌర రక్షణ దళం ఫేస్‌బుక్‌లో పేర్కొంది. ఇదిలావుంటే.. ఈ ఘటనకు సంబంధించి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. భవనం మూడో అంతస్తు నుంచి దట్టమైన పొగ బయటకు రావడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపించింది. ఆ సమయంలో చిన్నారులు.. ప్రాణభయంతో అరుపులు కేకలు పెట్టారు. ఈ సమయంలో కొందరు భవన నిర్మాణ కార్మికులు, స్థానికులు పరంజాల ద్వారా భవనంపైకి ఎక్కి వారిని రక్షించే ప్రయత్నాలు చేయడం వీడియోలో కనిపించింది. ఈలోగా అక్కడకు చేరుకున్న అగ్నిమాపక వాహనాలు.. మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశాయి. ఆదేసమయంలో కొందరు ఆయా వాహనాలకు ఉన్న నిచ్చెనల ద్వారా మూడో అంతస్తుకు చేరుకుని బాధిత చిన్నారులను బయటకు తీసుకువచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు.. భవనంలోని మరో 80 మందిని అక్కడ నుంచి బయటకు తరలించారు. అగ్నిప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్టు కేకే ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ శశికుమార్ గణపతి తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని.. దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

అందరికీ ధన్యవాదాలు..

మార్క్ శంకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పవన్ కల్యాణ్ తెలిపారు. తన కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. 'ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు, ఏపీ ఉపసభాపతి రాఘురామకృష్ణరాజు, రాష్ట్రమంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, బీజేపీ బీసీ మోర్చ అధ్యక్షులు లక్ష్మణ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, మిగతా ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు నా తోటి నటీనటులు.. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జన సైనికులు, నాయకులు, కార్యకర్తలు కూడా మా బాబు కోలుకోవాలని పూజలు చేస్తున్నారు. వారందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని పవన్ పేర్కొన్నారు.

గవర్నర్ దిగ్భ్రాంతి

సింగపూర్ అగ్ని ప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ గాయపడిన విషయంపై రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

మార్క్ త్వరగా కోలుకోవాలి చంద్రబాబు, లోకేశ్ ఆకాంక్ష

సింగపూర్ స్కూల్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన విషయం తనకు ఆందోళన కలిగించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. కాగా.. 'పవన్ అన్న తనయుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఇంత జరిగినా.. ఇచ్చిన మాట కోసం!

'అటవితల్లి బాట' కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కు సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం గురించి తెలియగానే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందరు అధికారులు, జనసేన నాయకులు ఆయనను తక్షణమే సింగపూర్‌కు వెళ్లాలని సూచించారు. అయితే.. అరకు సమీపంలోని కురిడి గ్రామం సందర్శిస్తానని ఆ గ్రామ గిరిజనులకు తాను మాట ఇచ్చానని, కాబట్టి ఆ గ్రామం వెళ్లి వారితో మాట్లాడి, అక్కడి సమస్యలు తెలుసుకున్నాకే సింగపూర్ వెళ్తానని పవన్ స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభానికి ఏర్పాట్లు చేసినందున వాటిని పూర్తి చేసి వెళ్తానని తెలిపారు. అనంతరం ఆయన కురిడి గ్రామంలో పర్యటించారు. దీని తర్వాత విశాఖలోనూ పవన్ పర్యటించాల్సి ఉంది. అయితే.. విశాఖ పర్యటన రద్దు చేసుకుని సింగపూర్ వెళ్లనున్నారని జనసేన వర్గాలు తెలిపాయి.

ప్రధాని ఫోన్

పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డాడని తెలుసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ఉపముఖ్యమంత్రికి ఫోన్ చేసి పరామర్శించారు. ప్రమాద ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమయంలో ధైర్యంగా ఉండాలని పవన్‌కు సూచించారు. సింగపూర్‌లో ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధాని తెలిపారు.



ప్రమాదం జరిగిన భవంతి నుంచి కమ్ముకున్న పొగ

అకీరా పుట్టిన రోజు నాడే..
ఇలా జరగడం బాధాకరం: పవన్

తన పెద్ద కుమారుడు అకీరా పుట్టినరోజు నాడే.. చిన్న కుమారుడు అగ్నిప్రమాదంలో గాయపడడం చాలా బాధాకరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తన చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాద విషయం తెలిసినప్పుడు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నానని, వెంటనే సింగపూర్‌లోని భారత హైకమిషన్‌తో మాట్లాడానని, వారు అక్కడ ఏం జరిగిందో తెలుసుకుని చెప్పడంతోపాటు, అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారని తెలిపారు. 'అరకు గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ కార్యక్రమంలో ఉండగా.. ఉదయం మార్క్ శంకర్‌కు అగ్నిప్రమాదంలో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని ఫోన్ వచ్చింది. తొలుత చిన్నపాటి ప్రమాదమమేనని అనుకున్నా. ఇంతస్థాయిలో ఉంటుందని ఊహించలేదు. బాబును ఆసుపత్రిలో చేర్పించి బ్రాంకోస్కోపి చేస్తున్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో 30 మంది చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఒక చిన్నారి మృతిచెందడం బాధించింది. మార్క్ శంకర్ పక్కనే కూర్చున్న చిన్నారి శరీరం కాలిపోయింది. మా బాబు చేతికి, కాలికి గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి బాగా పొగవెళ్లింది. ఆరోగ్యానికి పెద్ద ప్రమాదమేమి లేకపోయినా.. ఊపిరితిత్తులను పొగ నిండుకోవడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశముందని డాక్టర్లు అంటున్నారు. బాబు వయసు ఏడేళ్లు. ఈ రాత్రి 9:30 గంటలకు సింగపూర్‌కు బయల్దేరి వెళ్తున్నా. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి భవన నిర్మాణ కార్మికులు స్పందించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ ఫోన్ చేసి పరిస్థితి గురించి వాకాబు చేశారు. సింగపూర్, భారత హై కమిషనర్లతో మాట్లాడి వివరాలు తెలియజేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు. మీటింగ్‌లో ఉండగానే సీఎం చంద్రబాబు ఫోన్ చేసి వివరాలు అడిగారు. మంత్రులు నారా లోకేశ్, అనితలు కూడా ఫోన్ చేసి అడిగారు' అని చెప్పారు.

'మ్యాచింగ్ గ్రాంట్ల' అక్రమాలు!

- 700 మంది ఉద్యోగులను తొలగించిన 'ఫ్యానీ మే' సంస్థ
- తానా సహా ఇతర తెలుగు సంఘాలతో ఉద్యోగుల కుమ్మక్కు

విజయవాడ, ఏప్రిల్ 8: అమెరికాలోని తెలుగు సంఘాలపై అక్రమాల ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫెడరల్ కంపెనీ 'ఫ్యానీ మే' గత రెండు రోజుల్లో 700మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. 200 మందిని 'నైతిక' కారణాలతో తొలగించినట్టు సంస్థ అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే, వీరిలో ఎక్కువమంది తెలుగు వారే ఉన్నట్టు తెలిసింది. సంస్థ పేర్కొన్న వివరాలను బట్టి.. కొందరు ఉద్యోగులు 'మ్యాచింగ్ గ్రాంట్' నిధుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. మరికొందరు దుర్వినియోగం చేశారు. ఇంకొంత మంది ఉద్యోగులు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) సహా మరికొన్ని సంఘాలతో కుమ్మక్కయి కంపెనీని మోసం చేశారని సంస్థ ఆరోపించింది. మంగళవారం ఉద్యోగాలు కోల్పోయిన వారిలో ఒకరు తానా ప్రాంతీయ ఉపాధ్యక్ష పదవిలో ఉన్నారు. మరొకరు.. అమెరికా తెలుగు సంఘం (ఆటా) మాజీ అధ్యక్షుని జీవిత భాగస్వామి. కాగా, తమ సంస్థను మోసం చేసిన వాటిలో తానా ఒక్కటే లేదని.. ఇతర సంస్థలు కూడా ఉన్నాయని 'ఫ్యానీ మే' వర్గాలు తెలిపాయి.

కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో.. మాయమవుతున్న ఫేక్ వీడియోలు

- వరుసగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రాణభయంతో జింకలు పరుగులు పెడుతున్నట్టు, నెమళ్లు ఏడుస్తున్నట్టు ఫొటోలు, వీడియోలను తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేసిన వేలాది మంది.. ప్రస్తుతం వాటిని డిలీట్ చేస్తున్నారు. ప్రకృతి, పర్యావరణ విధ్వంసం పేరిట ఏఐ ఆధారిత నకిలీ ఫొటోలు, వీడియోలను కొందరు సృష్టిస్తే.. వాటిని నిజమని నమ్మి పలువురు ప్రముఖులతో పాటు వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, చోటా మోటా నాయకులు, పర్యావరణ ప్రేమికులు వాటిని వైరల్ చేశారు. ఈ వ్యవహారం ఢిల్లీని సైతం తాకింది. అక్కడ కూడా వీటిని రీట్వీట్ చేయడంతో.. ఫేక్ ఫొటోలు తెలంగాణ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేశాయి. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఫేక్ ఫొటోలు, వీడియోలను సృష్టించిన వారితోపాటు వాటిని ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇందుకు సంబంధించి పెద్దసంఖ్యలో కేసులు నమోదయ్యాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ సోషల్ మీడియా బాధ్యతలు చూస్తున్న మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్ తదితరులకు పోలీసులు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. ఇలాంటి పోస్టులు పెట్టిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు తాము పెట్టిన పోస్టులను డిలీట్ చేశారు. ప్రస్తుతం వేలాది సోషల్ మీడియా ఖాతాల నుంచి ఫేక్ పోస్టులు డిలీట్ అవుతున్నట్లు గుర్తించారు.

అడిగినంత ఇవ్వకుంటే.. అంతుచూస్తామని బెదిరించారు

- స్టోన్ క్రషర్ యజమాని నుంచి సొమ్ము వసూలుకు కుట్ర
- హైకోర్టులో ఏజీ దమ్మాలపాటి
- రజని, గోపి, రామకృష్ణ వ్యాజ్యాలపై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే విడదల రజని అడిగినంత సొమ్ము చెల్లించకుంటే అంతుచూస్తామని.. స్టోన్ క్రషర్‌ను, క్వారీని మూసివేయిస్తామని క్వారీ యజమానులను ఆమె మరిది గోపి, పీఏ రామకృష్ణ బెదిరించారని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. వారిని బెదిరించి రజని రూ 2 కోట్లు, అప్పటి ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌వీఈవో) రూ.10 లక్షలు, గోపి రూ.10 లక్షలు వసూలుచేశారని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజిలెన్స్ తనిఖీ పేరుతో తనను బెదిరించి, రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారని పల్నాడు జిల్లా యడ్లపాడులోని లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ నల్లపనేని చలపతిరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రజని, మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ రజని, ఆమె మరిది గోపీనాథ్, పీఏ దొడ్డా రామకృష్ణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు రాగా.. ఏసీబీ తరఫున ఏజీ వాదనలు వినిపించారు. అంతుచూస్తామని బెదిరించి వసూళ్లకు పాల్పడిన నేపథ్యంలో పిటిషనర్లకు ఐపీసీ సెక్షన్ 386 వర్తిస్తుందన్నారు. 'రికార్డులను పరిశీలిస్తే విడదల రజని సూచనల మేరకే ఐపీఎస్ అధికారి, ఆర్‌వీఈవో జాషువా క్వారీలో తనిఖీలు నిర్వహించారు. ఇందుకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోలేదు. తనిఖీల తర్వాత నివేదికను కూడా వారికి సమర్పించలేదు. స్టోన్ క్రషర్ యజమానులకు ఫోన్ చేసి.. వెంటనే రజనిని కలవాలని, లేకుంటే రూ.50 కోట్లు జరిమానా విధిస్తానని ఆర్‌వీఈవో బెదిరించారు. డబ్బు వసూలు చేయాలనే ఉద్దేశంతోనే నిందితులు కుట్రపన్నారు. అప్పటి ఎమ్మెల్యే రజని సూచనల మేరకే క్వారీలో తనిఖీలు నిర్వహించినట్లు జాషువా వాంగ్మూలం ఇచ్చారు. ఆమె అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినట్లు స్పష్టమవుతోంది. వ్యాపారులను బెదిరించి, డబ్బులు వసూలు చేయడం ఎమ్మెల్యే అధికారిక విధుల్లోకి రాదు. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఎ)కింద ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు సంబంధిత అథారిటీ నుంచి అనుమతి తీసుకోవలసిన అవసరం లేదు. సొమ్ము వసూలు చేసే నాటికి రజని ఎమ్మెల్యేగా ఉన్నారు. అనంతరం మంత్రి అయ్యారు. 2024 జూన్ వరకు ఆ పదవిలో కొనసాగారు. వసూళ్ల వ్యవహారాన్ని బయటపెడితే ఎస్సీ ఎస్టీ కేసులు పెడతామని గోపి స్టోన్ క్రషర్ యజమానులను బెదిరించారు. అందుకే వారు అప్పట్లో ఫిర్యాదు చేయలేకపోయారు. ఈ కారణంతోనే ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం జరిగింది. ఏసీబీ దర్యాప్తు ప్రస్తుతం కీలక దశలో ఉంది. పిటిషనర్లను కస్టడీలోకి తీసుకుని విచారించాలి. ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేయండి' అని కోరారు.

దర్యాప్తునకు సహకరిస్తాం..

రజని పీఏ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. డబ్బు చెల్లించాలని ఫిర్యాదుదారును బెదిరించినట్లు పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని.. అప్పటి ఎమ్మెల్యే రజని చెప్పిన సమాచారాన్ని మాత్రమే ఫిర్యాదుదారుకు తెలియజేశారని.. కాబట్టి బలవంతపు వసూళ్ల కింద ఆయనపై నమోదు చేసిన కేసు చెల్లుబాటు కాదన్నారు. కస్టోడియల్ విచారణ అవసరం లేదని, దర్యాప్తునకు సహకరిస్తారని.. ఘటన జరిగిన నాలుగేళ్ల తర్వాత కేసు నమోదు చేశారని.. వీటిని పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయాలని కోరారు. రజని, గోపి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, న్యాయవాది మహేశ్వరరెడ్డి రిప్లయ్ వాదనలు వినిపించారు. క్రషర్ యజమానులకు భౌతికహాని తలపెట్టాలనే ఉద్దేశం పిటిషనర్లకు లేదని, విజిలెన్స్ దర్యాప్తునకు సహకరించారని, కోర్టు షరతులకు కట్టుబడి ఉంటారని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో.. తీర్పు రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. లిఖితపూర్వకంగా వాదనలు సమర్పించేందుకు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులిచ్చారు.

ఇది జగన్ ప్రభుత్వం అనుకుంటున్నారా..?

- హంద్రీ-నీవా ఇంజనీర్లపై నిమ్మల ఆగ్రహం
- కర్నూలు, అనంతలో విస్తరణ పనుల పరిశీలన
- జూన్ 15లోగా పూర్తిచేయాలని ఆదేశం

కర్నూలు/గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'ఇది జగన్ ప్రభుత్వం అనుకున్నారా..? ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో ఉన్నామనే భ్రమల్లో ఉన్నారా..? ఇది విజనరీ సీఎం చంద్రబాబు ప్రభుత్వం' అంటూ హంద్రీ-నీవా ప్రాజెక్టు ఇంజనీర్లపై జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్లు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని హితవు పలికారు. హంద్రీ-నీవా కాలువను తీవ్ర నిర్లక్ష్యంచేసి.. రాయలసీమ ప్రజలకు జగన్ తీరని ద్రోహం చేశారని విమర్శించారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ఫేజ్-1 కింద రూ.695 కోట్లతో ఉమ్మడి కర్నూలు జిల్లా మల్యాల లిఫ్ట్ నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువను విస్తరించే పనులు చేపట్టారు. ఫేజ్-2 కింద ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో రూ.1,500 కోట్లతో విస్తరణ, సీసీ లైనింగ్ పనులు చేస్తున్నారు. మంగళవారం నిమ్మల కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో జరుగుతున్న విస్తరణ పనులను ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డిలతో కలసి పరిశీలించారు. అలాగే గుంతకల్లులో కసాపురం వద్ద స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలసి విస్తరణ పనులను తిలకించారు. ప్రాజెక్టు అనంతపురం చీఫ్ ఇంజనీరు (సీఈ) నాగరాజుతో కలసి విస్తరణ, సీసీ లైనింగ్ పనుల తీరుపై ఇంజనీర్లతో సమీక్షించారు. జూన్‌లో కృష్ణా నదికి వరద వస్తే శ్రీశైలం జలాశయం ఎగువ నుంచి హంద్రీ-నీవా కాలువకు నీటిని తీసుకోవాలని గుర్తుచేశారు. అందుచేత జూన్ 15లోగా విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పలు ప్యాకేజీల పనులు పురోగతి నత్తనడకన సాగుతుండడంపై మండిపడ్డారు. మీడియాతో మాట్లాడుతూ.. హంద్రీ-నీవా కాలువ పూర్తి చేస్తే రాయలసీమ సస్యశామలం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రధాన కాలువ, అనుబంధ కాలువలు 700 కిమీ మేర పూర్తి చేశామన్నారు.



గుంతకల్లు సమీపంలో హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

వంశీకి రిమాండ్ పొడిగింపు



విజయవాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌తోపాటు మిగిలిన నిందితులకు న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. ఇంతకుముందు విధించిన రిమాండ్ గడువు ముగియడంతో నిందితులు వంశీ, గంటా వీర్రాజు, వెలినేని శివరామకృష్ణప్రసాద్, నిమ్మ చలపతి, వేల్పూరి వంశీబాబులను విజయవాడలోని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో మంగళవారం హాజరుపరిచారు. వారికి 22 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి హిమబిందు ఆదేశాలు జారీచేశారు. కాగా, వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగాకు రిమాండ్‌లో ఉండగానే మరో రిమాండ్ పడింది. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రంగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో న్యాయాధికారి హిమబిందు రంగాకు ఈ నెల 22 వరకు రిమాండ్ విధించారు.

15న విచారణకు రండి



- పోసానికి సూళ్లూరుపేట పోలీసుల నోటీసులు

తడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణమురళికి పోలీసుల నుంచి మరోసారి పిలుపు వచ్చింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో నమోదైన కేసుకు సంబంధించి 15న విచారణకు హాజరుకావాలని పోలీసులు ఆయనకు నోటీసులిచ్చారు. ఉదయం 11 గంటలకు సూళ్లూరుపేటలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడి నియామకాన్ని వ్యతిరేకిస్తూ పోసాని అసభ్య పదజాలంతో దూషించారు.

విచారణకు రావాలని వేధించడం లేదు

- కాంతిరాణా క్వాష్ పిటిషన్‌పై హైకోర్టుకు తెలిపిన సీఐడీ

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తరచూ నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని వేధిస్తున్నామన్న ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా ఆరోపణల్లో వాస్తవం లేదని సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. ఈ మధ్యకాలంలో విచారణకు రావాలని ఆయనకు నోటీసులు ఇవ్వలేదన్నారు. కౌంటర్ దాఖలు చేశాక.. క్వాష్ పిటిషన్‌పై తుది విచారణ జరపాలని కోరారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ 28కి వాయిదా వేశారు.

ఏసీబీ స్టాండింగ్ కౌన్సిల్‌గా శ్యామ్ సుందర్‌రావు

ఏసీబీ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఎస్. శ్యామ్ సుందర్‌రావు... స్టాండింగ్ కౌన్సిల్, ప్రత్యేక పీపీగా నియమితులయ్యారు.

గాయాలెలా ఉంటాయో తెలియదు!

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గాయాలు ఎలా ఉంటాయో కూడా తనకు తెలియదని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్) మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి వింతగా ఇచ్చిన సమాధానం విని పోలీసులు విస్తుపోయారు. రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఐదో నిందితురాలి(ఏ-5)గా ఉన్న ప్రభావతి.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వరుసగా రెండో రోజు మంగళవారం కూడా దర్యాప్తు అధికారి అయిన ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ఆమె రాగా.. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7.30 వరకు ఆయన ప్రశ్నించారు. సోమవారం మాదిరిగానే విచారణలో తెలియదు, గుర్తులేదు అనడంతోపాటు గాయాలెలా ఉంటాయో తనకు తెలియదని ఆమె చెప్పినట్లు తెలిసింది. రఘురామరాజుకు గాయాలు అయ్యాయి కదా.. లేదని మీరు ఎందుకు నివేదిక ఇచ్చారని ఎస్పీ ప్రశ్నించగా.. 'అసలు గాయాలెలా ఉంటాయో నాకు తెలియదు.. నేను గైనకాలజిస్టును' అని ఆమె బదులిచ్చినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన ఎస్పీ.. మీరు డాక్టర్ డిగ్రీ ఎలా తీసుకున్నారని మండిపడినట్లు తెలిసింది. రెండ్రోజుల విచారణలో ఆమె అసలు సహకరించలేదని తెలుస్తోంది. దీనిపై దర్యాప్తు అధికారి సుప్రీంకోర్టుకు నివేదిక అందజేస్తారని సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.